TGTEL/25/A2394

# ప్రజాక్షేత్రం

ప్రతి క్షణం.. ప్రజల పక్షం

సంపుటి: 03 | సంచిక: 80 | హైదరాబాద్ | మంగళవారం | 08-09-2026 | పేజీలు: 10

## కాళేశ్వరం కట్టించి.. చివరకు కూల్చేశారు..



- కాళేశ్వరం ప్రాజెక్టుపై కేసీఆర్ ఇంకా మాట్లాడటం సిగ్గుచేటని వ్యాఖ్య
- 'నేనే ఇంజనీర్' అంటూ ప్రాజెక్టు నిర్మించి కూల్చేశారని విమర్శ
- * కాళేశ్వరం నిర్మాణానికి లక్ష కోట్లు ఖర్చు చేసినా ఫలితం లేదని ఆరోపణ
- * ప్రాజెక్టును సరిగ్గా నిర్మించకపోవడం వల్లే ప్రస్తుత సమస్యలని వెల్లడి
- తెలంగాణలో నీటి సమస్యకు కేసీఆర్, ఎల్‌నినో కారణాలని వ్యాఖ్య



## 'బై బై ఖర్గ్'.. 'మూన్ ఈజ్ అవర్స్'

- గంటలో 34 పోస్టులతో ట్రంప్ సంచలనం
- ఇరాన్‌పై వరుసగా ఏఐ చిత్రాలు, వ్యాఖ్యలు
- ఖర్గ్ ద్వీపాన్ని లక్ష్యంగా చేసుకున్న అమెరికా అధ్యక్షుడు
- 'బై బై ఖర్గ్' అంటూ ఏఐ చిత్రం పోస్టు
- ఇరాన్ పటంపై తన ముఖాన్ని ప్రతిబింబించిన ట్రంప్

2



## శాసనసభ కాదు.. అది దుశ్శాసన సభ

- మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల అమానుష ప్రవర్తన: కేటీఆర్
- దాడి వెనుక సీఎం రేవంత్ హస్తం ఉందని ఆరోపణ
- టీషర్టులపై అభ్యంతరకర పదాలంటున్న డీసీపీ ఎవరని ప్రశ్న
- ఏ నిబంధనల ప్రకారం అడ్డుకున్నారో చెప్పాలని డిమాండ్
- రేవంత్‌ను నిలదీస్తున్నారనే అడ్డంకులు సృష్టించారని విమర్శ
- శాసనసభను 'దుశ్శాసన సభ'గా మార్చేశారని ధ్వజం
- ప్రజల దృష్టి మరల్చేందుకే కొత్త డ్రామాకు తెరలేపారని ఆరోపణ
- సీఎంను విమర్శిస్తే మైక్ ఇవ్వబోమనడం సరికాదన్న కేటీఆర్
- మహిళా నేతలకు క్షమాపణ
- చెప్పే వరకు సభలో నిలదీస్తామని స్పష్టం
- ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌పై చర్చకు కేటీఆర్ సవాల్

హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):

సీఎం రేవంత్ రెడ్డి వైఖరిని, పోలీసుల తీరును తీవ్రంగా నిరసిస్తూ తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విలేకరుల సమావేశం నిర్వహించారు. తాము సభలో ఎలాంటి అన్ పార్లమెంటరీ పదాలు మాట్లాడలేదని, రాహుల్ గాంధీ తరహాలోనే టీషర్టులతో ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపామని స్పష్టం చేశారు. అసెంబ్లీలో ఎంత రెచ్చగొట్టినా సంయమనం పాటించాలని కేసీఆర్ తమకు సూచించారని, కానీ రేవంత్ రెడ్డి ఆయన పోలీస్ బృందంతో కలిసి అత్యంత కిరాతకంగా వ్యవహరించారని మండిపడ్డారు. సునీతా లక్ష్మారెడ్డి,

మిగతా 2లో..

## కోటి ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోంది

- 'సర్' పేరుతో వ్యతిరేక ఓట్ల తొలగింపునకు ప్లాన్
- గ్రామాల్లో ఉన్నవారి ఓట్లను తీసేస్తున్నారని సీఎం ఆరోపణ
- తన నియోజకవర్గంలో 80 వేల ఓట్లు తొలగించే ప్రయత్నమని వెల్లడి
- ఓట్ల తొలగింపుపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన
- బిహార్, బెంగాల్ విధానాన్ని అమలు చేస్తామంటున్న బీజేపీ నేతలు
- 'సర్'కు వ్యతిరేకంగా బీఆర్ఎస్ ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్న
- 2029లో మోదీ ఓటమికి ఓట్లే పునాది అవుతాయని వ్యాఖ్య
- దేశానికి మోదీ అత్యంత ప్రమాదకరమైన వ్యక్తి అని విమర్శ
- మోదీ ఓటమే కమ్యూనిస్టుల గెలుపు అని సీఎం వ్యాఖ్య
- ప్రజాస్వామ్య పరిరక్షణకు అంతా అప్రమత్తంగా ఉండాలని పిలుపు



హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):

'సర్' పేరుతో వ్యతిరేక ఓట్లను తొలగించే ప్రయత్నం జరుగుతోందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. తెలంగాణలో కోటి ఓట్లను తీసేసే కుట్ర జరుగుతోందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో నివసిస్తున్న ప్రజల ఓట్లను తొలగిస్తున్నారని మండిపడ్డారు. తన నియోజకవర్గంలోనే 80 వేల ఓట్లను తొలగించే ప్రయత్నం జరుగుతోందని సీఎం ఆరోపించారు. రవీంద్రభారతిలో కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి సంస్మరణ సభ సోమవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి.. సారంపల్లి మల్లారెడ్డి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం మాట్లాడిన ఆయన ఓట్ల తొలగింపు అంశంపై తీవ్ర ఆరోపణలు చేశారు.

**కోటి ఓట్లను తొలగించే కుట్ర**

తెలంగాణలో కోటి ఓట్లను తొలగించేందుకు కుట్ర జరుగుతోందని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ముఖ్యంగా గ్రామాల్లో ఉన్న ప్రజల ఓట్లను తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. తన నియోజకవర్గంలోనే 80 వేల ఓట్లను తొలగించేందుకు ప్రయత్నం జరుగుతోందని చెప్పారు. ఈ పరిణామాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

**'సర్'పై బీఆర్ఎస్ ఎందుకు మౌనం?**

'సర్'కు వ్యతిరేకంగా బీఆర్ఎస్ ఒక్క మాట కూడా ఎందుకు మాట్లాడటంw

మిగతా 2లో..



## యూట్యూబర్ నందన అరెస్ట్

- శంషాబాద్ ఎయిర్‌పోర్టులో నందనను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- లుక్ అవుట్ నోటీసుల నేపథ్యంలో యాక్షన్
- కృష్ణా జిల్లా ఇబ్రహీంపట్నం పోలీసులకు సమాచారం
- లండన్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ డబ్బులు వసూలు
- నందన దంపతులపై పలువురు బాధితుల ఫిర్యాదులు
- భారీగా నగదు వసూలు చేసినట్లు పోలీసుల దర్యాప్తు
- వ్యవహారంపై ఇబ్రహీంపట్నం పోలీసుల కేసు నమోదు
- ఇప్పటికే దర్యాప్తు చేపట్టిన పోలీసులు
- నందనపై ఉన్న కేసుల ఆధారంగా తదుపరి చర్యలకు సిద్ధం
- లుక్ అవుట్ నోటీసుల ఆధారంగా విచారణకు ఏర్పాట్లు

2

హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):

యూట్యూబర్ నందనను శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆమెపై లుక్ అవుట్ నోటీసులు జారీ కావడంతో ఎయిర్‌పోర్టులో పోలీసులు గుర్తించినట్లు సమాచారం. అనంతరం ఈ విషయాన్ని ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా ఇబ్రహీంపట్నం పోలీసులకు సమాచారం ఇచ్చారు.

**లండన్ ఉద్యోగాల పేరుతో డబ్బులు?**

లండన్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ పలువురి నుంచి నందన, ఆమె భర్త భారీగా డబ్బులు

## మహిళలను అవమానిస్తే.. చట్టం తన పని తాను చేసుకుపోతుంది

- మహిళలపై అభ్యంతరకర వ్యాఖ్యలను సహించబోమని సీఎం హెచ్చరిక
- భావప్రకటనా స్వేచ్ఛాన్ని ఎలా ఉపయోగిస్తున్నామో ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచన
- మహిళలను కించపరిచేలా మాట్లాడటం ఆమోదయోగ్యం కాదని స్పష్టీకరణ
- ద్వంద్వార్థం వచ్చే పదాలు వాడుతున్నారని పరోక్షంగా విమర్శ
- మనందరి ఇళ్లలో తల్లి, అక్కా చెల్లెళ్లు ఉన్నారని సీఎం వ్యాఖ్య
- మహిళలను అవమానిస్తే చట్టం తన పని తాను చేసుకుపోతుందని హెచ్చరిక
- ఉదయనిధి స్టాలిన్ వ్యాఖ్యలపై పరోక్షంగా స్పందించిన విజయ్
- జయలలిత అసెంబ్లీలో ఎదుర్కొన్న అవమానాలను గుర్తుచేసిన సీఎం
- పోలీసు వ్యవస్థ రాష్ట్ర అభివృద్ధికి పునాది అని విజయ్ వ్యాఖ్య
- అవినీతిని సహించేది లేదని, లాకప్ నేరాలపై పారదర్శక విచారణకు హామీ



2

## సునీతా లక్ష్మారెడ్డి చీర లాగితే ఆవేశం రాదా?

- అసెంబ్లీ గేటు వద్ద ఘటన ప్రజాస్వామ్యంలో బ్లాక్ డే
- మాజీ మంత్రి సునీతా లక్ష్మారెడ్డిని పోలీసులు అవమానించారని ఆరోపణ
- 'మా చెల్లెమ్మ చీర లాగితే ఆవేశం రాదా' అంటూ హరీశ్‌రావు ప్రశ్న
- 'అక్క చీర లాగితే తమ్ముడు చూస్తూ ఊరుకుంటాడా' అని నిలదీత
- సబితా ఇంద్రారెడ్డి గొంతు పోలీసులు నులిమారని ఆరోపణ
- జగదీశ్‌రెడ్డిని కిందపడేసి తొక్కారని హరీశ్‌రావు వ్యాఖ్య
- బీఆర్ఎస్ నేతల టీషర్టులపై అభ్యంతరకర నినాదాలు లేవని వెల్లడి




2



## పురాతన ఆలయాల సంరక్షణకు కట్టుబడి ఉన్నాం..

- గోదావరి పుష్కరాలను అద్భుతంగా నిర్వహిస్తాం..
- ధర్మపురి నియోజకవర్గంలో రూ. 200 కోట్లతో పుష్కరాలకు అభివృద్ధి పనులు..
- ఉగ్ర నరసింహ స్వామి పునర్ నిర్మాణం లో పాల్గొనడం అదృష్టం..
- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క..

ధర్మపురి/జగిత్యాల ,(ప్రజాక్షేత్రం)

రాష్ట్రంలోని పురాతన ఆలయాల సంరక్షణకు రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నాయకత్వంలో పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. జగిత్యాల జిల్లా ధర్మపురి లోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ఉగ్ర నరసింహ స్వామి పునర్ నిర్మాణ పనులకు సోమవారం తెల్లవారుజామున రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు లతో కలిసి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ వేద పండితులు మంత్రులకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ముందుగా ఉగ్ర నరసింహ స్వామి ఆలయంలో ఉపముఖ్యమంత్రి తో పాటు మంత్రి లక్ష్మణ్ కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శాస్త్రోక్తంగా నిర్వహించిన భూమి పూజ కార్యక్రమంలో మంత్రులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క మాట్లాడుతూ 9 ఏళ్ల బీఆర్ఎస్ పాలనకు చరమగీతం పాడిన తెలంగాణ ప్రజలు రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్నారని అన్నారు. ప్రజలు ఎన్నుకున్న ప్రజా ప్రభుత్వంలో ప్రజల ఆలోచనలకు అనుగుణంగా పరిపాలన సాగిస్తున్నామని అన్నారు. 2027లో నిర్వహించే గోదావరి పుష్కరాలను రాష్ట్ర ప్రభుత్వం అద్భుతంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. ఇందులో భాగంగా బాసర నుండి భద్రాచలం వరకు ఉన్న ప్రముఖ ఆలయాలను అభివృద్ధి చేయడంతో పాటు పుష్కరాలకు వచ్చే భక్తులకు మౌలిక సదుపాయాలు కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. పుష్కరాల పనులు

మిగతా 2లో..



బీర్కూర్ మండలం బైరాపూర్ గ్రామంలో ప్రభుత్వ అసైన్‌మెంట్ భూమి వ్యవహారం వివాదాస్పదంగా మారింది. నిబంధనలకు విరుద్ధంగా అసైన్‌మెంట్ భూమిని ప్లాట్లుగా విభజించి విక్రయించారనే ఆరోపణలపై మండల ప్రజావాణి నోడల్ అధికారికి ఫిర్యాదు అందింది. అనుమతులు లేని లేఅవుట్, రైతు భరోసా నిధుల పొందడం, రాజకీయ జోక్యం, బెదిరింపులపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుదారు కోరారు.

## అసైన్‌మెంట్ భూమిలో అక్రమ లేఅవుట్!

3

- అధికారుల అనుమతులు లేకుండానే 12 ప్లాట్లు.. యథేచ్ఛగా విక్రయాలు?
- రైతు భరోసా నిధులపైనా ఆరోపణలు.. రాజకీయ ఒత్తిళ్లు, బెదిరింపులపై ఫిర్యాదు

## కోటి ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోంది

మొదటిపేజీ తరువాయి

లేదని సీఎం ప్రశ్నించారు. ఓట్ల తొలగింపు అంశంపై అన్ని వర్గాలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల ఓటు హక్కును కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు.

**బీజేపీ నేతలపై విమర్శలు**

బిహార్, బెంగాల్ విధానాన్ని ఉపయోగిస్తామని బీజేపీ నేతలు బరితెగించి మాట్లాడుతున్నారని రేవంత్‌రెడ్డి విమర్శించారు. ఓట్ల వ్యవహారంలో జరుగుతున్న పరిణామాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ఓట్ల తొలగింపు అంశం 2029 ఎన్నికల్లో కీలక ప్రభావం చూపుతుందని సీఎం వ్యాఖ్యానించారు. ఈ ఓట్లతోనే 2029లో ప్రధాని మోదీ ఓటమికి పునాది పడుతుందని అన్నారు. ఓట్ల తొలగింపుపై ప్రజలు, రాజకీయ పార్టీలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

**మోదీపై తీవ్ర వ్యాఖ్యలు**

ప్రధాని మోదీ దేశానికి అత్యంత ప్రమాదకరమైన వ్యక్తి అని రేవంత్‌రెడ్డి విమర్శించారు. మోదీ ఓటమే కమ్యూనిస్టుల గెలుపు అని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత కీలకమని, దాని పరిరక్షణకు అందరూ జాగ్రత్తగా ఉండాలని సీఎం సూచించారు.

## శాసనసభ కాదు.. అది దుశ్శాసన సభ

మొదటిపేజీ తరువాయి

సబితా ఇంద్రారెడ్డి మహిళా ఎమ్మెల్యేలపై పోలీసులు అమానుషంగా ప్రవర్తించారని, పోలీసు బలగం దుర్మార్గమైన చర్యలను ప్రజలంతా గమనించారని అన్నారు. ఈ దాడి వెనుక ముమ్మాటికీ సీఎం రేవంత్ రెడ్డి హస్తమే ఉందన్న కేటీఆర్, టీషర్టులపై అభ్యంతరకర పదాలు ఉన్నాయనడానికి డీసీపీ శిల్పవల్లి ఎవరని ప్రశ్నించారు. ఏ రూల్ ప్రకారం తమను అడ్డుకున్నారో చెప్పకుండా, రేవంత్ రెడ్డిని నిలదీస్తున్నారనే నెపంతోనే ఈ అడ్డంకులు సృష్టించారని ధ్వజమెత్తారు. శాసనసభను దుశ్శాసన సభగా మార్చేశారని, ప్రజల దృష్టిని మరల్చేందుకే ప్రభుత్వం కొత్త డ్రామాకు తెరలేపిందని విమర్శించారు.

స్పీకర్ స్థానంలో ఉండి వివక్ష చూపించడం తగదని, సీఎంను విమర్శిస్తే మైక్ ఇవ్వబోమనడం సరికాదని హితవు పలికారు. గలాటాకు ఆద్యుడైన ముఖ్యమంత్రి నిరసనకారులకు, మహిళా నేతలకు క్షమాపణ చెప్పే వరకు సభలో నిలదీస్తామని తేల్చిచెప్పారు. నాడు డి.కె. అరుణకు తాము క్షమాపణ చెప్పిన విషయాన్ని, తాతా మధు విచారణ వ్యక్తం చేయాలని కేసీఆర్ ఆదేశించిన అంశాన్ని గుర్తుచేశారు. దళితులపై ప్రేమ ఉంటే ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌పై చర్చ పెట్టాలని సవాల్ విసిరారు.

సభలో బూతులు మాట్లాడే రేవంత్ రెడ్డి నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. వంద రోజుల్లో హామీలు అమలు చేయని రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని, ఈ దాడికి నిరసనగా తాము బీఏసీ సమావేశాన్ని బహిష్కరిస్తున్నామని ప్రకటించారు. గవర్నర్ అపాయింట్‌మెంట్ కోరామని, కాంగ్రెస్‌బీజేపీ కుమ్మక్కయ్యాయని ఆరోపించారు. స్పీకర్ పక్షపాతంగా వ్యవహరిస్తే అవసరమైతే ఆయనపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడతామని హెచ్చరించారు.

## మహిళలను అవమానిస్తే.. చట్టం తన పని తాను చేసుకుపోతుంది

- **మహిళలపై అభ్యంతరకర వ్యాఖ్యలను సహించబోమని సీఎం హెచ్చరిక**
- **భావప్రకటనా స్వేచ్ఛాన్ని ఎలా ఉపయోగిస్తున్నామో ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచన**
- **మహిళలను కించపరిచేలా మాట్లాడటం ఆమోదయోగ్యం కాదని స్పష్టీకరణ**
- **ద్వంద్వార్థం వచ్చే పదాలు వాడుతున్నారని పరోక్షంగా విమర్శ**
- **మనందరి ఇళ్లలో తల్లి, అక్కా చెల్లెళ్లు ఉన్నారని సీఎం వ్యాఖ్య**
- **మహిళలను అవమానిస్తే చట్టం తన పని తాను చేసుకుపోతుందని హెచ్చరిక**
- **ఉదయనిధి స్టాలిన్ వ్యాఖ్యలపై పరోక్షంగా స్పందించిన విజయ్**
- **జయలలిత అసెంబ్లీలో ఎదుర్కొన్న అవమానాలను గుర్తుచేసిన సీఎం**
- **పోలీసు వ్యవస్థ రాష్ట్ర అభివృద్ధికి పునాది అని విజయ్ వ్యాఖ్య**
- **అవినీతిని సహించేది లేదని, లాకప్ నేరాలపై పారదర్శక విచారణకు హామీ**

చెన్నై,(ప్రజాక్షేత్రం)

మహిళలపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేస్తే చట్టం చూస్తూ ఊరుకోదని తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ హెచ్చరించారు. భావప్రకటనా స్వేచ్ఛాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉపయోగించుకోవాలని సూచించారు. తాము మాట్లాడే మాటలు ప్రజలు గమనిస్తుంటారనే విషయాన్ని గుర్తుంచుకోవాలని అన్నారు. నటి త్రిషను ఉద్దేశించి ఉదయనిధి స్టాలిన్ ఇటీవల చేసిన వ్యాఖ్యలపై దుమారం కొనసాగుతున్న నేపథ్యంలో.. శాసనసభలో సీఎం విజయ్ ఈ అంశంపై పరోక్షంగా స్పందించారు.

**ద్వంద్వార్థ వ్యాఖ్యలపై హెచ్చరిక**

కొందరు మాట్లాడేటప్పుడు ద్వంద్వార్థం వచ్చే పదాలను ఉపయోగిస్తున్నారని విజయ్ అన్నారు. వాటిని ప్రజలందరూ గమనిస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరి కుటుంబంలోనూ తల్లి, అక్కా చెల్లెళ్లు ఉంటారని గుర్తుచేశారు. మహిళలను అవమానించేలా మాట్లాడితే చట్టం తన పని తాను చేసుకుపోతుందని స్పష్టం



చేశారు.

మహిళలను కించపరిచే వ్యాఖ్యలను రాజకీయ కోణంలో చూడకూడదని విజయ్ సూచించారు. ఉదయనిధి స్టాలిన్ పేరును ప్రస్తావించకుండానే ఆయన చేసిన వ్యాఖ్యలపై పరోక్షంగా తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు.

**జయలలిత అవమానాలను గుర్తుచేసిన సీఎం**

ఇదే అసెంబ్లీలో దివంగత ముఖ్యమంత్రి జయలలిత ఎన్ని అవమానాలు ఎదుర్కొన్నారో అందరూ చూశారని విజయ్ అన్నారు. ప్రతి ఒక్కరికీ మాట్లాడే స్వేచ్ఛ ఉంటుందని, అయితే ఆ స్వేచ్ఛను బాధ్యతగా ఉపయోగించుకోవాలని సూచించారు. తాము మాట్లాడే ప్రతి మాటను ప్రజలు గమనిస్తుంటారని గుర్తుంచుకోవాలని హెచ్చరించారు.

**పోలీసుల విధుల్లో జోక్యం వద్దు**

రాష్ట్రంలో శాంతిభద్రతల నిర్వహణపై వచ్చిన విమర్శలకు కూడా విజయ్ దీటుగా బదులిచ్చారు. పోలీసు వ్యవస్థ కేవలం అరెస్టులు చేయడానికి మాత్రమే కాదని, రాష్ట్ర అభివృద్ధికి అది పునాది అని తెలిపారు. పోలీసులు చట్టాన్ని పాటించే వారికి మిత్రులుగా, చట్టాన్ని ఉల్లంఘించే వారికి శత్రువులుగా ఉంటారని పేర్కొన్నారు.

రాజకీయ నాయకులు, అధికారులు పోలీసుల విధుల్లో జోక్యం చేసుకోకూడదని విజయ్ స్పష్టం చేశారు. పోలీసు వ్యవస్థ స్వతంత్రంగా తన విధులు నిర్వర్తించేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు.

**అభివృద్ధిపైనే ప్రభుత్వ దృష్టి**

తమ ప్రభుత్వం విమర్శలపై దృష్టి పెట్టబోదని విజయ్ అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి పెద్దపీట వేయడమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రజలకు అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలపై ప్రభుత్వం దృష్టి సారిస్తుందని తెలిపారు.

**అవినీతిని సహించేది లేదు**

రాష్ట్రంలో అవినీతిని ఎంతమాత్రం సహించబోమని ముఖ్యమంత్రి పునరుద్ఘాటించారు. అధికారులు అవినీతికి పాల్పడితే వారి కుటుంబాలు కూడా సమాజంలో తలదించుకోవాల్సిన పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. అధికారులంతా నిజాయితీగా పనిచేయాలని సూచించారు.

**లాకప్ నేరాలపై పారదర్శక విచారణ**

లాకప్ నేరాలు సాధారణమైనవి కాదని విజయ్ అన్నారు. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు వాటిపై మేజిస్ట్రేట్ ద్వారా పారదర్శక విచారణ జరిపిస్తామని హామీ ఇచ్చారు. చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు పోలీసుల పనితీరులోనూ జవాబుదారీతనం ఉండేలా చూస్తామని స్పష్టం చేశారు.

# పురాతన ఆలయాల సంరక్షణకు కట్టుబడి ఉన్నాం..

మొదటిపేజీ తరువాయి

నిర్వహించడానికి బడ్జెట్లో వెయ్యి కోట్లు కేటాయించినట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ధర్మపురి నియోజకవర్గంలోని ధర్మపురి, కోటిలింగాల క్షేత్రాల అభివృద్ధికి రూ. 200కోట్లు కేటాయించినట్లు భట్టి తెలిపారు.వందల ఏళ్ల చరిత్ర కలిగిన ధర్మపురి ఉగ్ర నరసింహ స్వామి పునర్ నిర్మాణ పనుల ప్రారంభానికి రావడం అదృష్టంగా ఉందని ఉపముఖ్యమంత్రి అన్నారు. అద్భుత కార్యక్రమంలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నట్లు భట్టి విక్రమార్క అన్నారు. వచ్చే పుష్కరాలు నాటికి ఆలయ అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని భట్టి వివరించారు.

**అభివృద్ధి పనులకు శంకుస్థాపన..**

ధర్మపురి లోని ఉగ్ర నరసింహ స్వామి ఆలయ పునర్ నిర్మాణ పనులకు ప్రభుత్వం రూ. 10 కోట్ల కేటాయించగా పనుల ప్రారంభానికి ఉప ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ధర్మపురి మండలం తిమ్మాపూర్ గ్రామంలో నూతనంగా రూ. 2.48 కోట్లతో ఏర్పాటు చేస్తున్న నూతన సబ్ స్టేషన్ పనులకు శంకుస్థాపన చేశారు. 2027 గోదావరి పుష్కరాలకు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా ధర్మపురి వద్ద గోదావరిలో పుష్కర ఘాట్ల నిర్మాణానికి రూ. 22. 16 కోట్లతో చేపట్టిన పనులకు శంకుస్థాపన చేశారు. ధర్మపురి, కోటి లింగాలలో రూ. 58.55 కోట్లతో తొమ్మిది రోడ్ల నిర్మాణ పనులకు భట్టి విక్రమార్క శంకుస్థాపన చేశారు.

**ధర్మపురికి రూ. 80కోట్లు మంజూరు..**

జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గంలో పర్యటించిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ధర్మపురి నియోజకవర్గంలో నిర్వహించే గోదావరి పుష్కరాలకు మరో 80 కోట్ల రూపాయలు కేటాయిస్తున్నారు ప్రకటించారు. గోదావరి పుష్కరాలకు ఇప్పటికే ధర్మపురి నియోజకవర్గానికి 117 కోట్లు విడుదల గాక ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క రూ. 80కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించడంతో ధర్మపురి నియోజకవర్గానికి గోదావరి పుష్కరాల నిధులు సుమారుగా 200 కోట్లకు చేరింది.

**లక్ష్మీ నరసింహ స్వామి దయతో ముందుకు..**
**రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్..**

ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దయతో ముందుకు సాగుతున్నామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ధర్మపురి ప్రజల ఆశీస్సులతో విజయం సాధించి నియోజకవర్గాన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నానని మంత్రి తెలిపారు.

## సునీతా లక్ష్మారెడ్డి చీర లాగితే ఆవేశం రాదా?

- **అసెంబ్లీ గేటు వద్ద ఘటన ప్రజాస్వామ్యంలో బ్లాక్ డే**
- **మాజీ మంత్రి సునీతా లక్ష్మారెడ్డిని పోలీసులు అవమానించారని ఆరోపణ**
- **'మా చెల్లెమ్మ చీర లాగితే ఆవేశం రాదా' అంటూ హరీశ్‌రావు ప్రశ్న**
- **'అక్క చీర లాగితే తమ్ముడు చూస్తూ ఊరుకుంటాడా' అని నిలదీత**
- **సబితా ఇంద్రారెడ్డి గొంతు పోలీసులు నులిమారని ఆరోపణ**
- **జగదీశ్‌రెడ్డిని కిందపడేసి తొక్కారని హరీశ్‌రావు వ్యాఖ్య**
- **బీఆర్ఎస్ నేతల టీషర్టులపై అభ్యంతరకర నినాదాలు లేవని వెల్లడి**
- **రాహుల్, ప్రియాంక నిరసన టీషర్టులతో పార్లమెంట్‌కు వెళ్లలేదా అని ప్రశ్న**
- **'వారికో న్యాయం.. మాకో న్యాయమా' అంటూ ప్రభుత్వంపై మండిపాటు**
- **ప్రతిపక్షం లేకుండానే అసెంబ్లీలో చర్చ జరపాలని చూస్తున్నారని ఆరోపణ**

హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):

తెలంగాణ అసెంబ్లీ గేటు వద్ద మాజీ మంత్రి సునీతా లక్ష్మారెడ్డి చీరను పోలీసులు లాగారంటూ బీఆర్ఎస్ చేస్తున్న ఆరోపణలపై మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రంగా స్పందించారు. ఈ ఘటన ప్రజాస్వామ్యంలో బ్లాక్ డే అని అభివర్ణించారు. సునీతా లక్ష్మారెడ్డి చీర లాగి ఆమెను అవమానించారని ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష నేతల పట్ల పోలీసులు వ్యవహరిస్తున్న తీరుపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మా చెల్లెమ్మ చీర లాగితే ఆవేశం రాదా.. అక్క చీర లాగితే తమ్ముడు చూస్తూ ఊరుకుంటాడా' అని హరీశ్‌రావు ప్రశ్నించారు. మహిళా ప్రజాప్రతినిధి పట్ల పోలీసులు అనుచితంగా వ్యవహరించారని ఆరోపిస్తూ ప్రభుత్వ తీరును తప్పుబట్టారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో నిరసన తెలిపే హక్కు ప్రతిపక్షాలకు ఉందని, ఆ హక్కును అడ్డుకోవడం సరికాదని అన్నారు.

**సబితా గొంతు నులిమారు**

నిరసన సందర్భంగా పోలీసులు తమ పార్టీ నేతలపై వ్యవహరించిన తీరును కూడా హరీశ్‌రావు ప్రస్తావించారు. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి గొంతును పోలీసులు నులిమారని ఆరోపించారు. మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిని కిందపడేసి తొక్కారని చెప్పారు. ప్రతిపక్ష నేతల పట్ల పోలీసుల ప్రవర్తన తీవ్ర అభ్యంతరకరంగా ఉందని విమర్శించారు.

**టీషర్టులపై అభ్యంతరం ఎందుకు?**

బీఆర్ఎస్ నేతలు ధరించిన టీషర్టులపై ప్రభుత్వం, పోలీసులు అభ్యంతరం వ్యక్తం చేయడాన్ని కూడా హరీశ్‌రావు తప్పుబట్టారు. తమ టీషర్టులపై ఎలాంటి అభ్యంతరకర నినాదాలు లేవని స్పష్టం చేశారు. గతంలో కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ నిరసన టీషర్టులతో పార్లమెంట్‌కు వెళ్లలేదా అని ప్రశ్నించారు. రాహుల్, ప్రియాంకలకు ఒక న్యాయం.. తమకు మరో న్యాయమా అని హరీశ్‌రావు నిలదీశారు. నిరసన తెలిపే విషయంలో అధికార, ప్రతిపక్ష పార్టీలకు వేర్వేరు నిబంధనలు ఉండకూడదని అన్నారు.

**ప్రతిపక్షం లేకుండానే చర్చా?**

అసెంబ్లీలో ప్రతిపక్షం లేకుండానే చర్చ జరపాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందని హరీశ్‌రావు ఆరోపించారు. ప్రజల సమస్యలను లేవనెత్తేందుకు ప్రతిపక్షానికి అవకాశం ఇవ్వకుండా సభను నిర్వహించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై పోలీసులు వ్యవహరించిన తీరుపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సునీతా లక్ష్మారెడ్డి ఘటనతో పాటు సబితా ఇంద్రారెడ్డి, జగదీశ్‌రెడ్డిల విషయంలో చోటుచేసుకున్న పరిణామాలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

## యూట్యూబర్ నందన అరెస్ట్

మొదటిపేజీ తరువాయి

వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారానికి సంబంధించి బాధితుల నుంచి ఫిర్యాదులు అందడంతో ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలుస్తోంది.

**దర్యాప్తు చేపట్టిన పోలీసులు**

నందన దంపతులపై నమోదైన కేసుకు సంబంధించి ఇబ్రహీంపట్నం పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఉద్యోగాల పేరుతో ఎంతమంది నుంచి డబ్బులు వసూలు చేశారు? ఎంత మొత్తంలో నగదు తీసుకున్నారు? తదితర అంశాలపై వివరాలు సేకరిస్తున్నారు.

**తదుపరి చర్యలకు సిద్ధం**

నందనపై నమోదైన కేసులు, ఆమెకు జారీ అయిన లుక్ అవుట్ నోటీసుల ఆధారంగా పోలీసులు తదుపరి చర్యలకు సిద్ధమవుతున్నారు. ఎయిర్‌పోర్టులో అదుపులోకి తీసుకున్న అనంతరం ఆమెను ఇబ్రహీంపట్నం పోలీసులు విచారించే అవకాశం ఉంది. కేసు దర్యాప్తులో వెలుగులోకి వచ్చే వివరాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం.

## శ్రావణ చివరి సోమవారం.. రామలింగేశ్వరుడికి ప్రత్యేక పూజలు

- **స్వామివారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలి.**
- **తాండూర్ నియోజకవర్గం సుభిక్షంగా, అభివృద్ధి పథంలో సాగాలి.**
- **ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి.**

తాండూర్, సెప్టెంబర్ 07(ప్రజాక్షేత్రం):

శ్రావణమాసం చివరి సోమవారం సందర్భంగా తాండూర్ నియోజకవర్గంలోని బషీరాబాద్ మండలంలోని శ్రీ ఏకాంబరి రామలింగేశ్వర స్వామివారి ఆలయంలో తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్సీ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ నిర్వాహకులు, భక్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక అభిషేకాలు, పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. శ్రీ రామలింగేశ్వర స్వామివారి ఆశీస్సులు బషీరాబాద్ మండలంతో పాటు తాండూర్ నియోజకవర్గ ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాల



తో జీవించాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని, నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. శ్రావణమాసం చివరి సోమవారం కావడంతో ఆలయంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం భక్తుల సందడితో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీపీసీసీ ప్రచార కోఆర్డినేటర్ కర్ణం పురుషోత్తం రావు, బషీరాబాద్ మండలం నీళ్లపల్లి గ్రామ నాయకులు సుధాకర్ రెడ్డి, ఆలయ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, పి.కె. నర్సిములు, పెంటప్ప, మాజీ ఎంపీటీసీ బాబు, బి. వెంకటయ్య, గౌతమ్, బీదర్ రాజశేఖర్, యువ నాయకులు సిద్ధూ పంతులు, రవి కుమార్‌తో పాటు గ్రామ భక్తులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బై బై ఖర్గ్'.. 'మూన్ ఈజ్ అవర్స్'..

అమెరికా, (ప్రజాక్షేత్రం):

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి సోషల్ మీడియా వేదికగా సంచలన వ్యాఖ్యలు, చిత్రాలతో వార్తల్లో నిలిచారు. ట్రూత్ సోషల్‌లో గంట వ్యవధిలోనే దాదాపు 34 పోస్టులు చేస్తూ ఇరాన్, అమెరికా ఆర్థిక పరిస్థితి, అంతరిక్షం, భౌగోళిక ప్రాంతాల పేర్లపై వరుసగా పోస్టులు పెట్టారు. వీటిలో అనేకం ఏఐ సృష్టించిన చిత్రాలు, గ్రాఫిక్స్ కావడం విశేషం.

ముఖ్యంగా ఇరాన్‌లోని కీలక చమురు ఎగుమతి కేంద్రం ఖర్గ్ ద్వీపాన్ని ప్రస్తావిస్తూ ట్రంప్ చేసిన పోస్టు తీవ్ర చర్చకు దారితీసింది. 'బై బై ఖర్గ్' అనే సందేశంతో ఆయన షేర్ చేసిన ఏఐ చిత్రంలో ఓ యుద్ధ విమానం ఖర్గ్ ద్వీపంలోని చమురు మౌలిక సదుపాయాల వైపు దూసుకెళ్తున్నట్లుగా, అక్కడ భారీగా మంటలు చెలరేగినట్లుగా చూపించారు.

ఖర్గ్ ద్వీపం ఇరాన్ చమురు ఎగుమతులకు అత్యంత కీలకమైన ప్రాంతం. యుద్ధానికి ముందు ఇరాన్ చమురు ఎగుమతుల్లో సుమారు 90 శాతం ఈ కేంద్రం మీదుగానే జరిగేవని రాయిటర్స్ పేర్కొంది. అయితే ట్రంప్ గతంలో ఖర్గ్ ద్వీపం ధ్వంసమైనట్లుగా ఏఐ వీడియోను పోస్టు చేసినప్పటికీ, అది వాస్తవ సైనిక దాడికి సంబంధించిన దృశ్యం కాదని అమెరికా అధికారులు స్పష్టం చేశారు.

ఇదే వరుసలో ఇరాన్ పటంపై తన ముఖం ప్రతిబింబించేలా రూపొందించిన చిత్రాన్ని కూడా ట్రంప్ పోస్టు చేశారు. ఇరాన్ ఆర్థిక వ్యవస్థ, చమురు ఎగుమతులు, కరెన్సీ పతనాన్ని ప్రస్తావిస్తూ పలు గ్రాఫిక్స్‌ను కూడా ఆయన పంచుకున్నారు. ఇరాన్ ఆర్థిక వ్యవస్థ తీవ్ర ఒత్తిడిలో ఉందని చూపించేలా ఈ పోస్టులు ఉన్నాయి.

**చంద్రుడు మాకే సొంతం**

ఇరాన్‌కు సంబంధించిన పోస్టులతో పాటు ట్రంప్ అంతరిక్షంపైనా ఆసక్తికర వ్యాఖ్య చేశారు. అమెరికా జెండాతో ఉన్న చంద్రుడి చిత్రాన్ని పోస్టు చేస్తూ ది మూన్ ఈజ్ అవర్స్ అని పేర్కొన్నారు. చంద్రుడిపై ఏ దేశమూ సార్వభౌమాధికారం ప్రకటించడానికి అంతర్జాతీయ అంతరిక్ష చట్టం అనుమతించదు.

**న్యూ మెక్సికో'.. 'న్యూ అమెరికా**

ఇక అమెరికాలోని న్యూ మెక్సికో రాష్ట్రానికి 'న్యూ అమెరికా'గా పేరు మార్చుతున్నట్లుగా కనిపించే మ్యాప్‌ను కూడా ట్రంప్ షేర్ చేశారు. అయితే రాష్ట్రం పేరును అధికారికంగా మార్చే ఎలాంటి ఉత్తర్వును ట్రంప్ జారీ చేయలేదు. న్యూ మెక్సికో గవర్నర్ మిషెల్ లుహాన్ గ్రిషమ్ కూడా రాష్ట్రం పేరును మార్చే అంశం చర్చలో లేదని స్పష్టం చేశారు.

ఇదే క్రమంలో హార్ముజ్ జలసంధి పేరును 'ట్రంప్ స్ట్రెయిట్'గా మార్చాలన్న సూచనతో కూడిన పోస్టు కూడా ఆయన ఖాతాలో కనిపించింది. అమెరికా ఆధిపత్యాన్ని ప్రతిబింబించేలా పేర్ల మార్పు అంశాన్ని ట్రంప్ తన సోషల్ మీడియా పోస్టుల్లో పదేపదే ప్రస్తావిస్తున్నారు. ఇంతకుముందు గల్ఫ్ ఆఫ్ మెక్సికో పేరును గల్ఫ్ ఆఫ్ అమెరికా'గా మార్చే చర్యలను ట్రంప్ ప్రభుత్వం చేపట్టింది. తాజాగా న్యూ మెక్సికోను 'న్యూ అమెరికా'గా చూపించే పోస్టు, చంద్రుడిపై హక్కు ప్రకటించినట్లుగా ఉన్న వ్యాఖ్య, ఖర్గ్ ద్వీపంపై ఏఐ దృశ్యాలు——అన్నీ కలిపి ట్రంప్ తాజా సోషల్ మీడియా ప్రచారం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

## కాళేశ్వరం కట్టించి.. చివరకు కూల్చేశారు..

- **కాళేశ్వరం ప్రాజెక్టుపై కేసీఆర్ ఇంకా మాట్లాడటం సిగ్గుచేటని వ్యాఖ్య**
- **'నేనే ఇంజనీర్' అంటూ ప్రాజెక్టు నిర్మించి కూల్చేశారని విమర్శ**
- **కాళేశ్వరం నిర్మాణానికి లక్ష కోట్లు ఖర్చు చేసినా ఫలితం లేదని ఆరోపణ**
- **ప్రాజెక్టును సరిగ్గా నిర్మించకపోవడం వల్లే ప్రస్తుత సమస్యలని వెల్లడి**
- **తెలంగాణలో నీటి సమస్యకు కేసీఆర్, ఎల్‌నినో కారణాలని వ్యాఖ్య**
- **నీటి పంపకాల విషయంలో కేసీఆర్ తెలంగాణకు అన్యాయం చేశారని ఆరోపణ**
- **ఇరిగేషన్ శాఖను కేసీఆర్ పూర్తిగా నాశనం చేశారని విమర్శ**
- **ఇరిగేషన్‌లో గత ప్రభుత్వం చేసిన తప్పులే నేటి సమస్యలకు కారణమని వెల్లడి**
- **కేసీఆర్‌కు ఇరిగేషన్‌పై సరైన అవగాహన లేదని మంత్రి వ్యాఖ్య**
- **కేసీఆర్ మాట్లాడిన భాషతో తెలంగాణ భాషకు చెడ్డపేరు వచ్చిందని ఆరోపణ**

హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):

కాళేశ్వరం ప్రాజెక్టుపై మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇంకా మాట్లాడటం సిగ్గుచేటని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. అసెంబ్లీ లాబీలో మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడిన ఆయన.. కాళేశ్వరం నిర్మాణం, తెలంగాణలో ప్రస్తుత నీటి సమస్యలపై కేసీఆర్‌పై తీవ్రస్థాయిలో ఆరోపణలు చేశారు. 'నేనే ఇంజనీర్' అంటూ కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించి, చివరకు కూల్చేశారని ఎద్దేవా చేశారు.

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి లక్ష కోట్ల రూపాయలు ఖర్చు చేసినప్పటికీ.. దాన్ని సరిగ్గా నిర్మించకపోవడం వల్లే ప్రస్తుతం సమస్యలు ఎదురవుతున్నాయని ఉత్తమ్ ఆరోపించారు. భారీగా నిధులు ఖర్చు చేసినా రైతులకు ఆశించిన స్థాయిలో ప్రయోజనం అందలేదని విమర్శించారు. సాగునీటి ప్రాజెక్టులను కేవలం ఖర్చు చేసిన మొత్తంతో కాకుండా రైతులకు అందిన నీరు, సాగులోకి వచ్చిన ఆయకట్టు ఆధారంగా అంచనా వేయాలని ఉత్తమ్ ఇటీవల కూడా పేర్కొన్నారు.

**నీటి సమస్యకు రెండు కారణాలు**

తెలంగాణలో ప్రస్తుతం ఎదురవుతున్న నీటి సమస్యకు రెండు ప్రధాన కారణాలు ఉన్నాయని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. అందులో ఒకటి ఎల్‌నినో కాగా.. మరొకటి కేసీఆర్ అని వ్యాఖ్యానించారు. నీటి పంపకాల విషయంలో కేసీఆర్ తెలంగాణకు అన్యాయం చేశారని ఆరోపించారు. ఇరిగేషన్ శాఖను పూర్తిగా నాశనం చేశారని విమర్శించారు.

**తప్పుల వల్లే ప్రస్తుత సమస్యలు**

ఇరిగేషన్ విషయంలో కేసీఆర్ చేసిన తప్పుల కారణంగానే ప్రస్తుతం రాష్ట్రం ఇబ్బందులు ఎదుర్కొంటోందని ఉత్తమ్ అన్నారు. సాగునీటి ప్రాజెక్టుల విషయంలో గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు రాష్ట్రానికి నష్టం కలిగించాయని ఆరోపించారు. కాళేశ్వరంతో పాటు పలు ప్రాజెక్టులకు భారీగా ఖర్చు చేసినా ఆశించిన ప్రయోజనాలు అందలేదని విమర్శించారు.

**కేసీఆర్ భాషపైనా విమర్శలు**

కేసీఆర్ మాట్లాడిన భాష వల్ల తెలంగాణ భాషకు చెడ్డపేరు వచ్చిందని ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. గతంలో కేసీఆర్ అనుచిత భాష ఉపయోగించినప్పుడు ఆయనను బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు హీరోలా భావించారని వ్యాఖ్యానించారు. ఇప్పుడు అదే భాషను ఆయనపై ఉపయోగిస్తే ఎందుకు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారని ప్రశ్నించారు.

**పాదయాత్రపైనా సెటైర్లు**

కాళేశ్వరం ప్రాజెక్టు పరిస్థితిపై కూడా ఉత్తమ్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. కూలిపోయిన కాళేశ్వరం వద్దకు కేసీఆర్ వెళ్లడం ఏమిటని ప్రశ్నించారు. కేసీఆర్ పాదయాత్ర చేస్తే ప్రజలు నవ్వుకుంటారని వ్యాఖ్యానించారు. ఇరిగేషన్ విషయంలో కేసీఆర్ ఫామ్‌హౌస్‌లోనే ఉండటం మంచిదని కూడా విమర్శించారు.

ఇరిగేషన్ రంగంలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పిదాలను సరిదిద్దుతూ పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడం, అందుబాటులో ఉన్న నీటిని సమర్థంగా వినియోగించడం తమ ప్రభుత్వ లక్ష్యమని ఉత్తమ్ గతంలో స్పష్టం చేశారు. తెలంగాణకు కృష్ణా, గోదావరి జలాల్లో రావాల్సిన వాటా కోసం అవసరమైన అన్ని వేదికలపై పోరాడుతామని కూడా ఆయన తాజాగా తెలిపారు.



## దళిత స్పీకర్‌ను అవమానిస్తే సహించేది లేదు.

- **బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం.**
- **మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొల్లారం వెంకట్ రెడ్డి.**



**శంకర్ పల్లి సెప్టెంబర్ 07(ప్రజాక్షేత్రం):**

రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న దళిత స్పీకర్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని శంకర్‌పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొల్లారం వెంకట్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. స్పీకర్ పదవికి ఉన్న గౌరవాన్ని మరిచి అసభ్య పదజాలంతో మాట్లాడటం బీఆర్ఎస్ నాయకుల అహంకారానికి నిదర్శనమని ఆయన మండిపడ్డారు. దళిత స్పీకర్‌ను అవమానించడం అంటే యావత్ దళిత సమాజాన్ని అవమానించడమేనని అన్నారు. తాతా మధుసూదన్ వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, స్పీకర్‌కు, దళిత సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలే బీఆర్ఎస్ నాయకులకు తగిన గుణపాఠం చెబుతారని బొల్లారం వెంకట్ రెడ్డి హెచ్చరించారు.

## మొయినాబాద్ లో ఘోర రోడ్డు ప్రమాదం

- **డివైడర్‌ను ఢీకొట్టి వ్యక్తి మృతి**



**మొయినాబాద్, సెప్టెంబర్ 07(ప్రజా క్షేత్రం):**

మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఘోర రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందగా, మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సాయంత్రం సుమారు 5 గంటల సమయంలో కృష్ణ (50), నరసింహ (27) అనే ఇద్దరు వ్యక్తులు (ఏపీ 22 ఎఎ 1692 )నంబరు గల మోటార్ సైకిల్‌పై ఓఆర్ఆర్ నుండి మొయినాబాద్ వైపు ప్రయాణిస్తున్నారు. వారు రాణి మద్రాస్ లిమిటెడ్ కంపెనీ సమీపానికి చేరుకోగానే, బైక్ అదుపు తప్పి రోడ్డు డివైడర్‌ను బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన కృష్ణ అయ్యవారిపల్లి, దామరగిద్ద మండలం, నారాయణపేట జిల్లా) సంఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయాడు. తీవ్రంగా గాయపడిన మరో వ్యక్తి నరసింహను మెరుగైన చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మృతుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన మొయినాబాద్ పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## కార్మికుల సంక్షేమానికి ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డ్స్ , లేబర్ కార్డ్స్ పంపిణీ

- **మాజీ ఎంపీపీ, వికారాబాద్ జిల్లా బాయిల్డ్ రైస్ మిల్లర్ అధ్యక్షులు బాలేశ్వర్ గుప్తా**



**యాలాల సెప్టెంబర్ 07(ప్రజాక్షేత్రం):**


యాలాల మండలంలోని లక్ష్మీనారాయణపూర్ కూడలిలో కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం లేబర్ కార్డు, ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డు లను ఉచితంగా అందిస్తుందని వికారాబాద్ జిల్లా బాయిల్డ్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బాలేశ్వర్ గుప్తా అన్నారు. మంగళవారం ఉదయం 10 గంటలకు లక్ష్మీనారాయణపూర్ చౌరస్తాలోని బాలాజీ రైస్ మిల్ లో కార్మికులందరికీ ఉచితంగా లేబర్ కార్డ్స్, ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డ్స్ ఇవ్వడం జరుగుతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర నేషనల్ ఎడ్యుకేషనల్ లేబర్ డిపార్ట్మెంట్ అధికారి సిఓ మహేశ్వర్, జిల్లా లేబర్ డిపార్ట్మెంట్ శ్రామిక మిత్ర సునీత చేతుల మీదుగా ఈ కార్డులను అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా బిజెపి అధ్యక్షులు రమేష్ కుమార్, అగ్గనూర్ సర్పంచి పినమోని మంజుల భీమప్ప, లక్ష్మీనారాయణపూర్ గుర్రాల నాగమణి నర్సిరెడ్డి పాల్గొంటారన్నారు.

## ప్రజావాణికి 56 ఫిర్యాదులు


- **మట్టి గణపతులతో పర్యావరణ పరిరక్షణకు పిలుపు**

**- కలెక్టర్ సి.నారాయణ రెడ్డి**

మహేశ్వరం సెప్టెంబర్ 07(ప్రజాక్షేత్రం): రంగారెడ్డి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు తరలివచ్చి తమ సమస్యలపై వినతిపత్రాలు సమర్పించారు. మొత్తం 56 ఫిర్యాదులు అందగా, వాటిలో రెవెన్యూ శాఖకు 27,ఇతర శాఖలకు 29 వినతులు ఉన్నట్లు అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి మాట్లాడుతూ ప్రజల నుంచి అందే ప్రతి అర్జీని సంబంధిత అధికారులు అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి, ఎలాంటి జాప్యం లేకుండా నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా నిరంతరం సమీక్షిస్తూ ప్రజలకు సత్వర సేవలు అందించాలని సూచించారు. అనంతరం కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో రూపొందించిన "మట్టి గణపతిని పూజిద్దాం - పర్యావరణాన్ని పరిరక్షిద్దాం" పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. వినాయక చవితి సందర్భంగా ప్రజలు ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా మట్టి గణపతులను ప్రతిష్ఠించి, సహజ రంగులు, పర్యావరణ హిత అలంకరణలను వినియోగించాలని ఆయన సూచించారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు విస్తృత ప్రచారం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి,జిల్లా రెవెన్యూ అధికారి శారద,వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.



# అసైన్‌మెంట్ భూమిలో అక్రమ లేఅవుట్!



- **అధికారుల అనుమతులు లేకుండానే 12 ప్లాట్లు.. యథేచ్ఛగా విక్రయాలు?**
- **రైతు భరోసా నిధులపైనా ఆరోపణలు.. రాజకీయ ఒత్తిళ్లు, బెదిరింపులపై ఫిర్యాదు**

**కామారెడ్డి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 7(ప్రజాక్షేత్రం):**

బీర్కూర్ మండలం బైరాపూర్ గ్రామంలో ప్రభుత్వ అసైన్‌మెంట్ భూమి వ్యవహారం తీవ్ర దుమారం రేపుతోంది.ప్రభుత్వ నిబంధనలను పక్కనపెట్టి అసైన్‌మెంట్ భూమిని ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్నారనే ఆరోపణలతో మండల ప్రజావాణి నోడల్ అధికారికి ఫిర్యాదు అందింది.అనుమతులు లేని లేఅవుట్, రైతు భరోసా నిధుల పొందడం, రాజకీయ జోక్యం, బెదిరింపులపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుదారు కోరారు.సర్వే నంబర్ 30/5లో 2 ఎకరాల భూమి ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. బైరాపూర్ గ్రామానికి చెందిన గాదె శ్రీనివాస్‌కు సర్వే నంబర్ 30/5లో 2 ఎకరాల భూమి ప్రభుత్వం అసైన్‌మెంట్‌గా మంజూరు చేసినట్లు పేర్కొన్నారు.అయితే గత నాలుగైదేళ్లుగా ఈ భూమిలో పంటలు సాగు చేయడం లేదని, అయినప్పటికీ భూమిపై రైతు భరోసా నిధులు పొందుతున్నారని ఆరోపించారు.

**పీవోటీ యాక్ట్ నిబంధనలు ఉల్లంఘించారా?**

అసైన్‌మెంట్ భూముల బదలాయింపుపై ఉన్న పీవోటీ యాక్ట్ నిబంధనలను ఉల్లంఘించి ప్రభుత్వ భూమిని విక్రయించిన అంశంపై పూర్తిస్థాయి విచారణ జరపాలని కోరారు.అసైన్‌మెంట్ భూమి విక్రయాలు చట్టబద్ధమేనా? ప్లాట్లుగా విభజించేందుకు ఎవరి అనుమతులు తీసుకున్నారు? రిజిస్ట్రేషన్లు జరిగాయా? అనే అంశాలపై అధికారులు విచారణ చేయాల్సిన అవసరం ఉందని ఫిర్యాదుదారు పేర్కొన్నారు.

**రైతు భరోసా ఎలా వచ్చింది?**

భూమి నాలుగైదేళ్లుగా సాగులో లేకపోతే రైతు భరోసా నిధులు ఎలా జమ అయ్యాయి? అన్న ప్రశ్నను ఫిర్యాదుదారు లేవనెత్తారు.సదరు భూమికి సంబంధించిన రైతు భరోసా వివరాలను పరిశీలించి, అర్హత లేకుండా నిధులు పొందినట్లు తేలితే చర్యలు తీసుకోవాలని కోరారు.

**నాలా లేదు.. లేఅవుట్ అనుమతి లేదు!**

మరోవైపు సదరు భూమికి నాలా (వ్యవసాయేతర భూమిగా మార్పిడి), లేఅవుట్ అనుమతులు లేకుండానే సుమారు 12 ప్లాట్లుగా విభజించి ఇతరులకు విక్రయించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. భూమిపై ఎలాంటి అనుమతులు లేకపోయినా ప్లాట్లుగా విభజించి విక్రయించడం నిబంధనలకు విరుద్ధమని ఆరోపించారు.ఇప్పటికే పలువురు ప్లాట్లు కొనుగోలు చేసి ఉన్నారని, వారి వద్ద ఉన్న బాండ్ పేపర్లు, ఇతర పత్రాలను పరిశీలిస్తే అసలు వ్యవహారం వెలుగులోకి వస్తుందని ఫిర్యాదుదారు అధికారులను కోరారు.

**మిగిలిన భూమిపైనా కన్ను?**

ఇప్పటికే కొంత భూమిని ప్లాట్లుగా మార్చి విక్రయించడంతో పాటు, మిగిలిన భూమిని కూడా ప్లాట్లుగా మార్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఫిర్యాదులో ఆరోపించారు. దీనిని వెంటనే అడ్డుకుని, భూమిపై యథాతథ స్థితిని కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ వ్యవహారంపై ప్రశ్నిస్తున్న స్థానికులను, విచారణ కోరుతున్న వారిని గాదె శ్రీనివాస్ తమ్ముడు మాజీ ఉపసర్పంచ్ బెదిరిస్తూ మా అన్న టైగర్ ద్రోణవల్లి సతీష్, కాబోయే బాన్సువాడ ఎమ్మెల్యే, మా అన్న మాట రాష్ట్రపతి ముద్ర అంటూ ఏదైనా మా అన్న చెప్పినట్టే జరుగుతుంది.అంటూ స్థానికులను,విచారణ కోరుతున్నవారిని రాజకీయ ఒత్తిళ్లతో బెదిరిస్తున్నారనే ఆరోపణలు కూడా ఫిర్యాదులో ఉన్నాయి.అధికారులు ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలని ఫిర్యాదుదారు కోరారు.






**భూమిని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని డిమాండ్**

అసైన్‌మెంట్ నిబంధనలకు విరుద్ధంగా భూమి బదలాయింపు జరిగినట్లు విచారణలో తేలితే పీవోటీ యాక్ట్ ప్రకారం అసైన్‌మెంట్‌ను రద్దు చేసి, 2 ఎకరాల భూమిని తిరిగి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని అధికారులను కోరారు.బైరాపూర్‌లోని ఈ 2 ఎకరాల అసైన్‌మెంట్ భూమి వ్యవహారంపై సమగ్ర విచారణ జరిగితేనే అసలు నిజాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.ప్లాట్ల విక్రయాలు, అనుమతులు, రైతు భరోసా నిధులు, భూమి బదలాయింపు తదితర అంశాలపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

## బీసీలంతా ఐక్యంగా ఉండి రేవంత్ రెడ్డికి మద్దతు ఇవ్వాలి

- **పేదల సొంతింటి కల నెరవేరుస్తున్న ఇందిరమ్మ ఇండ్లు**
- **రేవంత్ రెడ్డి కృషితో లబ్ధిదారులకు ఐదు లక్షలు నేరుగా అందుతున్నాయి**
- **బీఆర్ఎస్ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు పూర్తిగా ఫెయిల్ అయ్యాయి**
- **తెలంగాణ రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజు**

**కోటగిరి సెప్టెంబర్ 07(ప్రజాక్షేత్రం):**

పేద మధ్యతరగతి గురించి ఆలోచించి పని చేసే సీఎం రేవంత్ రెడ్డి లాంటి నాయకుడికి బీసీలు బడుగు బలహీన వర్గాల ప్రజలంతా ఐకమత్యమై మద్దతుగా ఉండాలని తెలంగాణ రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజు పిలుపునిచ్చారు. కోటగిరి మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని రిబ్బన్ కట్ చేసి ఇండ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అప్పటి ఇందిరమ్మ రాజ్యంలో అయినా ఇప్పటి రేవంత్ రెడ్డి పాలనలో అయినా పేద మధ్యతరగతి కుటుంబంలో ఉండే బీసీలు బడుగు బలహీన వర్గాల గురించి ఆలోచించి పరిపాలించే పాలన కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని అన్నారు. బీసీలు బడుగు బలహీన వర్గాలగురించి ఆలోచించే నాయకుడు రేవంత్ రెడ్డికి మనమంతా ఒకటే మద్దతు ఇవ్వాలని బిసిలు బడుగు బలహీన వర్గాల నాయకులకు ,ప్రజలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో నిర్మించే ఇందిరమ్మ ఇండ్లు పేద ప్రజల సొంతింటి కలల నెరవేరుస్తున్నాయని ఇండ్ల నిర్మాణంలో కాంట్రాక్టర్ ప్రమేయం లేకుండా నేరుగా ఐదు లక్షలు లబ్ధిదారిని ఎకౌంట్లో పడేలా రేవంత్ రెడ్డి కృషి చేశారని చెప్పారు. గత బి ఆర్ ఎస్ హయాంలో నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లు కాంట్రాక్టర్ల జేబులు నింపాయని చెప్పారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పథకం పూర్తిగా ఫెయిల్ అయ్యిందని లబ్ధిదారులకు బిల్లులు రాక ఇబ్బందులు పడ్డారని అన్నారు. సీఎం కేసీఆర్ గత పది ఏళ్లలో చేసిన పాపాల వల్లే ప్రస్తుతం ఫామ్ హౌస్ లో పడుకోవాల్సి వస్తుందని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మహిళలకు అన్ని రంగాల్లో చేయూతను ఇస్తుందని మహిళల పేరుతో ఇందిరమ్మ ఇండ్లు, డ్వాక్రా రుణాలు, మండల సమాఖ్యలకు ఆర్టీసీ బస్సులు, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, ఒంటరి మహిళలు వితంతువులకు పెన్షన్లు, ఇస్తూ ఎంతో సహకారం అందిస్తుందని అన్నారు. మహిళలు బీసీలు బడుగు బలహీన వర్గాల కోసం పనిచేస్తున్న రేవంత్ రెడ్డికి రాబోయే ఎన్నికల్లో అందరం ఐక్యమై మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గాయక్వాడ్ హనుమంతు, కోటగిరి మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు బర్ల మధుకర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షాహిద్, మాజీ ఎంపీపీ గంధపు పవన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అనిల్ కులకర్ణి, మాజీ ఎంపీటీసీ కొట్టం మనోహర్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పోశెట్టి, వార్డు మెంబర్లు శ్రీనివాస్, గంగాధర్, గూడు, నాయకులు కోయగురు శ్రీనివాస్,కప్ప గణేష్,సూదం ధనరాజ్, గంధపు దత్తు, సంజు పటేల్, తదితరులు పాల్గొన్నారు.



## అంబురామేశ్వరుడి సన్నిధిలో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి



**పెద్దేముల్, సెప్టెంబర్ 07(ప్రజాక్షేత్రం):**

శ్రావణ మాసం చివరి సోమవారం సందర్భంగా పెద్దేముల్ మండల పరిధిలోని తట్టేపల్లి గ్రామ శివారులో వెలసిన శ్రీ అంబురామేశ్వర స్వామివారిని సోమవారం చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వాదాలు పొందారు. ఆలయానికి విచ్చేసిన ఎంపీకి నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు.ఈ సందర్భంగా చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.....

శ్రీ అంబురామేశ్వర స్వామివారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. శ్రీ అంబురామేశ్వర స్వామివారి కృప ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని కోరుకున్నట్లు ఎంపీ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ వికారాబాద్ జిల్లా అధ్యక్షులు యూ.రమేష్ కుమార్, బీజేపీ నాయకులు కృష్ణ ముదిరాజ్,బంట్వారం భద్రేశ్వర్, హరీష్ గౌడ్, రాము, రమేష్, యాదయ్య గౌడ్, మహిపాల్, రవి, అనంతి, అంజి, ప్రదీప్ తదితర మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇండియన్ గ్యాస్ ఏజెన్సీలో అవినీతి

**వలిగొండ సెప్టెంబర్ 07(ప్రజాక్షేత్రం):**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలోని సుమేధ ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ వద్ద సోమవారం సిలిండర్ తీసుకొని బరువు తక్కువగా ఉన్నది అనే సందేహంతో వినియోగదారుడు బంధారపు రాములు గ్యాస్ ఆఫీస్ దగ్గర ఏజెన్సీ సిబ్బంది ముందే తనిఖీ చెయ్యగా 2.50 కిలోల బరువు తక్కువ రావడం జరిగింది. సిలిండర్ లో ఎటువంటి సమస్య లేదు అని మాకు ఎం తెలియదు ఇండియన్ గ్యాస్ కంపెనీ నుండి అలానే వస్తుంది అని మేనేజర్ తెలియజేసారు. సాధారణంగా సిలిండర్ డెలివరీ సమయంలో బరువు పరిశీలించిన తర్వాతే వినియోగదారులకు అందించాల్సి ఉన్నప్పటికీ, చాలా సందర్భాల్లో తూకం వేయకుండానే సిలిండర్‌ను ఇంటి వద్ద దింపి వెళ్తున్నారు. మేనేజర్ వంశీ నిర్లక్ష్య ధోరణికి వ్యక్తం చేశారు. 2 గంటల నిరీక్షణ తరువాత తనిఖీ చెయ్యడానికి రాకేష్ అనే వ్యక్తి వచ్చి తనిఖీ చేయగ తక్కువ బరువు ఉన్నది. మండలంలో సిలిండర్లు డెలివరీ చేసే వ్యక్తి ఒక్కరే కావడం గమనార్హం. నిజానికి మండలంలోని దళారులు ఏజెన్సీ కూటమిగా అయి అవినీతికిపాల్పడుతున్నారు. ఆఫీస్ కు 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామాలకు ఎటువంటి డెలివరీ చార్జీలు తీసుకోకూడదు అయిన కానీ ప్రజల వద్ద దౌర్జన్యంగా ఎక్కువ డబ్బులు తీసుకుంటున్నారు. ప్రజలకు నిత్యవసరం అయిన గ్యాస్ ఏజెన్సీలో ఎంతో కాలంగా జరుగుతున్న అవినీతిపై అధికారుల నిర్లక్ష్య ధోరణి గురించి ప్రజల్లో ఎన్నో అనుమానాలు ఏర్పడుతున్నాయని మండల ప్రజలు అంటున్నారు.



## పంట నమోదు తప్పనిసరిగా చేయించాలి

- **వ్యవసాయ అధికారి శ్వేత**

**శంషాబాద్ సెప్టెంబర్ 07(ప్రజాక్షేత్రం):**



డిజిటల్ క్రాప్ సర్వేలో భాగంగా రైతులు తాము సాగు చేస్తున్న పంటల వివరాలను వ్యవసాయ శాఖ సిబ్బందికి తెలియజేయాలని ఆన్ లైన్లో నమోదు చేయించాలని మండల వ్యవసాయ అధికారి రాచ శ్వేత సూచించారు. శంషాబాద్ మండలంలోని 29 రెవెన్యూ గ్రామాల్లో ప్రభుత్వం నియమించిన వాలంటీర్లు, వ్యవసాయ సిబ్బంది క్షేత్ర స్థాయిలో పంటల వివరాలను సేకరించి ఆన్ లైన్లో నమోదు చేస్తున్నారని తెలిపారు. పంటల నమోదు ఆధారంగానే ప్రభుత్వం వరి, పత్తి, మొక్కజొన్న, కంది ఉత్పత్తులను కొనుగోలు చేస్తుందని పేర్కొన్నారు. రైతులు పంట నమోదు సిబ్బందికి గ్రామాలకు వచ్చినప్పుడు తమతమ పొలాల్లో అందుబాటులో ఉండి సరైన పంట వివరాలను తెలియజేయాలని సూచించారు. పంట నమోదు విషయంలో ఏవైనా సందేహాలు లేదా సమస్యలు ఉంటే సంబంధిత క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారులను హమీదుల్లానగర్ మరియు మల్కారం రైతు వేదికల్లో సంప్రదించాలని కోరారు. మండలంలో కొంతమేర వాలంటీర్ల కొరత కారణంగా 11 గ్రామాల్లో వాలంటీర్లు నియామకం జరగలేదని, రైతులు సహకారం అందక డిజిటల్ క్రాప్ సర్వే మందకొడిగా సాగుతోందని, చదువుకున్న యువత, వ్యవసాయం మరియు గ్రామంపై అవగాహన ఉన్నవారు వాలంటీర్లుగా ముందుకు రావాలని, వారికి ఆర్థిక ప్రోత్సాహం సైతం ఉంటుందని, వారు పంటల నమోదుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. డిజిటల్ క్రాప్ సర్వేను త్వరితగతిన పూర్తి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని వెల్లడించారు.

## ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

- **బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో వినతిపత్రం.**

**తాండూర్, సెప్టెంబర్ 07(ప్రజాక్షేత్రం)**

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని బిఆర్ఎస్ పార్టీ నాయకులు సోమవారం రోజు తాండూర్ మండల పరిషత్ కార్యాలయంలో పార్టీ పిలుపుమేరకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో, హామీలు అమలు చేస్తామని 1000 రోజులు గడుస్తున్న ఇంకా అమలు చేయడం లేదన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ అమలు చేసే వరకు పోరాటం కొనసాగిస్తాం అన్నారు. ఈ కార్యక్రమంలో తాండూర్ నియోజకవర్గం ఇంచార్జ్ శ్రీశైల్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, ఉమా శంకర్ పటేల్, మండల పార్టీ అధ్యక్షులు వీరేందర్ రెడ్డి తాండూర్ నియోజకవర్గ మహిళా కన్వీనర్ దేశ్ పాండే శకుంతల, రామలింగా రెడ్డి, అంతరం మాజీ సర్పంచ్ రాములు, నాయకులు, కేశవ్, ప్రభాకర్ రెడ్డి, వేణు గౌడ్, మొగులప్ప,యాదప్ప, విలాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## మాటల మనిషి కాదు.. చేతల నాయకుడు!

- **మాట నిలబెట్టుకున్న రియల్ లీడర్**
- **సొంత నిధులతో జీవన్‌గూడ రోడ్డు పనులు**
- **ఆరు నెలల్లోనే హామీ నెరవేర్చిన కౌన్సిలర్**
- **9వ వార్డును ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దుతా**
- **కౌన్సిలర్ ముదిగొండ ప్రభాకర్ యాదవ్**

**మొయినాబాద్, సెప్టెంబర్ 07(ప్రజాక్షేత్రం):**

రాజకీయాల్లో నాయకులు హామీలు ఇవ్వడం సర్వసాధారణం. కానీ ఇచ్చిన మాట కోసం తన సొంత డబ్బులు ఖర్చు పెట్టి మరీ అభివృద్ధి పనులను ప్రారంభించే నిజమైన ప్రజానేతలు అరుదుగా ఉంటారు. అలాంటి కోవకు చెందిన నాయకుడే మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డు కౌన్సిలర్ ముదిగొండ ప్రభాకర్ యాదవ్. ఎన్నికల సమయంలో ఏన్కేపల్లి అనుబంధ గ్రామం జీవన్‌గూడ ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి, ఆయన చేపట్టిన ఈ కార్యక్రమం ఇప్పుడు మొయినాబాద్ ప్రాంతంలో సంచలనంగా మారింది. ఎన్నికల ప్రచార సమయంలో జీవన్‌గూడ గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి దుస్థితిని చూసి చలించిపోయిన ప్రభాకర్ యాదవ్ తాను గెలిచిన ఆరు నెలల్లోగా తన సొంత నిధులతోనే సీసీ రోడ్డు వేయిస్తానని బహిరంగంగా శపథం చేశారు. ప్రజలు ఆయనను గెలిపించి ఆదరించగా, అధికారం చేపట్టిన సరిగ్గా ఆరు నెలల వ్యవధిలోనే ఇచ్చిన మాటను తూచా తప్పకుండా పాటిస్తూ జీవన్‌గూడలో నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఒక్క రూపాయి ప్రభుత్వ నిధుల కోసం ఎదురు చూడకుండా, తన జేబులోని సొంత డబ్బులతో ఈ పనులను స్వయంగా ప్రారంభించి గ్రామ ప్రజల చిరకాల వాంఛను నెరవేర్చే దిశగా అడుగులు వేశారు. సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించిన సందర్భంగా కౌన్సిలర్ ముదిగొండ ప్రభాకర్ యాదవ్ మాట్లాడుతూ... ప్రజల నమ్మకాన్ని నిలబెట్టడమే తన జీవితాశయమని స్పష్టం చేశారు. "నేను పదవుల కోసం ఆశపడి రాజకీయాల్లోకి రాలేదు, ప్రజల కష్టాలు తీర్చడమే నా ధర్మంమన్నారు. జీవన్‌గూడ ప్రజలు పడుతున్న ఇబ్బందిని చూసి తట్టుకోలేకనే నా సొంత నిధులతో ఈ రోడ్డు పనులను ప్రారంభిస్తున్నామని ఇక్కడితో ఆగిపోను నా 9వ వార్డులో ఏ ఒక్క సమస్య ఉన్నా విడతలవారీగా శాశ్వతంగా పరిష్కరిస్తానని పేర్కొన్నారు. మొయినాబాద్ మున్సిపాలిటీలోనే నా వార్డును నంబర్ వన్ ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దడమే నా లక్ష్యమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రభాకర్ యాదవ్ తీసుకున్న ఈ చొరవను చూసి జీవన్‌గూడ గ్రామస్తులు, స్థానిక ప్రజలు ఆనందంతో ఉబ్బితబ్బిబ్బవుతున్నారు. దశాబ్దాలుగా తమను పట్టించుకోని ఎందరో నాయకుల మధ్య, మాట ఇస్తే ప్రాణం పెట్టి నిలబెట్టుకునే ఇలాంటి లీడర్ దొరకడం తమ అదృష్టమని గ్రామస్తులు కొనియాడు తున్నారు. కౌన్సిలర్ ప్రభాకర్ యాదవ్ చేస్తున్న ఈ సామాజిక సేవను అభినందిస్తూ స్థానికులు ఆయనకు ఘనంగా నీరాజనాలు పలికారు.



# ప్రకృతి ఒడిలో కొలువైన పరమశివుడు..!

- కోరిన భక్తుల కొంగుబంగారంగా నిలుస్తున్న లింగమయ్య పుణ్యక్షేత్రం.
- చారిత్రక ఆలయం...! చరిత్ర తిరగరాసిన ముమ్మలనేని రాజశేఖర్.
- భక్తులను ఆకట్టుకుంటున్న 25 అడుగుల ఆది యోగి విగ్రహం.
- అడికేశ్ లింగమయ్య ఆలయానికి విశేషంగా తరలివస్తున్న భక్తులు.
- శ్రావణం, కార్తీక మాసాల్లో లింగమయ్యకు భక్తుల ప్రత్యేక పూజలు.

**కోటగిరి, సెప్టెంబర్ 06(ప్రజాక్షేత్రం):**

చుట్టూ కొండలు దట్టమైన అడవులు పచ్చని చెట్లు స్వచ్ఛమైన గాలి ప్రశాంతమైన వాతావరణం లో సాక్షాత్తు ఆ పరమశివుడే వచ్చి లింగమయ్య రూపంలో కొలువైన పవిత్ర పుణ్యక్షేత్రం గా వెలసింది అడికేశ లింగమయ్య ఆలయం. నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం లింగాపూర్ గ్రామ శివారులో వెలసిన అడికేశ్ లింగమయ్య ఆలయం మహా ఋషి ఆధ్యాత్మిక తపస్వి ముమ్మలనేని రాజశేఖర్ కృషితో పునర్నిర్మాణం గావించబడి లింగమయ్య రూపంలో ఆ పరమశివుడు కోరిన భక్తులకు కొంగు బంగారం గా నిలుస్తున్న ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రంగా అడికేశ లింగమయ్య ఆలయం ప్రసిద్ధి చెందుతుంది. సొంత ఊరి పై మమకారంతో పరమశివుడిపై భక్తితో కోట్ల రూపాయల వ్యయంతో ఆలయ పునర్నిర్మాణం చేపట్టి రాష్ట్రంలోనే ప్రత్యేకంగా నిలిచేలా ప్రకృతి ఒడిలో మహాద్భుతాన్ని ఆవిష్కరింపజేశారు ముమ్మలనేని రాజశేఖర్, ఋషులు, మునులు తపస్సులు చేసిన, నవ సిద్ధులు సంచరించిన పుణ్య క్షేత్రంగా భావించే చరిత్ర కలిగిన లింగమయ్య ఆలయాన్ని పునర్నిర్మాణం చేపట్టి ఆలయ చరిత్రను తిరగరాసి ఈ ప్రాంతం గురించి భవిష్యత్తు తరాలు గొప్పగా చెప్పుకునేలా చేశారు ముమ్మలనేని రాజశేఖర్. ఈ ఆలయంలో పచ్చని ప్రకృతిలో కొలువైన పరమశివుడు నిత్యం పూజలందుకుంటూ కోరిన భక్తులకు కోరికలు తీరుస్తున్నాడని భక్తులు విశ్వసిస్తున్నారు.

**అడికేశ్ లింగమయ్య ఆలయ చరిత్ర**

కొన్ని వందల సంవత్సరాల క్రితం కోటగిరి మండలం కల్లూరు గ్రామంలో ఉన్న బసవ రెడ్డి అనే వ్యక్తి 100 ఆవుల మందను పోషించేవారు. ఆ ఆవులను ప్రస్తుతం అడికేశ్ లింగమయ్య ఆలయం ఉన్న గుట్ట వైపుకు ప్రతిరోజు మేతకు తీసుకువచ్చేవారు. అందులో ఒక పిల్లలు లేని గొడ్డు ఆవు ప్రతిరోజు మంద నుండి వేరుగా వెళ్లి సాయంత్రం మళ్ళీ మందలో కలిసేది. ఆ ఆవు ప్రవర్తనను గమనించిన పశువుల కాపరి ఒకరోజు దాని వెంట వెళ్లి చూడగా దట్టమైన అడవుల్లో కొండపై ఉన్న రాతి లింగంపై ఆ ఆవు దానికదే పాలను వదలడం చూసి ఆశ్చర్యానికి లోనయ్యాడు. వెంటనే గ్రామస్తులకు పశువుల కాపరి ఈ విషయం తెలుపగా ఆ రాతిని స్వయంభు శివలింగంగా భావించి అప్పటినుండి నిత్యం శివయ్య ఇక్కడ పూజలు అందుకుంటున్నాడు. ఈ చరిత్రకు మునుపే ఈ ప్రాంతంలో సాక్షాత్తు ధర్మరాజు పూజలు నిర్వహించినట్లు, ఋషులు మునులు తపస్సులు చేసినట్లు, నవనాద సిద్ధులు సంచరించినట్లు చరిత్ర ఆనవాళ్లు చెబుతున్నాయి.

**శ్రావణం,కార్తీక మాసాల్లో ప్రత్యేక పూజలు**

పవిత్ర పుణ్యక్షేత్రంగా వెలసిన లింగమయ్య ఆలయంలో ఆలయ పూజారి బస్వరాజ్ మహారాజ్ ఆధ్వర్యంలో శివుడు నిత్యం ప్రత్యేక పూజలు అందుకుంటున్నాడు. దీంతోపాటు ఆలయంలో శ్రావణం, కార్తీకమాసంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, ఉత్సవాలు నిర్వహిస్తారు. ముఖ్యంగా శ్రావణమాసం శని,సోమవారాల్లో భక్తుల తాకిడి విశేషంగా ఉంటుంది. భక్తుల కోసం ప్రతి సోమవారం, శ్రావణమాసంలోని శని సోమవారాల్లో అన్నదాన కార్యక్రమాలు సైతం నిర్వహిస్తున్నారు. నేడు శ్రావణమాసం చివరి సోమవారం కావడంతో వేల సంఖ్యలో భక్తులు లింగమయ్యను దర్శించుకునే అవకాశం ఉంది. ఇందుకుగాను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ సమీపంలో ఉన్న బస్వాపూర్, అడ్కాస్ పల్లి గ్రామస్తులంతా కలిసి శ్రావణమాసం చివరి సోమవారం రోజు భక్తుల సౌకర్యార్థం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దీంతో పాటు వినాయక చవితి రోజున ప్రత్యేక పూజల అనంతరం తర్వాతి రోజైన భాద్రపద శుద్ధ పంచమి రోజున ప్రతియేటా లింగమయ్య ఆలయంలో లింగమయ్య జాతర పేరుతో ప్రత్యేక ఉత్సవాలను నిర్వహిస్తారు. ప్రస్తుతం ఆలయ పునర్నిర్మాణం పూర్తవడంతో ఈసారి భక్తుల సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉందని అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు కూడా చేస్తున్నట్లు ఆలయ కమిటీ వారు చెబుతున్నారు.









**ఆలయ పునర్నిర్మాణం, విశిష్టత**

తెలంగాణ రాష్ట్రం నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం అడ్కాస్ పల్లి గ్రామానికి సమీపంలో ఉన్న పర్వత శిఖరం పై ఆధ్యాత్మిక కాంతిని విరజిమ్ముతున్న లింగమయ్య ఆలయం ప్రస్తుతం పునర్నిర్మానంతో మరింత వైభవాన్ని సంతరించుకుంది. ఆలయ పునర్నిర్మాణ దాత, ముమ్మలనేని రాజశేఖర్ శివుడి పై భక్తితో, ఆధ్యాత్మిక భావనతో కోట్ల రూపాయలు వెచ్చించి ఆలయ పునర్నిర్మాణాన్ని ఏకశిలతో నిర్మించడం విశేషం. సాధారణంగా ఆలయాల నిర్మాణం అనేక రాళ్లను కలిపి చేస్తారు. కానీ ఈ లింగమయ్య ఆలయ పునర్నిర్మాణంలో ఏకశిల(ఒకే రాయి) కృష్ణ రాయితో ఆలయ పునర్నిర్మాణం జరిగింది. ఏకశిలతో శివలింగం, నంది, ఆలయ నిర్మాణం జరగటంతో భూదేవి గర్భం నుండి పరమశివుడు ప్రత్యక్షంగా వెలసినట్లు భక్తుల హృదయాల్లో దివ్యానుభూతిని కలిగిస్తోంది. దాదాపు పదేళ్లకు పైగా ప్రణాళికతో, భక్తుల సహకారంతో, శిల్పుల అంకిత భావంతో ఈ కృష్ణరాయి ఆలయ నిర్మాణం పూర్తయింది. ఆలయంలోని పురాతన రాతి నందిలో ప్రాణం ఉందని భక్తులు భావిస్తారు ఈ నంది ప్రతి సంవత్సరం పెరుగుతూ ఉండడం దేవుడి లీలకు ప్రతిరూపంగా భావిస్తారు భక్తులు. పంచభూతాల తత్వానికి ప్రత్యేకమైన పంచలింగాల్లో ఒకటిగా పేరుగాంచిన అడిగేష్ లింగమయ్య ఆలయం ప్రాచీనత, పవిత్రత, విశ్వాసం కలగలిపిన దేవస్థానంగా భక్తుల్లో అపారమైన విశ్వాసం నెలకొంది. ప్రతి ఏటా శివరాత్రి రోజు రాత్రి ఆలయంలో ఏర్పాటు చేసే అగ్నిగుండం ప్రత్యేకతను కలిగి ఉంది. ఈ అగ్ని గుండాన్ని దాటిన వారికి ఎలాంటి సమస్యలున్నా తొలగిపోతాయని అష్ట ఐశ్వర్యాలు కలుగుతాయని భక్తులు నమ్ముతారు. ఈ ఆలయం భక్తి విశ్వాసం,శ్రద్ధ, శివానుభూతి కలగలిసిన పవిత్ర క్షేత్రంగా, ఇక్కడి ప్రతి శిలలో, ప్రతి గాలిలో, ప్రతి నాదంలో ఆ పరమశివుడు సాక్షాత్కరిస్తున్నాడని భక్తులు విశ్వసిస్తున్నారు.

**విశేషంగా ఆకట్టుకుంటున్న 25 అడుగుల ఆది యోగి విగ్రహం**

అడికేశ లింగమయ్య ఆలయ ప్రాంగణంలో ఉన్న అతిపెద్ద రాయిపై 25 అడుగుల ఆదియోగి విగ్రహం ఏర్పాటు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటుంది. ముందుగా ఇక్కడ ఆలయ నిర్మాణం మాత్రమే చర్చలో ఉన్నప్పటికీ ఆలయ పునర్నిర్మాణం అనంతరం అక్కడ ఉన్న రాయిపై ఆదియోగి విగ్రహం ఏర్పాటు చేస్తే బాగుంటుందని భావించిన ఆలయ పునర్నిర్మాణ కర్త ముమ్మలనేని రాజశేఖర్ ఎంత ఖర్చైనా పర్వాలేదని ముందుకొచ్చి 25 అడుగుల ఆది యోగి విగ్రహాన్ని ఏర్పాటు చేయించారు. పచ్చటి ప్రకృతిలో కొండ శిఖరంపై ఉన్న ఎత్తైన రాయిపై వెలసిన ఆదియోగి విగ్రహం ఆలయానికి వచ్చే భక్తులకు విశేషంగా ఆకట్టుకుంటుంది. ఆలయంలో వెలసిన ఆదియోగి విగ్రహం ఆలయ సౌందర్యాన్ని అమాంతం పెంచేసింది. తెలంగాణలో ఉన్న ఏకైక ఆదియోగి విగ్రహంగా ప్రస్తుతం సోషల్ మీడియాలో అడిగేశ లింగమయ్య ఆలయంలోని ఆదియోగి విగ్రహం ట్రెండింగ్ లో ఉండటంలో సందేహం లేదు. తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి నిత్యం భక్తులు విశేషంగా తరలివచ్చి అలికేశ లింగమయ్య తో పాటు ఆదియోగి విగ్రహాన్ని దర్శించుకుంటున్నారు.

# కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన.. అట్టర్ ఫ్లాఫ్.

- **ఇచ్చిన హామీలు ఎన్ని.? అమలు జరిగినవి ఎన్ని.?**
- **రేవంత్ రెడ్డి కోతల రాయుడు ఆయన మాటలు నమ్మి ప్రజలు మోసపోయారు.**
- **మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్.**

**పోతంగల్ సెప్టెంబర్ 07(ప్రజాక్షేత్రం):**

కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తిగా అట్టర్ ఫ్లాఫ్ అయిందని .. ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ సంపూర్ణంగా అమలు చేయలేదని ఇచ్చిన హామీలు ఎన్ని అమలు చేసినవి ఎన్ని అని మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం పై ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పాలనకు నిరసనగా పోతంగల్ మండలంలో ఆయన ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మహాధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజావాణిలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడరూ ఎన్నికల ముందు హామీల వర్షం కురిపించిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చాక ప్రజలను పట్టించుకోవడం మానేసిందని వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తోంది అని విమర్శించారు. రైతులకు రుణమాఫీ, రైతుభరోసా, మహిళలకు ఆర్థిక సాయం, యువతకు ఉద్యోగాలు, పెన్షన్ల పెంపు, నిరుద్యోగ భృతి వంటి హామీల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ప్రజలు ఓట్లు వేసి అధికారం ఇస్తే.. వారి సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికి వదిలేసింది అని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు ఇప్పటికీ గుర్తు చేసుకుంటున్నారని అన్నారు. ప్రజల పక్షాన నిలబడి.. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతామని, హామీలు అమలు చేసే వరకు బీఆర్ఎస్ పోరాటం ఆగద అని బాజిరెడ్డి గోవర్ధన్ స్పష్టం చేశారు.

**బాన్సువాడ అభివృద్ధి కేసీఆర్ హయాంలోనే.**

బాన్సువాడ నియోజకవర్గానికి పోచారం శ్రీనివాస్‌రెడ్డి చేసిందేమీ లేదని, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ సీఎం కేసీఆర్ అందించిన నిధులతోనే నియోజకవర్గంలో అభివృద్ధి జరిగిందని మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే బాన్సువాడ నియోజకవర్గానికి పెద్ద ఎత్తున నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. రహదారులు, సాగునీరు, తాగునీరు, విద్య, సంక్షేమం తదితర రంగాల్లో జరిగిన అభివృద్ధికి కేసీఆర్ ప్రభుత్వమే కారణమన్నారు. ప్రజల కోసం పార్టీ మారానని చెబుతున్న పోచారం ఇప్పటివరకు బాన్సువాడ నియోజకవర్గానికి ఏం చేశారో ప్రజలకు చెప్పాలన్నారు. బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన పోచారం.. అభివృద్ధి కోసమే పార్టీ మారానని చెప్పడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనన్నారు. అధికారం మారగానే పార్టీ మారడం ప్రజలకు స్పష్టంగా అర్థమైందన్నారు. బాన్సువాడ ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో ప్రజలే తగిన సమాధానం చెబుతారని బాజిరెడ్డి అన్నారు.

**హామీలు నమ్మి ఓట్లేస్తే.. నట్టేట ముంచారు!.**
**పార్టీ సభ్యత్వ నమోదు బాన్సువాడ నియోజకవర్గ ఇన్చార్జ్ తోట ఆగన్న.**

ఎన్నికల సమయంలో రేవంత్ రెడ్డి,కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీలను నమ్మి ప్రజలు కాంగ్రెస్ కు ఓట్లు వేస్తే.. అధికారంలోకి వచ్చిన తర్వాత అదే ప్రజలను నట్టేట ముంచారని పార్టీ సభ్యత్వ నమోదు బాన్సువాడ నియోజకవర్గ ఇన్చార్జ్ తోట ఆగన్న మండిపడ్డారు. ప్రజల ఓట్లతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ప్రజల సమస్యలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉందన్నారు. ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసే వరకు బీఆర్ఎస్ ప్రజల తరఫున నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఒకటి చెప్పి.. అధికారంలోకి వచ్చిన తర్వాత మరోలా వ్యవహరించడం ప్రజలను మోసం చేయడమేనన్నారు. హామీల అమలుపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని,ప్రజల ఆగ్రహాన్ని ప్రభుత్వం తక్కువగా అంచనా వేయొద్దని హెచ్చరించారు. ప్రజల పక్షాన నిలబడి వారి సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం.. సమస్యలను పట్టించుకోకుండా ప్రతిపక్షాల పై విమర్శలు చేయడం సరికాదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.





**బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అరెస్టుకు నిరసనగా ధర్నా**

అసెంబ్లీ సమావేశాలకు వెళ్లకుండా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సోమవారం పోతంగల్‌లో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అసెంబ్లీలో ప్రజా సమస్యలను ప్రస్తావించే ప్రతిపక్ష ఎమ్మెల్యేలను అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్యాన్ని అవమానించడమేనని బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్ష గొంతును అణచివేసే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే అరెస్టులు చేయడం ఏమిటని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అరెస్టులను వెంటనే ఉపసంహరించుకోవాలని, ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రతిపక్షానికి మాట్లాడే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోకపోతే ప్రజా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బాన్సువాడ నియోజకవర్గ నాయకులు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జుబేర్, మాజీ రైతుబంధు అధ్యక్షుడు అంజిరెడ్డి, నాయకుడు మొరిల్ శ్రీనివాస్ రావు, రత్నకుమార్, నాయకులు తేల్ల రవికుమార్, సుదం నవీన్, డాక్టర్ ఎంఏ.హకీమ్, ఆరిఫ్, ఎజాజ్, మాజీ ఎంపీటీసీ ఫారుక్,దేవేందర్,ఎజాజ్, సాగర్, దాసు,మధు(రుద్రూర్), గోపిరెడ్డి (చందూర్), నాగభూషణం (వర్ని),గంగప్ప (వర్ని), విఠల్ (దామరంచ మాజీ సర్పంచ్), మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసింది

- **బీఆర్ఎస్ నేతలు దామోదర్ రెడ్డి, కొంపల్లి అనంతరెడ్డి**

**మొయినాబాద్, సెప్టెంబర్ 07(ప్రజాక్షేత్రం):**

వెయ్యి రోజులు గడిచినా ప్రజలకు ఒరిగిందేమీ లేదని, హామీల అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ నాయకులు దామోదర్ రెడ్డి, కొంపల్లి అనంతరెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మొయినాబాద్ ఎంపీడీవో కార్యాలయంలో ప్రజావాణి సందర్భంగా వారు మీడియాతో మాట్లాడారు.

ఎన్నికల సమయంలో ఆరు గ్యారంటీలని, పదమూడు డిక్లరేషన్లని నమ్మబలికి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, నేడు ఇచ్చిన 420 హామీలను విస్మరించి ప్రజలను మోసం చేసిందని నాయకులు మండిపడ్డారు. కేవలం ప్రచార ఆర్భాటాలకే పరిమితమైన ఈ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా చతికిలపడిందని, వెయ్యి రోజుల విఫల పాలనకు ప్రజలే తగిన సమయంలో తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ ఎంపీడీవోకు వినతిపత్రం అందజేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ శ్రేణులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.




## చిట్టిగిద్ద ఎల్లకొండ గ్రామలలో కోరమండల్ నానో డిఏపి అవగాహనా సదస్సు

**నవాబు పేట సెప్టెంబర్ 07(ప్రజాక్షేత్రం):**

కోరమండల్ ఇంటర్నేషనల్ కంపెనీ ఆధ్వర్యంలో చిట్టిగిద్ద ఎల్లకొండ గ్రామల లో రైతులకు గ్రోమోర్ నానో డిఏపి గురించి గ్రామస్థులకు బుర్ర కథ రూపం లో రైతులకు అవగాహనా సదస్సు నిర్వహించడం జరిగింది ముఖ్య అతిధిగా వికారాబాద్ జిల్లా డెవలఫమెంట్ ఆఫీసర్ పృథ్వి గారు పాల్గొని రైతులకు స్పష్టంగా రైతులకు అర్థమయ్యేలా నానో డిఏపి గురించి చెప్పడం జరిగింది. పార్టిలైజర్ డిఏపి 50% తగ్గించి నానో డిఏపి వాడాలని సూచించారు నానో లక్కీ డ్రా గురించి రైతులకు వివరించారు రైతు రాజు కావాలన్నే మా ఆశయం అని పృథ్వి పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ శ్రీధర్ రావ్ ఫీల్డ్ ఆఫీసర్ రమేష్. రాకేష్ రైతులు గ్రామస్తులు తదితరులు పాల్గొని విజయవంతం చేశారు.





## స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు ఖండిస్తూ బీఆర్ఎస్ నేతలపై మండిపట్టు

- **భారత్ నగర కౌన్సలర్ ఖదీర్ భాయ్**
- **దళిత స్పీకర్‌ను అవమానించడం సరికాదు**


**జహీరాబాద్ సెప్టెంబర్ 07(ప్రజాక్షేత్రం):**



సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం భారత్ నగర కౌన్సిలర్ ఖదీర్ భాయ్ మాట్లాడుతూ తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు చేసినట్లు ఆరోపిస్తున్న అనుచిత వ్యాఖ్యలను ఖండించినారు. స్పీకర్ పదవి ఏ ఒక్క పార్టీకి, వ్యక్తికి సంబంధించినది కాదని, అది శాసనసభ గౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యున్నతమైన శాసనసభ స్పీకర్‌ను అవమానించేలా వ్యాఖ్యలు చేయడం తగదని అన్నారు. ముఖ్యంగా దళిత సామాజిక వర్గానికి చెందిన స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరమని, ఇలాంటి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ప్రజాస్వామ్య విలువలను, రాజ్యాంగబద్ధ పదవుల గౌరవాన్ని ప్రతి ఒక్కరూ కాపాడాల్సిన అవసరం ఉందని నాయకులు అన్నారు. ఈ తరహా వ్యాఖ్యలకు బీఆర్ఎస్ నాయకులు బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

## తెలంగాణ పబ్లిక్ స్కూల్‌గా కుంటాల మోడల్ స్కూల్, ఎమ్మెల్యే రామారావు పటేల్

**నిర్మల్ జిల్లా సెప్టెంబర్ 07(ప్రజాక్షేత్రం)**



కుంటాల మోడల్ స్కూల్‌ను తెలంగాణ పబ్లిక్ స్కూల్‌గా అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసిందని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాల అభివృద్ధికి ప్రభుత్వం రూ.9 కోట్లు నిధులు విడుదల చేసిందన్నారు. ఈ నిధులతో అదనపు తరగతి గదులు, మౌలిక వసతులు మెరుగుపరుస్తామని పేర్కొన్నారు. విద్యార్థులకు మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పించడంతోపాటు పాఠశాలలో అవసరమైన మౌలిక వసతులను అభివృద్ధి చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. కుంటాల మోడల్ స్కూల్‌ను తెలంగాణ పబ్లిక్ స్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయడం వల్ల స్థానిక విద్యార్థులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు విద్యా ప్రమాణాల పెంపునకు చర్యలు తీసుకుంటోందని తెలిపారు. కుంటాల మోడల్ స్కూల్ అభివృద్ధికి విడుదలైన నిధులను సద్వినియోగం చేసి విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులోకి తీసుకువచ్చేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ వెల్లడించారు.

# రంగులు మార్చే మందారం..

- **అబ్బురపరుస్తున్న పత్తి మందారం!**
- **ఉదయం లేత రంగు.. మధ్యాహ్నానికి మరో ఛాయ.. సాయంత్రానికి ముదురు వర్ణం**
- **వనపర్తి మిద్దె తోటలో ప్రకృతి చిత్రకారుడి విన్యాసం..**
- **ప్రత్యేక పువ్వును ఆసక్తిగా తిలకిస్తున్న స్థానికులు**

**వనపర్తి, సెప్టెంబర్ 07(ప్రజాక్షేత్రం):**



“పొద్దు తిరుగుడు పువ్వు పొద్దును ముద్దాడే..” అంటూ స్వర్గీయ గద్దర్ తన పాటలో ప్రకృతితో పువ్వుల అనుబంధాన్ని అద్భుతంగా వర్ణించారు. అయితే వనపర్తి జిల్లా కేంద్రంలోని ఓ మిద్దె తోటలో కనిపిస్తున్న ఓ మందారం పువ్వు మాత్రం పొద్దును అనుసరించడమే కాదు.. పొద్దు మారే కొద్దీ తన రంగునే మార్చుకుంటూ ప్రకృతి ప్రేమికులను అబ్బురపరుస్తోంది.

**మూడు వేళలు.. మూడు రంగులు**

వనపర్తి జిల్లా కేంద్రానికి చెందిన పోల్కంపల్లి సుజాత తన ఇంటి మిద్దెపై ఎంతో ఇష్టంతో పెంచుతున్న తోటలో వందలాది రకాల మొక్కలు ఉన్నాయి. వాటిలో పత్తి మందారం మొక్క ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. సాధారణంగా మందారం పువ్వులు ఒకే రంగులో కనిపిస్తుంటాయి. కానీ ఈ మొక్కకు పూసే పువ్వు మాత్రం సమయం గడిచేకొద్దీ తన రంగును మార్చుకోవడం విశేషం.

ఉదయం పువ్వు లేత రంగులో దర్శనమిస్తే.. మధ్యాహ్నానికి మరో ఛాయలోకి మారుతోంది. సాయంత్రానికి మరింత ముదురు రంగును సంతరించుకుంటోంది.

ఒకే పువ్వు.. ఒకే రోజు.. ఇలా వేర్వేరు రంగుల్లో కనిపించడం చూపరులను ఆకట్టుకుంటోంది.

**కళ్ల ముందే రంగుల మార్పు**

సోమవారం పూసిన పత్తి మందారం పువ్వును సుజాత ఉదయం నుంచి సాయంత్రం వరకు గమనించారు. ఉదయం ఒక రంగులో ఉన్న పువ్వు.. కొద్ది గంటల తర్వాత మరో రంగులోకి మారడం కనిపించింది. సాయంత్రానికి మరింత ముదురు ఛాయలోకి చేరడంతో ఈ ప్రత్యేకతను చూసిన వారు ఆశ్చర్యానికి గురయ్యారు.

పువ్వు వికసించడం సాధారణమే.. కానీ వికసించిన తర్వాత రంగును మార్చుకోవడం మాత్రం ఆసక్తికరమైన ప్రకృతి పరిణామంగా కనిపిస్తోంది. దీంతో ఈ ప్రత్యేక పువ్వు గురించి తెలుసుకోవాలనే ఆసక్తి స్థానికుల్లో నెలకొంది.

**మిద్దె తోటలో ప్రత్యేక ఆకర్షణ**

పట్టణాల్లో ఇళ్ల స్థలాలు తగ్గిపోతున్న నేపథ్యంలో మిద్దె తోటలు ప్రకృతిని ఇంటి ముంగిటకు తీసుకువస్తున్నాయి. ఈ క్రమంలో సుజాత తన మిద్దెపై వివిధ రకాల పూలు, మొక్కలను పెంచుతున్నారు. వందలాది మొక్కల మధ్య పత్తి మందారం ప్రత్యేకంగా ఆకట్టుకుంటోంది. “ఈ మొక్కను ఎంతో శ్రద్ధగా పెంచుతున్నాను. అప్పుడప్పుడు పువ్వులు పూస్తాయి. అయితే పువ్వు రంగు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం మారుతూ కనిపించడం చాలా ఆసక్తిగా అనిపిస్తుంది. పువ్వు పూసిన ప్రతిసారీ దాని రంగుల్లో వచ్చే మార్పులను గమనిస్తూ ఉంటాను” అని సుజాత తెలిపారు.

**ప్రకృతి ఇచ్చిన రంగుల కానుక**

పూలకు రంగులు ఉండటం సహజమే. కానీ కాలగమనానికి అనుగుణంగా ఒకే పువ్వు రంగు మారుతూ కనిపించడం ప్రకృతి అందాల్లోని వైవిధ్యానికి నిదర్శనం. సాంకేతికత పరుగులు తీస్తున్న నేటి కాలంలోనూ ప్రకృతి తనదైన





అద్భుతాలతో మనిషిని ఆశ్చర్యపరుస్తూనే ఉందనడానికి ఈ పత్తి మందారం ఓ చిన్న ఉదాహరణగా నిలుస్తోంది.

వనపర్తి మిద్దె తోటలో కనిపిస్తున్న ఈ “రంగులు మార్చే మందారం” ప్రస్తుతం స్థానికంగా ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం.. మూడు వేళల్లో మూడు ఛాయల్లో దర్శనమిస్తున్న ఈ పువ్వు చూపరులకు ప్రకృతి అందాలపై మరింత ఆసక్తిని కలిగిస్తోంది.

## స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు ఖండిస్తూ బీఆర్ఎస్ నేతలపై మండిపడ్డ:కప్పల రాజు

- **దళిత స్పీకర్‌ను అవమానించడం సరికాదు.. ఎస్సీ మండల అధ్యక్షుడు కప్పల రాజు**

**మహేశ్వరం సెప్టెంబర్ 07(ప్రజాక్షేత్రం):**



రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం ఎస్సీ మహేశ్వరం మండల అధ్యక్షులు కప్పల రాజు మాట్లాడుతూ... తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు చేసినట్లు ఆరోపిస్తున్న అనుచిత వ్యాఖ్యలను ఖండించిన మహేశ్వరం మండల్ ఎస్సీ డిపార్ట్మెంట్ కప్పల రాజు స్పీకర్ పదవి ఏ ఒక్క పార్టీకి, వ్యక్తికి సంబంధించినది కాదని, అది శాసనసభ గౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యున్నతమైన శాసనసభ స్పీకర్‌ను అవమానించేలా వ్యాఖ్యలు చేయడం తగదని అన్నారు. ముఖ్యంగా దళిత సామాజిక వర్గానికి చెందిన స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరమని, ఇలాంటి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు.

ప్రజాస్వామ్య విలువలను, రాజ్యాంగబద్ధ పదవుల గౌరవాన్ని ప్రతి ఒక్కరూ కాపాడాల్సిన అవసరం ఉందని నాయకులు అన్నారు. ఈ తరహా వ్యాఖ్యలకు బీఆర్ఎస్ నాయకులు బాధ్యత వహించాలని ఎస్సీ మహేశ్వరం మండల్ అధ్యక్షులు కప్పల రాజు డిమాండ్ చేశారు.

## అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంలో బీజేవైఎం షాపురం శ్రీకాంత్ కు గాయాలు

- **ప్రభుత్వం వెంటనే ఫీజు బకాయిలు విడుదల చేయాలన్న షాపురం శ్రీకాంత్**

**మొయినాబాద్ సెప్టెంబర్ 07(ప్రజాక్షేత్రం):**




బిజెపి మరియు బీజేవైఎం ఆధ్వర్యంలో పెండింగ్లో ఉన్న ఫీజు బకాయిలు విడుదల చేయాలని గత నెల రోజుల నుండి ఉద్యమాలుచేస్తున్న ప్రభుత్వం ఎలాంటి స్పందన లేకపోవడంతో ఆగ్రహించిన బీజేవైఎం కార్యకర్తలు ఈరోజు అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మొయినాబాద్ బీజేవైఎం నాయకులు శ్రీకాంత్ కు చేతికి గాయాలు అయ్యాయి. బీజేవైఎం నాయకులు షాపురం శ్రీకాంత్ మాట్లాడుతూ పెండింగ్లో ఉన్న ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలని లేని పక్షంలో మరింత విద్యార్థుల పట్ల ఉద్యమాలు చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మేకగూడెం మహేష్, చేగురి ఎల్లేష్ గౌడ్, కోరే రామకృష్ణ, జగన్ మోహన్ రెడ్డి, సురేందర్ రెడ్డి, సాయి, వికాస్, రామ్ చరణ్, ఓం ప్రకాష్, వంశీ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## సమస్యల వెంట నడిచిన నాయకుడు.. వారాల వినోద్ కుమార్!

- **రోడ్డెక్కిన కాలనీ సమస్యలు.. ప్రజావాణి బాట పట్టిన సూరారం!**
- **డ్రైనేజీ లేదు..వైర్లతో ప్రమాదం.. రాజీవ్ గృహకల్ప ప్రజల ఆగ్రహం!**

**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 07(ప్రజాక్షేత్రం)**

నగరం విస్తరిస్తున్నా.. కాలనీల్లో సమస్యలు మాత్రం తగ్గడం లేదు. సాయిబాబా నగర్ 292వ డివిజన్ పరిధిలోని సూరారం కాలనీ రాజీవ్ గృహకల్ప బ్లాక్ 1 నుంచి 14 వరకు ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలు పాదయాత్రతో మరోసారి వెలుగులోకి వచ్చాయి. సీనియర్ నాయకులు వారాల వినోద్ ఆధ్వర్యంలో నిర్వహించిన పాదయాత్రలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ సమస్యలు, విద్యుత్ వైర్ల ఇబ్బందులు, ఇతర మౌలిక సదుపాయాల కొరత స్థానికుల జీవనాన్ని ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు గుర్తించారు. మహిళలు, బస్తీవాసులు స్వయంగా తమ సమస్యలను నాయకుల ముందు వివరించారు. ఈ సమస్యలను ఇప్పటికే కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్ దృష్టికి తీసుకెళ్లగా, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. అయితే హామీలతోనే సమస్యలు పరిష్కారం కావని, క్షేత్రస్థాయిలో చర్యలు కనిపించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో డీసీ లావణ్య, విరాట్‌కు వినతిపత్రం అందజేసి, సూరారం కాలనీ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పాదయాత్రలో రాజ్ కుమార్ ముదిరాజ్, తారా సింగ్, గట్టు అశోక్, భాస్కర్, రాజు యాదవ్, రంగప్ప, బద్రి, వేణు ముదిరాజ్, సత్యనారాయణ గౌడ్, పూర్ణచందర్ రెడ్డి, కిషోర్ ముదిరాజ్, నరసింహా గౌడ్, జైసింహా రెడ్డి, మునీర్, జహీర్, కైసర్ పాషా, మజీద్ పాషా తదితరులు పాల్గొన్నారు.



## స్పీకర్‌కు, దళిత సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాల్సిందే

- **కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బొల్లిగిద్ద సత్యనారాయణ**

**మొయినాబాద్, సెప్టెంబర్ 07(ప్రజా క్షేత్రం):**



శాసనసభ స్పీకర్‌ను ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ అనుచిత వ్యాఖ్యలు చేయడంపై మొయినాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొల్లిగిద్ద సత్యనారాయణ తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. రాజ్యాంగబద్ధమైన అత్యున్నత పదవిలో ఉన్న దళిత వర్గానికి చెందిన స్పీకర్‌ను అసభ్య పదజాలంతో దూషించడం బీఆర్ఎస్ పార్టీ అహంకారానికి నిదర్శనమని మండిపడ్డారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పదవుల అహంకారంతో ప్రతిపక్ష నేతలు విచక్షణ కోల్పోయి మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. దళిత స్పీకర్‌ను అవమానించడం అంటే సమస్త దళిత సమాజాన్ని అవమానించడమేనని స్పష్టం చేశారు. తక్షణమే ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, స్పీకర్‌కు, దళిత సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు, దళిత సంఘాలు బీఆర్ఎస్ నాయకులకు తగిన బుద్ధి చెబుతాయని హెచ్చరించారు.

## శ్రీ లక్ష్మీనరసింహస్వామి డయాగ్నస్టిక్ ల్యాబ్ ప్రారంభోత్సవం

**చౌటుప్పల్, సెప్టెంబర్ 07(ప్రజాక్షేత్రం):**




చౌటుప్పల్ మున్సిపాలిటీ చిన్న కొండూరు రోడ్లో శ్రీ లక్ష్మీనరసింహ స్వామి డయాగ్నస్టిక్ ల్యాబ్ ను చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్ పావని రమేష్ గౌడ్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేశారు. అనంతరం చైర్మన్ శ్రీ మొగుదాల పావని రమేష్ గౌడ్ మాట్లాడుతూ చౌటుప్పల్ మున్సిపాలిటీ పట్టణం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న దిశలో చౌటుప్పల్ అత్యంత ఆధునికమైన పరికరాలతో డయాగ్నస్టిక్ సెంటర్ ప్రారంభించి ప్రజలకు ఆధునికమైన సేవలు అందుబాటులో తేవడం ఎంతో సంతోషిదాయకమన్నారు అలాగే ఈ డయాగ్నొస్టిక్ సెంటర్ యాజమాన్యాలైన డాక్టర్ సామ వర్షిని రెడ్డిని మరియు నవీన్ రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గోషిక వినయ్, బద్దు మోహన్ రెడ్డి, బొడ్డు ఉపేంద్ర శ్రీధర్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, శివ తదితరులు పాల్గొన్నారు.



# శ్రీ అంబురామేశ్వర స్వామి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ:సంతోషాలతో ఉండాలి

- **శ్రీ అంబురామేశ్వర స్వామిని దర్శించుకున్న తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి**

**పెద్దేముల్, సెప్టెంబర్ 07(ప్రజాక్షేత్రం)**

పెద్దేముల్ మండల పరిధిలోని తట్టేపల్లి గ్రామ శివారులో కొలువై ఉన్న శ్రీ అంబురామేశ్వర స్వామి జాతర ఉత్సవాలు శ్రావణ మాసం చివరి సోమవారం భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిగాయి.ఈ జాతర ఉత్సవాల సందర్భంగా తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యేకు ఆలయ కమిటీ ఛైర్మెన్ ఉడువాల వెంకటేశం, ఇతర సభ్యులు, తట్టేపల్లి గ్రామ పెద్దలు,గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు.అనంతరం స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.ఈ సందర్భంగా తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ..

శ్రీ అంబురామేశ్వర స్వామివారి దర్శనం చేసుకోవడం ఎంతో ఆనందంగా ఉందని, స్వామివారి ఆశీస్సులు తాండూరు నియోజకవర్గ ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. శ్రీ అంబురామేశ్వర స్వామివారి జాతరకు తెలంగాణతో పాటు కర్ణాటక సరిహద్దు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకోవడం ఎంతో విశేషమన్నారు. ఎన్నో ఏళ్లుగా ఈ జాతర భక్తుల విశ్వాసానికి ప్రతీకగా కొనసాగుతోందని, స్వామివారి కృపతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.జాతర సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ, గ్రామ పెద్దలు, అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయడం అభినందనీయమన్నారు.భక్తుల సౌకర్యాల విషయంలో మరింత మెరుగైన వసతులు కల్పించేందుకు తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. శ్రీ అంబురామేశ్వర స్వామివారి ఆలయం ఈ ప్రాంతానికి ఆధ్యాత్మికంగా ఎంతో ప్రత్యేకమైనదని, ఆలయ అభివృద్ధికి అవసరమైన సహకారం అందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.అనంతరం ఎమ్మెల్యే మనోహర్ రెడ్డిని, ఇతర అతిథులను ఆలయ కమిటీ వారు ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు.ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు జాదవ్ ధారాసింగ్ నాయక్, తాండూరు మున్సిపల్ చైర్ పర్సన్ నీరజ బాల్ రెడ్డి,పెద్దేముల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పి.మహిపాల్ రెడ్డి ,తట్టేపల్లి గ్రామ సర్పంచ్ నారాయణ గౌడ్,శ్రీ అంబురామేశ్వర స్వామి దేవాలయ కమిటీ ఛైర్మెన్ ఉడువాల వెంకటేశం,కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు తట్టేపల్లి కే.నర్సింహులు, ఓమ్లానాయక్ తండా సర్పంచ్ సుమిత్రా రాథోడ్, జనగాం సర్పంచ్ సంజామొల్ల అరుణ,రేగొండి సర్పంచ్ అశోక్, జయరాం తండా(ఐ) సర్పంచ్ నేనావత్ సురేష్‌నాయక్, సిద్ధన్నమదుగు తండా సర్పంచ్ విజయ్ నాయక్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఉప్పరి మల్లేషం,కోట్ పల్లి అంజయ్య, ఎండీ. రియాజ్,లొంక నర్సింహులు, బాబుసింగ్, గాజీపూర్ నసీర్, లాల్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి ,కోట్ పల్లి సంగప్ప,జంగం రాజశేఖర్,సంజు నాయక్,రాంశెట్టి,తాండూరు సీనియర్ నాయకులు రవి గౌడ్, వడ్డె శ్రీనివాస్, పట్లోళ్ళ బాల్ రెడ్డి, ఆలయ కమిటీ పెద్దలు, సభ్యులు, తట్టేపల్లి గ్రామస్తులు, ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజలు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూమిని కబ్జా నుండి కాపాడండి.

- **ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన విలాస్ రెడ్డి.**

**తాండూర్, సెప్టెంబర్ 07(ప్రజాక్షేత్రం):**

ప్రభుత్వ భూమిని కబ్జా నుండి కాపాడాలంటూ సోమవారం రోజు అంతారం గ్రామానికి చెందిన విలాస్ రెడ్డి, ప్రజావాణిలో దరఖాస్తు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండల పరిధిలోని అంతారం సర్వేనెంబర్ 58. లో జరీనా క్రషర్ యజమాని ఆయనకు రెండు ఎకరాల భూమి పట్టా ఉంటే మరో 4, ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేశారన్నారు. ఈ సమస్యపై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కూడా ప్రజావాణిలో ఫిర్యాదు చేశాం అన్నారు. అధికారులు వెంటనే స్పందించి సర్వే చేసి ప్రభుత్వ భూమిని కాపాడాలని తెలిపారు



# ఆడ బిడ్డలకు హకీమ్ తాత కానుక అందజేత

- **హకీమ్ తాత కానుకను అందజేసిన మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్**

**పోతంగల్, సెప్టెంబర్ 07(ప్రజాక్షేత్రం):**




పోతంగల్ మండల బిఆర్ఎస్ నాయకుడు ప్రముఖ సామాజిక సేవ కర్త డాక్టర్.ఎంఏ.హకీమ్ తలపెట్టిన హకీమ్ తాత కానుకను ఆడబిడ్డ తల్లిదండ్రులకు మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ సోమవారం అందజేశారు. సోమవారం పోతంగల్ మండల కేంద్రంలో నిర్వహించిన బిఆర్ఎస్ పార్టీ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ కార్యక్రమం అనంతరం హకీం తాత కానుకను మండల కేంద్రానికి చెందిన లబ్ధిదారులకు అందజేశారు. ప్రముఖ సామాజిక సేవకర్త పోతంగల్ మండల బి ఆర్ ఎస్ నాయకులు డాక్టర్.ఎంఏ.హకీమ్ మండలంలో ఏ గ్రామంలో అయినా ఆడబిడ్డ పుడితే ఆ ఆడబిడ్డకు రూ.5వేల రూపాయల ఆర్థిక సహాయం, తల్లిదండ్రులకు బట్టలు పెడతానని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ ప్రకారం పోతంగల్ మండల కేంద్రంలో ఆడ శిశువు పుట్టగా స్థానిక టిఆర్ఎస్ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న డాక్టర్.హకీమ్ సోమవారం ఆ శిశువు తల్లిదండ్రులకు మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ చేతుల మీదుగా నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఆడ శిశువు తల్లిదండ్రులు డాక్టర్. ఎంఏ.హకీమ్ కు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ... మండలంలో పుట్టిన ఆడ శిశువుల తల్లిదండ్రులకు అండగా నిలుస్తూ ఆర్థిక సహాయంతో పాటు బట్టలు పెడుతున్న డాక్టర్ హకీమ్ చేస్తున్న సేవలు ఎంతో గొప్పవని అన్నారు. హకీం లాంటి నాయకులు బీఆర్ఎస్ పార్టీలో ఉండడం గర్వకారణమని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, ఎస్.ఐ.ఆర్ నియోజకవర్గ ఇంచార్జ్ తోట ఆగన్న, జుబేర్, మోరెల్ శ్రీనివాస్,అంజిరెడ్డి,రత్నకుమార్,సుదం నవీన్ తేల్ల రవికుమార్, మోరె కిషన్, ఆరిఫ్,మాజీ ఎంపీటీసీ ఫారూఖ్, దేవేందర్,ఎజాజ్, సాగర్, దాసు ,మధు(రుద్రూర్), గోపిరెడ్డి (చందూర్),నాగభూషణం (వర్ని),గంగప్ప (వర్ని), విఠల్ (దామరంచ మాజీ సర్పంచ్), మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రేవంత్‌కు రెండో చాన్స్ ఉందా?

- **చంద్రబాబు.. వైఎస్.. కేసీఆర్ రెండోసారి గెలిచిన చరిత్రలో రేవంత్‌కు కనిపిస్తున్న సంకేతాలేమిటి?**





ఒక్కసారి అధికారం సాధించడం వేరు.. రెండోసారి ప్రజల తీర్పు పొందడం వేరు.. తెలుగునాట ముగ్గురు నాయకుల రాజకీయ ప్రయాణం ఇప్పుడు రేవంత్ ముందున్న పరీక్షకు అద్దం పడుతోంది

ఒక ముఖ్యమంత్రి అధికారంలోకి రావడం ఒక రాజకీయ విజయం. అదే ముఖ్యమంత్రి మరోసారి ప్రజల తీర్పుతో అధికారాన్ని నిలబెట్టుకోవడం మాత్రం మరో స్థాయి విజయం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రను పరిశీలిస్తే రెండోసారి ముఖ్యమంత్రి పీఠాన్ని దక్కించుకున్న నాయకులు చాలా మందే ఉన్నారనిపించినా, అదే నాయకత్వంలో వరుసగా ప్రజల తీర్పును పొందిన సందర్భాలు పరిమితమే. ముఖ్యంగా ఎన్. చంద్రబాబు నాయుడు, వైఎస్ రాజశేఖరరెడ్డి, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కె. చంద్రశేఖర్‌రావు రెండోసారి అధికారంలోకి వచ్చిన తీరు ఒక్కో విధంగా ప్రత్యేకమైనది. ఇప్పుడు తెలంగాణలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ముందున్న ప్రశ్న కూడా ఇదే. 2023లో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకువచ్చిన రేవంత్‌రెడ్డి 2028లో అదే పార్టీని మరోసారి అధికారంలోకి తీసుకురాగలరా? ఈ ప్రశ్నకు సమాధానం చెప్పాలంటే గతంలో రెండోసారి గెలిచిన ముగ్గురు ముఖ్యమంత్రుల రాజకీయ ప్రయాణాన్ని పరిశీలించాల్సిందే.

**1995 నుంచి 1999 వరకు..**
**చంద్రబాబు తొలి పరీక్ష**

ఎన్. చంద్రబాబు నాయుడు 1995 ఆగస్టులో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఆ తర్వాత 1999లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలు ఆయన నాయకత్వానికి తొలి పెద్ద పరీక్షగా నిలిచాయి. అప్పటికే అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీని మరోసారి గెలిపించుకోవడానికి చంద్రబాబు పరిపాలన, పార్టీ యంత్రాంగం, ఎన్నికల వ్యూహం అనే మూడు అంశాలపై దృష్టి పెట్టారు. 1999 ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించడంతో చంద్రబాబు రెండోసారి ముఖ్యమంత్రి అయ్యారు. ఈ విజయం ఆయన వ్యక్తిగత రాజకీయ బలానికి మాత్రమే కాకుండా పార్టీ యంత్రాంగం ఆయన చుట్టూ ఒకే నాయకత్వంగా పనిచేసిన కాలానికి కూడా ఉదాహరణగా నిలిచింది.

**చంద్రబాబు రెండోసారి ఎందుకు గెలిచారు?**

1995 నుంచి 1999 మధ్య చంద్రబాబు పార్టీపై గట్టి పట్టు సాధించారు. కార్యకర్తల నుంచి సీనియర్ నాయకుల వరకు ఆయన నాయకత్వాన్ని అంగీకరించే పరిస్థితి ఏర్పడింది. పరిపాలనలో సంస్కరణలు, ఐటీ రంగానికి ప్రాధాన్యం, హైదరాబాద్‌ను అభివృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దే ప్రయత్నాలు, పరిపాలనా వ్యవస్థపై ప్రత్యేక దృష్టి వంటి అంశాలు ఆయనకు ప్రత్యేకమైన నాయకుడనే ఇమేజ్‌ను తీసుకొచ్చాయి. అదే సమయంలో పార్టీ శ్రేణులు కూడా నాయకుడి విజయాన్ని తమ విజయంగా భావించే స్థితిలో ఉండటం 1999 ఎన్నికల్లో ఉపయోగపడింది. అంటే చంద్రబాబు రెండోసారి గెలవడంలో కేవలం ప్రభుత్వ పనితీరు మాత్రమే కాదు.. పార్టీ యంత్రాంగం, నాయకత్వంపై నమ్మకం, ఎన్నికల నిర్వహణ కూడా కీలక పాత్ర పోషించాయి.

**కానీ 2004లో పరిస్థితి మారింది**

1999లో రెండోసారి గెలిచిన తర్వాత రాజకీయ పరిస్థితులు మారాయి. 19992004 మధ్య చంద్రబాబు పాలనా విధానాలపై ప్రజల్లో భిన్నాభిప్రాయాలు ఏర్పడ్డాయి. వ్యవసాయ రంగం, గ్రామీణ సమస్యలు, కరువు, విద్యుత్ సమస్యలు వంటి అంశాలు ఎన్నికల సమయంలో కీలకంగా మారాయి. 2004లో కాంగ్రెస్ పార్టీ వైఎస్ రాజశేఖరరెడ్డి నాయకత్వంలో ఎన్నికలను ఎదుర్కొని అధికారంలోకి వచ్చింది. అంటే రెండోసారి గెలిచిన నాయకుడికి కూడా మూడోసారి విజయం ఆటోమేటిక్ కాదని చంద్రబాబు రాజకీయ చరిత్ర స్పష్టం చేసింది.

**2004లో వైఎస్.. 2009లో మళ్లీ వైఎస్**

వైఎస్ రాజశేఖరరెడ్డి 2004 మేలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 2004 ఎన్నికలకు ముందు ఆయన చేసిన సుదీర్ఘ పాదయాత్ర కాంగ్రెస్‌కు ప్రజలతో నేరుగా సంబంధం ఏర్పడటానికి సహాయపడింది. ముఖ్యమంత్రి అయిన తర్వాత రైతులు, పేదలు, విద్యార్థులు, ఆరోగ్య రంగం వంటి అంశాలను కేంద్రంగా చేసుకుని పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ వంటి కార్యక్రమాలు ఆయన ప్రభుత్వానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చాయి. ఈ నేపథ్యంలో 2009 అసెంబ్లీ ఎన్నికలు వైఎస్ నాయకత్వానికి రెండో పరీక్షగా మారాయి.

**2009 మే.. వైఎస్ మరోసారి విజయం**

2009 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వచ్చింది. వైఎస్ రాజశేఖరరెడ్డి రెండోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 2004 నుంచి 2009 వరకు సంక్షేమ పథకాలు, రైతులపై దృష్టి, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, జలయజ్ఞం వంటి కార్యక్రమాలను కాంగ్రెస్ ప్రభుత్వం తన ఎన్నికల ప్రచారంలో ప్రధానంగా ముందుకు తీసుకెళ్లింది. మరోవైపు రాజకీయ సమీకరణాలు కూడా కాంగ్రెస్‌కు అనుకూలంగా పనిచేశాయి. ప్రజారాజ్యం పార్టీ ఆవిర్భావం, కాంగ్రెస్ వ్యతిరేక ఓటు విభజన, టీడీపీటీఆర్ఎస్ పొత్తు వంటి అంశాలు కూడా 2009 ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపిన అంశాలుగా రాజకీయ విశ్లేషణల్లో ప్రస్తావించబడతాయి. అందువల్ల వైఎస్ రెండోసారి గెలుపును కేవలం ఒకే కారణంతో వివరించడం సరైంది కాదు. ప్రభుత్వ పనితీరు, సంక్షేమ కార్యక్రమాలు, నాయకత్వం, రాజకీయ సమీకరణాలు అన్నీ కలిసి పనిచేశాయి.

**వైఎస్ రెండోసారి విజయం**
**ఇచ్చిన ప్రధాన సందేశం**

వైఎస్ రాజశేఖరరెడ్డి రెండోసారి అధికారంలోకి వచ్చినప్పుడు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆయన నాయకత్వాన్ని బలంగా ముందుకు తీసుకెళ్లాయి. ఒక నాయకుడి వ్యక్తిగత ప్రజాదరణకు పార్టీ యంత్రాంగం తోడైతే ఎన్నికల విజయానికి అది బలమైన కలయికగా మారుతుందని 2009 ఫలితం చూపించింది. అయితే రెండోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన కొద్దికాలానికే 2009 సెప్టెంబర్ 2న వైఎస్ రాజశేఖరరెడ్డి హెలికాప్టర్ ప్రమాదంలో మరణించారు. దీంతో ఆయన రెండో పర్యాయం పూర్తికాలం కొనసాగలేదు. అయినప్పటికీ వరుసగా రెండుసార్లు ప్రజల తీర్పుతో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడం ఆయన రాజకీయ చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించింది.

**2014లో తెలంగాణ..**
**కొత్త రాజకీయ అధ్యాయం**

రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ రాజకీయాలు పూర్తిగా కొత్త దశలోకి వెళ్లాయి. 2014 జూన్ 2న తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. అదే ఏడాది జరిగిన తొలి అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్ర సమితి విజయం సాధించడంతో కె. చంద్రశేఖర్‌రావు తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ ఉద్యమానికి నాయకత్వం వహించిన కేసీఆర్‌కు 2014లో లభించిన అధికారం ఒక చారిత్రక విజయంగా నిలిచింది. కానీ 2018 ఎన్నికలు ఆయనకు మరింత కీలకమైనవి. ఎందుకంటే అప్పటికి తెలంగాణలో అధికారంలో ఉన్న తొలి ప్రభుత్వం ప్రజల ముందు తన పనితీరుతో నిలబడాల్సి వచ్చింది.

**2018 డిసెంబర్.. కేసీఆర్ రెండోసారి**

2018 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్ఎస్ 119 స్థానాల్లో 88 స్థానాలు గెలుచుకుంది. ఓట్ల శాతంలో కూడా టీఆర్ఎస్ 46.87 శాతం సాధించింది. కాంగ్రెస్ 19 స్థానాలు, టీడీపీ 2 స్థానాలు గెలిచాయి. ఫలితంగా కేసీఆర్ నాయకత్వంలోని టీఆర్ఎస్ వరుసగా రెండోసారి తెలంగాణలో ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

**కేసీఆర్ రెండోసారి గెలుపు**
**వెనుక ఏం జరిగింది?**

2018 ఎన్నికల్లో కేసీఆర్ ముందస్తు ఎన్నికలకు వెళ్లడం ఒక కీలక రాజకీయ వ్యూహంగా నిలిచింది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, రైతుబంధు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ వంటి కార్యక్రమాలు ఒకవైపు ఉంటే.. మరోవైపు తెలంగాణ ప్రాంతీయతను ఎన్నికల రాజకీయాల్లో బలంగా ఉపయోగించుకోవడం జరిగింది. కాంగ్రెస్, టీడీపీ కలిసి పోటీ చేయడం కూడా కేసీఆర్‌కు రాజకీయంగా అనుకూలమైన ప్రచార అంశంగా మారింది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడు తెలంగాణ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో కలిసి ప్రచారం చేయడం ద్వారా కేసీఆర్ ఎన్నికలను "తెలంగాణ ప్రయోజనాలు వర్సెస్ బయటి రాజకీయ ప్రభావం" అనే కోణంలో మలచగలిగారు. ఫలితంగా 2018లో టీఆర్ఎస్ ఘన విజయం సాధించింది.

**ముగ్గురు నాయకుల**
**రెండో విజయాల్లో ఒకే సూత్రం ఉందా?**

చంద్రబాబు 1999లో, వైఎస్ 2009లో, కేసీఆర్ 2018లో రెండోసారి అధికారంలోకి వచ్చారు. కాలం వేరు. పార్టీలు వేరు. రాజకీయ పరిస్థితులు వేరు. ఎన్నికల అంశాలు వేరు. అయినప్పటికీ ఈ ముగ్గురి విజయాల్లో కొన్ని సామాన్య లక్షణాలు కనిపిస్తాయి. మొదటిది.. ముఖ్యమంత్రి నాయకత్వంపై పార్టీ శ్రేణుల్లో ఒక స్థాయి నమ్మకం. రెండోది.. ప్రభుత్వ పనితీరును ప్రజల ముందుకు తీసుకెళ్లగల సామర్థ్యం. మూడోది.. ఎన్నికల సమయంలో ప్రత్యర్థుల కంటే స్పష్టమైన రాజకీయ కథనాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడం. నాలుగోది.. సామాజిక, ప్రాంతీయ, రాజకీయ సమీకరణాలను తమకు అనుకూలంగా మలచుకోవడం. ఐదోది.. ఎన్నికలకు ముందు పార్టీ యంత్రాంగాన్ని ఒకే లక్ష్యంతో పనిచేయించడం.

**రెండోసారి గెలిచిన ముగ్గురికీ**
**మూడోసారి మాత్రం సాధ్యపడలేదు**

ఇక్కడే మరో ముఖ్యమైన రాజకీయ పాఠం ఉంది. రెండోసారి గెలిచినంత మాత్రాన మూడోసారి కూడా గెలుపు ఖాయమవుతుందని చరిత్ర చెప్పలేదు. 1999లో రెండోసారి గెలిచిన చంద్రబాబు 2004లో అధికారాన్ని కోల్పోయారు. 2018లో రెండోసారి గెలిచిన కేసీఆర్ 2023లో కాంగ్రెస్ చేతిలో ఓడిపోయారు. వైఎస్ మాత్రం రెండోసారి ముఖ్యమంత్రి అయిన కొద్దికాలానికే మరణించడంతో ఆయనకు మూడోసారి ఎన్నికలను ఎదుర్కొనే అవకాశం రాలేదు. అంటే వరుస విజయాలకు ఒక పరిమితి ఉందని ఈ చరిత్ర చెబుతోంది. అధికారంలో ఉన్న నాయకుడికి ప్రజల అంచనాలు ప్రతి ఎన్నికతో పెరుగుతాయి. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, పాలనా ఫలితాలు, పార్టీ అంతర్గత పరిస్థితులు, ప్రత్యర్థుల బలం అన్నీ తదుపరి ఎన్నికల్లో కొత్తగా లెక్కించబడతాయి.

**ఇప్పుడు అదే ప్రశ్న రేవంత్‌రెడ్డిపై**

2023 డిసెంబర్‌లో రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో పదేళ్ల తర్వాత అధికారంలోకి రావడం, బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఓడించడం ఆయన నాయకత్వానికి ముఖ్యమైన విజయంగా నిలిచింది. ఇప్పుడు ఆయన ముందున్న అసలు పరీక్ష 2028 అసెంబ్లీ ఎన్నికలు. గతంలో రెండోసారి గెలిచిన చంద్రబాబు, వైఎస్, కేసీఆర్‌ల మాదిరిగా రేవంత్ కూడా మొదటి ప్రభుత్వాన్ని ప్రజల ముందు ఒక రాజకీయ విజయగాథగా మార్చగలిగితే ఆయనకు రెండో అవకాశం బలపడుతుంది. అయితే చరిత్రను కాపీ చేయడం ద్వారా ఎన్నికలు గెలవలేరు. ప్రతి కాలానికి కొత్త సమస్యలు, కొత్త ఓటర్లు, కొత్త రాజకీయ సమీకరణాలు ఉంటాయి.

**రేవంత్‌కు చంద్రబాబు నుంచి వచ్చే పాఠం**

చంద్రబాబు 1999లో రెండోసారి గెలిచినప్పుడు పార్టీ యంత్రాంగం తన నాయకత్వం చుట్టూ బలంగా నిలిచింది. రేవంత్‌కు కూడా అదే స్థాయిలో పార్టీని సమన్వయం చేయాల్సిన అవసరం ఉంది. కాంగ్రెస్‌లో భిన్న వర్గాలు ఉండటం సహజమే. కానీ ఎన్నికల సమయానికి అవన్నీ ఒకే రాజకీయ లక్ష్యంతో పనిచేయాలి. ముఖ్యమంత్రి నాయకత్వాన్ని పార్టీ శ్రేణులు బలపరిచే పరిస్థితి ఏర్పడితేనే ప్రభుత్వ పనితీరు ఎన్నికల ఫలితంగా మారుతుంది.

**రేవంత్‌కు వైఎస్ నుంచి వచ్చే పాఠం**

వైఎస్ రాజశేఖరరెడ్డి రెండోసారి గెలిచినప్పుడు సంక్షేమ పథకాలు ప్రజల్లో ఆయన ప్రభుత్వానికి ఒక ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చాయి. రేవంత్‌కు కూడా ఇదే ఒక ముఖ్యమైన పాఠం. ప్రభుత్వ పథకాలు కేవలం కాగితాలపై ఉండకుండా ప్రజల జీవితాల్లో కనిపించాలి. పేదలు, రైతులు, మహిళలు, యువత, ఉద్యోగులు, మధ్యతరగతి.. ప్రతి వర్గానికి ప్రభుత్వం ఏం చేసిందో స్పష్టంగా కనిపించాలి. ఎన్నికల ప్రచారానికి ముందు నుంచే ప్రభుత్వ పనితీరు ప్రజల అనుభవంగా మారాలి.

**రేవంత్‌కు కేసీఆర్ నుంచి వచ్చే పాఠం**

కేసీఆర్ 2018లో కేవలం ప్రభుత్వ పనితీరుతోనే కాకుండా బలమైన రాజకీయ కథనంతో ఎన్నికలను ఎదుర్కొన్నారు. ప్రత్యర్థుల పొత్తులను తనకు అనుకూలంగా మలచుకున్నారు. తెలంగాణ ప్రాంతీయ భావనను ఎన్నికల వ్యూహంలో ఉపయోగించారు. రేవంత్ కూడా 2028 ఎన్నికల్లో తనకు అనుకూలమైన రాజకీయ కథనాన్ని నిర్మించుకోవాల్సి ఉంటుంది. అయితే తెలంగాణలో పరిస్థితులు 2018తో పోలిస్తే పూర్తిగా మారిపోయాయి. కాబట్టి పాత ఫార్ములాను యథాతథంగా అనుసరించడం కంటే ప్రస్తుత సమస్యలకు కొత్త రాజకీయ సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది.

**అధిష్ఠానం అండ.. రేవంత్‌కు బలం**

ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో కాంగ్రెస్ అధిష్ఠానం రేవంత్‌రెడ్డి నాయకత్వాన్ని కొనసాగించడానికి మద్దతు ఇస్తున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. తాజాగా కొండా సురేఖ వ్యవహారంలో పార్టీ క్రమశిక్షణా ప్రక్రియకు అనుగుణంగా చర్యలు తీసుకోవడం కూడా రేవంత్‌కు కొంత రాజకీయ ఊరట ఇచ్చిన పరిణామం. అయితే అధిష్ఠానం మద్దతు అంటే ఎన్నికల విజయం హామీ కాదు. ఢిల్లీ నుంచి లభించే మద్దతును రాష్ట్రంలోని పార్టీ యంత్రాంగం, ప్రజాభిప్రాయం, ప్రభుత్వ పనితీరుగా మార్చుకోవాల్సింది రేవంత్ నాయకత్వమే.

**రేవంత్ రెండోసారి గెలవడానికి**
**ప్రయత్నిస్తున్నారా?**

రాజకీయంగా చూస్తే అందుకు అవసరమైన ప్రయత్నాలు కనిపిస్తున్నాయి. ముఖ్యమంత్రి పదవిలో కొనసాగుతూ ప్రభుత్వ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడం, పార్టీని బలోపేతం చేయడం, స్థానిక రాజకీయాల్లో కాంగ్రెస్ బలాన్ని పెంచడం, భవిష్యత్ ఎన్నికలకు అనుకూల వాతావరణం నిర్మించుకోవడం వంటి చర్యలు సహజంగానే రెండోసారి అధికార లక్ష్యంతో ముడిపడి ఉంటాయి. అయితే "రేవంత్ రెండోసారి గెలవడానికి ప్రయత్నిస్తున్నారు" అనేది ఒక రాజకీయ విశ్లేషణ. "రేవంత్ తప్పకుండా రెండోసారి ముఖ్యమంత్రి అవుతారు" అనేది మాత్రం ఇప్పుడే చెప్పలేని అంచనా. ఎన్నికల తీర్పు ఇంకా దూరంలో ఉంది.

**అసలు పోటీ రేవంత్ వర్సెస్**
**ప్రతిపక్షం మాత్రమే కాదు**

రేవంత్‌రెడ్డికి 2028లో ప్రధాన పరీక్ష ప్రతిపక్షాలతో పోరాడటమే కాదు. కాంగ్రెస్‌లోని అన్ని వర్గాలను సమన్వయం చేయడం, ప్రభుత్వంపై ప్రజల్లో నమ్మకం కొనసాగించడం, ఇచ్చిన హామీల అమలుపై స్పష్టత ఇవ్వడం, అభివృద్ధి పనులను వేగవంతం చేయడం, సామాజిక సమీకరణాలను సమతుల్యం చేయడం కూడా అంతే ముఖ్యం. ఒకవైపు అధిష్ఠానం మద్దతు ఉండటం ఆయనకు బలం. మరోవైపు ముఖ్యమంత్రి పదవిలో ఉన్నందున ప్రభుత్వంపై ఏర్పడే ప్రతి అసంతృప్తికి బాధ్యత కూడా ఆయనపైనే పడుతుంది.

**ముగ్గురి చరిత్ర.. రేవంత్‌కు ఒక హెచ్చరిక**

చంద్రబాబు రెండోసారి గెలిచారు.. కానీ మూడోసారి ఓడిపోయారు. వైఎస్ రెండోసారి గెలిచారు.. కానీ ప్రకృతి విషాదం ఆయన రాజకీయ ప్రయాణాన్ని మధ్యలోనే ముగించింది. కేసీఆర్ రెండోసారి ఘన విజయం సాధించారు.. కానీ ఐదేళ్ల తర్వాత 2023లో అధికారం కోల్పోయారు. ఈ మూడు ఉదాహరణలు ఒకే విషయాన్ని చెబుతున్నాయి. రెండోసారి గెలవడం నాయకుడి శక్తికి నిదర్శనం కావచ్చు. కానీ అధికారాన్ని నిలబెట్టుకోవడానికి ప్రతి ఎన్నికలో కొత్తగా ప్రజల విశ్వాసాన్ని సంపాదించుకోవాలి.

**రేవంత్‌కు రెండో చాన్స్ ఉందా?**

ఉంది. కానీ అది చరిత్ర ఇచ్చే హామీ కాదు. చంద్రబాబు రెండోసారి గెలిచినందున రేవంత్ కూడా గెలుస్తారని చెప్పలేం. వైఎస్ రెండోసారి గెలిచినందున అదే ఫలితం రేవంత్‌కు వస్తుందని చెప్పలేం. కేసీఆర్ 2018లో ఘన విజయం సాధించినందున రేవంత్‌కు కూడా అదే పరిస్థితి వస్తుందని ఊహించలేం. అయితే ఈ ముగ్గురు నాయకుల చరిత్ర రేవంత్‌కు ఒక విలువైన మార్గదర్శకాన్ని మాత్రం ఇస్తోంది. పార్టీని తన నాయకత్వం చుట్టూ ఏకం చేయాలి. ప్రభుత్వ పనితీరును ప్రజలకు కనిపించేలా చేయాలి. ప్రజల నమ్మకాన్ని కోల్పోకూడదు. ప్రత్యర్థుల కంటే స్పష్టమైన రాజకీయ కథనాన్ని నిర్మించాలి. అంతిమంగా రేవంత్ రెండోసారి ముఖ్యమంత్రి అవుతారా లేదా అన్నది ఈరోజు నిర్ణయించాల్సిన విషయం కాదు. 2028 ఎన్నికల రోజు తెలంగాణ ప్రజలు ఇచ్చే తీర్పే తుది సమాధానం. కానీ చరిత్ర ఒక విషయాన్ని మాత్రం స్పష్టంగా చెబుతోంది—తెలుగునాట రెండోసారి అధికారంలోకి రావడం అసాధ్యం కాదు.. అయితే అది ఎప్పుడూ సులభం కూడా కాదు. చంద్రబాబు, వైఎస్, కేసీఆర్ ముగ్గురూ తమ తమ కాలంలో ప్రత్యేకమైన రాజకీయ పరిస్థితులను సృష్టించుకుని రెండోసారి గెలిచారు. ఇప్పుడు రేవంత్‌రెడ్డి తనకంటూ అలాంటి రాజకీయ పరిస్థితిని నిర్మించగలరా? అన్నదే అసలు ప్రశ్న.



ఎం రవీందర్
సీనియర్ జర్నలిస్ట్
79011603777

# ఆత్మహత్యేనా..?మరేదైనా కోణం ఉందా..?పోలీసుల దర్యాప్తు

- మంటల్లో కారు..లోపల కాలిపోయిన కార్తీక్!
- బౌరంపేట ఓపెన్ ఏరియాలో ఉదయాన్నే కలకలం

**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 07(ప్రజాక్షేత్రం):**

దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బౌరంపేటలో సోమవారం ఉదయం విషాద ఘటన చోటుచేసుకుంది. ఓపెన్ ఏరియాలో నిలిపి ఉన్న కారులో మంటలు చెలరేగగా, అందులో ఓ వ్యక్తి మృతదేహం కాలిపోయిన స్థితిలో లభ్యమైంది. పోలీసుల కథనం ప్రకారం.. సెప్టెంబర్ 7వ తేదీ ఉదయం సుమారు 7 గంటల సమయంలో బౌరంపేటలోని రుద్ర కన్స్ట్రక్షన్స్ సమీపంలోని ఓపెన్ ఏరియాలో ఓ కారు మంటల్లో కాలిపోతున్నట్లు సమాచారం అందింది. వెంటనే దుండిగల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కారులో ఒక వ్యక్తి మంటల్లో కాలిపోయి మృతిచెందినట్లు గుర్తించారు. మృతుడిని బౌరంపేట ప్రణీత్ ప్రణవ్ విలాస్‌కు చెందిన కార్తీక్ (40)గా గుర్తించారు. ఆయన తండ్రి పేరు రాధాకృష్ణ. కార్తీక్ లాండ్రీ వ్యాపారం నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కార్తీక్ భార్య గత రెండున్నర సంవత్సరాలుగా ఆయనకు దూరంగా ఉంటున్నట్లు సమాచారం. అలాగే ఆయన అనారోగ్యంతో పాటు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ప్రాథమికంగా తెలుస్తోందని పోలీసులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చన్న కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. అయితే మృతికి గల ఖచ్చితమైన కారణాలు దర్యాప్తు అనంతరం మాత్రమే వెల్లడవుతాయని పోలీసులు తెలిపారు. ఘటనపై దుండిగల్ పోలీసులు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.





# బౌరంపేట్ అసైన్మెంట్ భూములపై హక్కుల కోసం దళితుల ధర్నా

- 75 ఏళ్ల సాగుకు న్యాయం ఎక్కడ?
- 32 ఎకరాలు స్వాధీనం..100 దళిత కుటుంబాల జీవనోపాధిపై ప్రశ్నార్థకం

**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 07(ప్రజాక్షేత్రం):**

దశాబ్దాలుగా వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న దళిత కుటుంబాల భవిష్యత్తు ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారిందని బౌరంపేట్ మాజీ సర్పంచ్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు కొమ్ము మంగమ్మ అన్నారు. బౌరంపేట్ సర్వేనెంబర్ 472లోని అసైన్మెంట్ భూమిలో దళితులకు హక్కులు కల్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం దుండిగల్-గండి మైసమ్మ మండల కార్యాలయం ముందు దళితులతో కలిసి ఆమె ధర్నా నిర్వహించారు. గత 75 సంవత్సరాలుగా ఈ భూమిపై ఆధారపడి వ్యవసాయం చేసుకుంటున్న దళిత కుటుంబాలకు ఎలాంటి పునరావాసం కల్పించకుండా ప్రభుత్వం 32 ఎకరాల భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవడంతో సుమారు 100 కుటుంబాల జీవనోపాధి ప్రమాదంలో పడిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. దుండిగల్ ప్రాంతంలో అసైనీలకు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వ స్థలాలను కేటాయిస్తున్నప్పుడు, బౌరంపేట్ దళితులకు కూడా అదే విధంగా న్యాయం చేయాలని మంగమ్మ డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్ణయాల్లో దళితులకు అన్యాయం జరగకూడదని స్పష్టం చేశారు.

ధర్నాలో పాల్గొన్న దళితులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దార్ రాజేశ్వర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దళిత నేతలు డప్పు కృష్ణ, బాలగారి నరసింహ, కొమ్ము యాదయ్య, చింతకింది రమేష్, చింతకింది ముత్తమ్మ, కొమ్ము వీరయ్య, బాలగారి మల్లేష్, చింతకింది రాములమ్మ, అగ్గి నరసింహతో పాటు పెద్ద సంఖ్యలో దళితులు పాల్గొన్నారు.



# 170 మంది..ఒక్క అవకాశం..సత్తా కోసం సమరం

- కుత్బుల్లాపూర్ జోన్ జట్టులో చోటు కోసం హోరాహోరీ
- అండర్–14, అండర్–17 క్రికెట్ జోనల్ ఎంపికలు

**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 07(ప్రజాక్షేత్రం):**

కుత్బుల్లాపూర్ జోన్‌లో యువ క్రికెట్ ప్రతిభకు వేదికగా జోనల్ స్థాయి ఎంపికలు నిలిచాయి. బౌరంపేట్‌లోని కార్తికేయ క్రికెట్ గ్రౌండ్స్‌లో అండర్-14, అండర్-17 బాలుర క్రికెట్ జోనల్ స్థాయి ఎంపికలను నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన 170 మంది క్రీడాకారులు ఎంపికల్లో పాల్గొని తమ బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ ప్రతిభను ప్రదర్శించారు. కుత్బుల్లాపూర్ ఎస్ జి ఎఫ్ జోనల్ సెక్రటరీ పి. నాగరాజ్ గౌడ్ ఆధ్వర్యంలో ఎంపికల ప్రక్రియ కొనసాగింది. ప్రతిభ ఆధారంగా క్రీడాకారులను పరిశీలిస్తూ తదుపరి స్థాయి పోటీలకు అర్హులను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో పీడీలు వినోద్, విజయ్, రమేష్, సురేష్, సునీల్ తదితరులు పాల్గొని ఎంపికల నిర్వహణకు సహకరించారు. జోనల్ స్థాయిలో సత్తా చాటిన క్రీడాకారులు తదుపరి పోటీల్లోనూ ప్రతిభ కనబరిచి కుత్బుల్లాపూర్ జోన్‌కు మంచి పేరు తీసుకురావాలని నిర్వాహకులు ఆకాంక్షించారు.






# ఫుట్‌పాత్‌లు ..పాదచారులకా వాహనాలకా?

- ఫుట్‌పాత్‌కు పార్కింగ్ గ్రహణం.. సూరారం సిగ్నల్‌కు ట్రాఫిక్ శాపం!
- రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద పార్కింగ్ గందరగోళం!

**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 07(ప్రజాక్షేత్రం):**

సూరారం సిగ్నల్ సమీపంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతోంది. ఒకవైపు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులతో రహదారిపై రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతుండగా.. మరోవైపు ఫుట్‌పాత్‌లు, రోడ్డు అంచులు అక్రమ పార్కింగ్‌కు అడ్డాగా మారడంతో పరిస్థితి మరింత గందరగోళంగా మారుతోంది. నర్సాపూర్-బాలానగర్ ప్రధాన రహదారి కావడంతో ఈ మార్గంలో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. సూరారం సిగ్నల్ వద్ద ఇప్పటికే వాహనాల రద్దీ అధికంగా ఉండగా.. కుత్బుల్లాపూర్ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వచ్చే కొందరు వాహనదారులు ఫుట్‌పాత్‌పైనే వాహనాలను నిలిపివేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

**ఫుట్‌పాత్‌పై వాహనాలు.. రోడ్డుపైకి పాదచారులు**

పాదచారుల కోసం ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లు పార్కింగ్ స్థలాలుగా మారడంతో నడిచే వారికి దారి లేకుండా పోతోంది. దీంతో వారు తప్పనిసరిగా ప్రధాన రహదారిపైనే నడవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇది ట్రాఫిక్ సమస్యతో పాటు పాదచారుల భద్రతపైనా ఆందోళన కలిగిస్తోంది.

**డ్రైనేజీ పనులు ఒకవైపు..పార్కింగ్ మరోవైపు**

అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనుల కారణంగా రహదారిపై అందుబాటులో ఉన్న మార్గం తగ్గిపోతుండగా.. మిగిలిన స్థలంలోనూ వాహనాలను ఇష్టారీతిన నిలిపివేయడంతో ట్రాఫిక్ కదలిక మరింత మందగిస్తోంది. సిగ్నల్ వద్ద కొద్దిసేపు నిలిచే వాహనాలు కూడా క్రమంగా పెద్ద క్యూలుగా మారుతున్నాయని వాహనదారులు చెబుతున్నారు. పార్కింగ్‌పై చర్యలు లేకపోతే సమస్య మరింత ముదిరే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫుట్‌పాత్‌లు పాదచారులకే అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవడంతో పాటు రోడ్లపై అడ్డదిడ్డంగా పార్కింగ్ చేస్తున్న వాహనాలపై ట్రాఫిక్ పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. ప్రధాన రహదారిపై పనులు పూర్తయ్యే వరకు ట్రాఫిక్ నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.. ఫుట్‌పాత్ ఆక్రమణలకు చెక్ పెట్టాలి.. అప్పుడే సూరారం సిగ్నల్ వద్ద ట్రాఫిక్ కష్టాలకు కొంతమేర పరిష్కారం లభిస్తుందని వాహనదారులు, పాదచారులు అంటున్నారు.



# కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసింది

- బీఆర్ఎస్ నేతలు దా రెడ్డి వెంకట్ రెడ్డి, కొంపల్లి అనంతరెడ్డి

**మొయినాబాద్, సెప్టెంబర్ 07(ప్రజా క్షేత్రం):**

వెయ్యి రోజులు గడిచినా ప్రజలకు ఒరిగిందేమీ లేదని, హామీల అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ నాయకులు దామోదర్ రెడ్డి, కొంపల్లి అనంతరెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మొయినాబాద్ ఎంపీడీవో కార్యాలయంలో ప్రజావాణి సందర్భంగా వారు మీడియాతో మాట్లాడారు.

ఎన్నికల సమయంలో ఆరు గ్యారంటీలని, పదమూడు డిక్లరేషన్లని నమ్మబలికి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, నేడు ఇచ్చిన 420 హామీలను విస్మరించి ప్రజలను మోసం చేసిందని నాయకులు మండిపడ్డారు. కేవలం ప్రచార ఆర్భాటాలకే పరిమితమైన ఈ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా చతికిలపడిందని, వెయ్యి రోజుల విఫల పాలనకు ప్రజలే తగిన సమయంలో తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ ఎంపీడీవోకు వినతిపత్రం అందజేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ శ్రేణులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.






# రామలింగేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించిన ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి..

**తాండూర్, సెప్టెంబర్ 07(ప్రజాక్షేత్రం):**

తాండూర్ మండల పరిధిలోని జినుగుర్తి గ్రామ శివారులో వెలసిన రామలింగేశ్వర స్వామి ఆలయంలో 43వ వార్షికోత్సవం, పురస్కరించుకొని శ్రావణ చివరి సోమవారం తాండూరు ఎమ్మెల్యే బియ్యని మనోహర్ రెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ, ఆలయ అభివృద్ధి కోసం మా వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయి అన్నారు. ప్రతి ఏడాది ఆలయంలో శ్రావణమాసం ముగింపు రోజున వార్షికోత్సవం గత 43 సంవత్సరాలుగా కొనసాగిస్తున్నారన్నారు. వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చూసుకోవడంతో పాటు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు, ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు, ధారాసింగ్, మున్సిపల్ చైర్ పర్సన్ నీరజ బాల్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్, వడ్డే శ్రీనివాస్, తాండూరు మండల అధ్యక్షులు రాజ్ కుమార్, కరంచంద్, మోహన్ దాస్, ఉత్తమ్ చంద్, రఘు కిషోర్, రమాదేవి, బాలకిషోర్, శివరాజ్, పద్మావతి, జగదంబ, తదితరులు పాల్గొన్నారు.

# ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి:తట్టు నారాయణ

**జహీరాబాద్ సెప్టెంబర్ 07(ప్రజాక్షేత్రం):**

కాంగ్రెస్ పార్టీ అధికారం కోసం ప్రజలకు 420 హామీలు 6 గ్యారెంటీలు 100 రోజులలో అమలు చేస్తామని చెప్పి ప్రజల ఓట్లతో గెలిచి ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ నేటికీ 1000 రోజులు కావస్తున్న హామీలు అమలు చేయడం చేతకాని కాంగ్రెస్* ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాజి మంత్రి వర్యులు సిద్దిపేట శాసనసభ్యులు తన్నీరు హరీష్ రావు స్థానిక శాసనసభ్యులు కొనింటి మాణిక్ రావు ఆదేశానుసారం జహీరాబాద్ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ ఆధ్వర్యంలో సర్పంచులు దాసరి మచ్చేందర్, గోవర్ధన్ రెడ్డి, అలిగి శ్రీనివాస్, చల్లా శ్రీనివాస్ రెడ్డి, ఎక్కెళ్ళి రాజు, భీం రావ్ రాథోడ్, మోహన్ రాథోడ్, అరుణ్ కుమార్, కాంటెస్టెడ్ సర్పంచులు గంట శ్రీనివాస్, గులాబ్ సింగ్, పెంటా రెడ్డి, సుందర్, నవీన్ తేజ, రాములు, శ్రీకాంత్, సాదిక్ సర్వార్, ఎస్టీ సెల్ అధ్యక్షులు హీరు రాథోడ్, బిసి సెల్ అధ్యక్షులు అమీత్ కుమార్, సోషల్ మీడియా కన్వీనర్ విజయ్ మాజీ సర్పంచులు చిన్న రెడ్డి, చందర్ చౌహాన్ మాజీ ఎంపిటీసీ బస్వారాజ్ నాయకులు పర్వేజ్, దత్తు రెడ్డి, శ్రీకాంత్ పండ్లీక్ పవార్, చంద్ర కాంత్ రెడ్డి, గోవింద్ రెడ్డి, బాల్ రాజ్, పవన్ రాథోడ్, మేఘునాథ్, ఆనందం, వీర్ శెట్టి, సహీద్ నర్సిములు పార్టీ ముఖ్య నాయకులతో కలిసి స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీఓ కు ఫిర్యాది చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల విఫల పాలనకు ప్రజలకు ఇచ్చిన హామీలను గుర్తు చేస్తూ ఆరు గ్యారెంటీలను తక్షణమే అమలు చేయాలని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారు. ఇప్పుడు ప్రజలను మోసం చేస్తున్నారు. మహిళలకు నెలకు 2,500 ఆర్థిక సాయం, రైతులకు ఇచ్చిన హామీలు, రైతు భరోసా, రైతు భీమా పంటలకు గిట్టుబాటు ధర, యువతకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యార్థినీలకు స్కూటర్లు, కౌలు రైతులకు న్యాయం, కళ్యాణ లక్ష్మితో పాటు తులం బంగారం, కేసీఆర్ కిట్ వంటి అనేక హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఒక మాట.. అధికారంలోకి వచ్చిన తర్వాత మరో మాట అంటూ ప్రజలను మభ్య పెట్టడం కాంగ్రెస్ ప్రభుత్వానికి తగదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడం ప్రభుత్వ బాధ్యత అని, హామీలను అమలు చేసే వరకు బిఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన నిలబడి పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు 1000 రోజులు గడిచినా హామీలు అమలు కాలేదు ప్రజల ప్రశ్నలకు కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలి ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలి వారు డిమాండ్



# సాహితీ సేవలకు గుర్తింపు..

- పలుస శంకర్‌గౌడ్‌కు ఘన సన్మానం

**వనపర్తి, సెప్టెంబర్ 07(ప్రజాక్షేత్రం):**

సాహిత్య, సాంస్కృతిక, సామాజిక రంగాల్లో విశేష సేవలందిస్తున్నవనపర్తి జిల్లా సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్‌ను కొత్త తెలంగాణ చరిత్రబృందం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం నందికంది క్షేత్రంలో నిర్వహించిన బొమ్మలపల్లకి ప్రతిభా పురస్కార సభకు శంకర్‌గౌడ్ ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు.

తెలంగాణ ప్రాంతంలోని ప్రముఖ పర్యాటక, చారిత్రక ప్రదేశాల విశిష్టతను ప్రజలకు పరిచయం చేసే ఉద్దేశంతో కొత్త తెలంగాణ చరిత్రబృందం ఆధ్వర్యంలో ఇటీవల చిత్రీకరణ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు నందికంది క్షేత్రంలో బహుమతుల ప్రదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సాహిత్య, సాంస్కృతిక, సామాజిక రంగాలకు పలుస శంకర్‌గౌడ్ అందిస్తున్న సేవలను గుర్తించి కొత్త తెలంగాణ చరిత్రబృందం తరపున జాతీయ కార్యనిర్వాహక కమిటీ, పాలక మండలి సభ్యుడు మణికొండ వేదకుమార్, ఫ్లీచ్ ఇండియా ఫౌండేషన్ ముఖ్య కార్యనిర్వహణాధికారి డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి, సంస్థ రాష్ట్ర కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ ఆయనను ఘనంగా సన్మానించారు. రోజంతా కొనసాగిన కార్యక్రమంలో కొత్త తెలంగాణ చరిత్రబృందం ప్రధాన కార్యదర్శి కట్టా శ్రీనివాస్, చరిత్ర పరిశోధకులు అరవింద్ ఆర్య, కపిలవాయి అశోక్‌బాబు, రవీందర్‌రెడ్డి, స్రవంతి విజయభాస్కర్‌రెడ్డి, రంగాచార్య, డాక్టర్ బైరోజు శ్యాంసుందర్, రాములు, గణేశ్‌కుమార్, శ్రీనివాస్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ పాలనపై బీఆర్ఎస్ నిరసన

**శంషాబాద్ సెప్టెంబర్ 07(ప్రజా-క్షేత్రం):**



ప్రజాస్వామ్యయుతంగా ప్రజల గొంతుకను వినిపించాల్సిన అసెంబ్లీ సమావేశాలకు టిఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను వెళ్లకుండా పోలీసుల బలవంతపు అరెస్టులతో అడ్డుకున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిపై బిఆర్ఎస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కాంగ్రెస్ అణచివేత ధోరణికి నిరసనగా సోమవారం శంషాబాద్ పట్టణంలోని 118 119 వ డివిజన్ అధ్యక్షుల ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులతో కలిసి భారీ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రజాస్వామ్యంపై దాడి ప్రజాప్రతినిధులపై నిర్బంధాలు ప్రయోగించి, శాసనసభలో ప్రజా సమస్యలు ప్రస్తావించకుండా అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికే మచ్చ. హక్కుల కాలరాపడమే ధ్యేయం ప్రతిపక్ష గొంతు నొక్కడం ద్వారా తమ విఫల పాలనను కప్పిపుచ్చుకోవచ్చని కాంగ్రెస్ భావిస్తోంది. ప్రజల తిరుగుబాటు తప్పదు కాంగ్రెస్ అవలంబిస్తున్న ఈ రౌడీయిజం, పోలీస్ మార్క్ అణచివేత ధోరణి ఎక్కువ కాలం సాగదని, రాబోయే రోజుల్లో ప్రజలే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు కొనమల్ల శ్రీనివాస్, బుచ్చిరెడ్డి, జయసింహ, రమేష్, రాజశేఖర్, అశోక్, రాజేందర్, వీరాచారి, రాఘవేందర్, చరణ్, సాగర్, జీడి నాని, శ్రీకాంత్, పరంధాములు, అశోక్, జగ్గయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమకారులను గుర్తించాలని ప్రజావాణి లో దరఖాస్తు అందజేత

- సంగిశెట్టి క్రిస్టఫర్, జోగు అంజయ్య మలిదశ ఉద్యమకారులు

**వలిగొండ సెప్టెంబర్ 07(ప్రజాక్షేత్రం):**

స్వరాష్ట్ర సాధన కోసం పోరాటాలు చేసిన ఉద్యమకారులను గుర్తించాలని వలిగొండలో ప్రజావాణిలో దరఖాస్తు అందజేసిన తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సంగిశెట్టి క్రిస్టఫర్ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు జోగు అంజయ్యలు సోమవారం ప్రజావాణిలో దరఖాస్తు అందచేశారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్యమకారుల సంక్షేమం గుర్తింపు పట్ల క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నట్లు ఉద్యమకారులకు న్యాయం చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రభుత్వం దగ్గర స్పష్టమైన సమాచారం ఉందని కానీ ప్రత్యేక వెబ్సైటు ప్రారంభించాలని కాలయాపన చేయవద్దని వారు విజ్ఞప్తి చేశారు. ఇప్పటికీ అనేక మంది ఉద్యమకారులు చనిపోయారని మరికొంతమందిని ఆదుకోవడానికి వేగంగా అడుగులు వేయాలని వారు అన్నారు.



# వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ నిరసన

- **హామీలు అమలు చేయాలని పార్టీ అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్ డిమాండ్..**
- **కలెక్టరేట్ ఎదుట ధర్నా**

**వనపర్తి, సెప్టెంబరు 07(ప్రజాక్షేత్రం):**

కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు పి రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో శ్రేణులు సోమవారం వనపర్తిలో నిరసన చేపట్టాయి. పట్టణంలో పాదయాత్ర నిర్వహించి ప్రజా సమస్యలను తెలుసుకున్న నాయకులు.. అనంతరం అదనపు కలెక్టర్ ఖీమ్య నాయక్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బి ఆర్ఎస్ జిల్లా పార్టీ అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్ మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రకటించిన ఆరు గ్యారంటీలు, వివిధ వర్గాలకు ఇచ్చిన హామీలు, డిక్లరేషన్లను వెంటనే అమలు చేయాలని వినతిపత్రంలో డిమాండ్ చేశారు. రైతులు, నిరుద్యోగులు, మహిళలు, విద్యార్థులు, వృద్ధులు, కార్మికులు, రైతు కూలీల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

**రైతు సమస్యలు పరిష్కరించాలి**

రైతుబంధు పథకం కింద ఎకరాకు రూ.15 వేల చొప్పున పెండింగ్‌లో ఉన్న మూడు విడతల మొత్తాన్ని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయడంతో పాటు రైతుబీమా పథకాన్ని కొనసాగించాలని కోరారు. యూరియా కొరతకు కారణమవుతున్న విధానాలను తొలగించి రైతులకు అవసరమైన మేరకు ఎరువులు అందుబాటులో ఉంచాలని, 24 గంటల నాణ్యమైన విద్యుత్తు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. రైతు కూలీలకు ఏటా రూ.12 వేల ఆర్థిక సాయం అందించాలని కోరారు.

**సాగునీరు విడుదల చేయాలి**

శ్రీశైలం జలాశయంలో నీటి లభ్యత ఉన్నప్పటికీ సాగునీటి విడుదలలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. ఎల్నినో ప్రభావం పేరుతో సాగునీటికి ఇబ్బందులు కల్పించకుండా రైతుల అవసరాలకు అనుగుణంగా నీటిని విడుదల చేయాలని కోరారు. కేఎల్ఐ ద్వారా చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు.

**హామీలన్నీ అమలు చేయాలి**

మహిళలకు మహాలక్ష్మి పథకం కింద నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, తులం బంగారం, ఇతర హామీలను అమలు చేయాలని కోరారు. ఇళ్లులేని అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు కేటాయించి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువతకు భృతి, ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్ అమలు చేయాలని, విద్యార్థులకు విద్యాభరోసా కల్పించి పెండింగ్ ఫీజులు విడుదల చేయాలని కోరారు.



వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, బీడీ కార్మికులకు పెంచిన రూ.4 వేల పింఛను అందించాలని, ఆటో కార్మికులకు ఏటా రూ.12 వేల సాయం చేయాలని డిమాండ్ చేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు, విద్యార్థులు, యువత, రైతులకు ప్రకటించిన డిక్లరేషన్లను అమలు చేయాలని కోరారు. పట్టణాలు, గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలను పరిష్కరించాలని, ప్రశ్నించే వారిపై నమోదైన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

**ఎమ్మెల్యేల అరెస్టుపై ధర్నా**

అనంతరం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసనకు వెళ్తుండగా ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేసిందని ఆరోపిస్తూ వాకిటి శ్రీధర్, పలుస రమేష్‌గౌడ్, తదితరులు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ అరెస్టు చేసిన ఎమ్మెల్యేలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వం తమ డిమాండ్లపై వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనలను మరింత ఉద్ధృతం చేస్తామని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నందిమల్ల అశోక్,గంధం పరంజ్యోతి, కౌన్సిలర్ శ్రీకర్‌గౌడ్, మహిళా నాయకులు కవితానాయక్, షెమిం బేగం, సీనియర్ నాయకులు ప్రేమ్‌నాథ్‌రెడ్డి, బండారు కృష్ణ, నాగన్నయాదవ్, రఘువర్ధన్‌రెడ్డి, దేవర్ల నరసింహ, మహేశ్వర్‌రెడ్డి, గులాం ఖాదర్‌ఖాన్, హేమంత్ ముదిరాజ్, సునీల్ వాల్మీకి, సూర్యవంశం గిరి, జోహెబ్ హుస్సేన్, చిట్యాల రాము, నందిమల్ల రమేష్, వెంకట్‌సాగర్, మంద రాము, ఆస్లాం, శ్రీవాటి శంకర్, అలీం తదితరులు పాల్గొన్నారు.

# విశ్వశాంతి మహాయాగంలో అన్నప్రసాద సేవ

- **విశ్వశాంతి మహాయాగంలో ప్రతిరోజూ 4 వేల మందికి ప్రసాద వితరణ**
- **ఏకాదశి సందర్భంగా మూడు పూటలా అల్పాహార ప్రసాదం**
- **దూర ప్రాంతాల నుంచి తరలివస్తున్న భక్తులకు నిర్వాహకుల ప్రత్యేక ఏర్పాట్లు**

**వనపర్తి, సెప్టెంబరు 07(ప్రజాక్షేత్రం):**

వనపర్తి జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న విశ్వశాంతి మహాయాగ మహోత్సవం భక్తిశ్రద్ధలతో కొనసాగుతోంది. యాగ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వనపర్తి జిల్లాతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. యాగంలో పాల్గొనే భక్తులకు ఆధ్యాత్మిక వాతావరణంతో పాటు అవసరమైన వసతులు కల్పించేందుకు నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా అన్నప్రసాద వితరణకు ప్రాధాన్యం ఇస్తున్నారు.

**మూడు పూటలా ప్రసాదం**

ఏకాదశి సందర్భంగా సోమవారం యాగానికి వచ్చిన భక్తులకు మూడు పూటలా అల్పాహార ప్రసాదాన్ని అందించారు. ఉదయం నుంచే భక్తులు యాగ ప్రాంగణానికి చేరుకోవడంతో అల్పాహార ప్రసాద వితరణ ప్రారంభించారు. భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ప్రాంతంలో వరుసల్లో కూర్చొని ప్రసాదాన్ని స్వీకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరైనప్పటికీ వితరణ కార్యక్రమాన్ని క్రమపద్ధతిలో నిర్వహించారు.

**రోజూ 4 వేల మందికి అన్నప్రసాదం**

మహాయాగం జరిగే రోజుల్లో ప్రతిరోజూ సుమారు 4 వేల మంది భక్తులకు అన్నప్రసాదం అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రోజుకు రెండు పూటలు అల్పాహారం, మధ్యాహ్నం భోజన ప్రసాదం పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. యాగానికి వచ్చే భక్తుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని ఆహారాన్ని ముందుగానే సిద్ధం చేసి, సమయానికి అందేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

**సేవలోనే సంతృప్తి**

యాగానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఎక్కువ సమయం కార్యక్రమాల్లో పాల్గొంటుండటంతో వారికి ఆహారం విషయంలో ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్నప్రసాద సేవను చేపట్టారు. భక్తులకు ఆహారం అందించడం కూడా యాగంలో భాగమైన సేవా కార్యక్రమంగా భావిస్తూ నిర్వాహకులు ఈ ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులు ప్రశాంతంగా కూర్చొని ప్రసాదాన్ని స్వీకరించేలా వసతులు కల్పించారు. భారీగా తరలివస్తున్న భక్తులు

**\సమన్వయంతో ఏర్పాట్లు**

భక్తుల రాకకు అనుగుణంగా యాగ నిర్వాహకులు తాగునీరు, అన్నప్రసాదం, కూర్చునే ప్రదేశం తదితర ఏర్పాట్లపై దృష్టి సారించారు. భారీ సంఖ్యలో భక్తులు ఒకేసారి ప్రసాదం స్వీకరించే సందర్భంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వితరణను క్రమపద్ధతిలో నిర్వహిస్తున్నారు. సేవా కార్యక్రమంలో నిర్వాహకులతో



పాటు పలువురు స్వచ్ఛందంగా పాల్గొంటూ భక్తులకు సహకరిస్తున్నారు. మహాయాగం కొనసాగుతున్న రోజుల్లోనూ ఇదే విధంగా అన్నప్రసాద సేవను కొనసాగించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. యాగానికి వచ్చే ప్రతి భక్తుడికి ప్రసాదం అందేలా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఆధ్యాత్మిక కార్యక్రమంతో పాటు వేలాది మంది భక్తులకు అన్నప్రసాదం అందించడం ద్వారా సేవాభావాన్ని చాటుతున్న నిర్వాహకులను భక్తులు అభినందిస్తున్నారు.

## పేదల సొంతింటి కల సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- **పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం**
- **జనగాంలో లబ్ధిదారుల ఇళ్లను ప్రారంభించిన డీసీసీ అధ్యక్షులు జాదవ్ ధారాసింగ్ నాయక్**
- **నూతన ఇళ్లలో గృహప్రవేశంతో లబ్ధిదారుల కుటుంబాల్లో ఆనందం**
- **అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా కృషి**

**పెద్దేముల్, సెప్టెంబర్ 07(ప్రజాక్షేత్రం):**

నిరుపేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని డీసీసీ అధ్యక్షులు జాదవ్ ధారాసింగ్ నాయక్ అన్నారు. సోమవారం పెద్దేముల్ మండల పరిధిలోని జనగాం గ్రామంలో బోయిని పకీరమ్మ-రాములు, నారబోయిని సుజాత-రవీందర్, వడ్డే శిరీష-యాదయ్య దంపతులు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ వేడుకల్లో ఆయన పాల్గొని,లబ్ధిదారుల ఇళ్లను ప్రారంభించారు.ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షులు జాదవ్ ధారాసింగ్ నాయక్ మాట్లాడుతూ.. ఇల్లు అనేది ప్రతి కుటుంబానికి ఒక కల, ఆ కలను నిజం చేయడం ప్రభుత్వ బాధ్యతగా కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తోందన్నారు.ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన పేద కుటుంబాలకు సొంతింటి సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.

నూతనంగా నిర్మించిన ఇళ్లలో లబ్దిదారుల కుటుంబాలు గృహప్రవేశం చేయడం ఆనందంగా ఉందన్నారు.సొంతింటిలోకి అడుగుపెడుతున్న లబ్ధిదారుల కుటుంబాల్లో సంతోషం చూడటం ఎంతో సంతృప్తినిస్తోందని పేర్కొన్నారు.ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని సద్వినియోగం చేసుకుని కుటుంబాలు అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి అందేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు.

ఈ కార్యక్రమంలో జనగాం గ్రామ సర్పంచ్ సంజామొల్ల అరుణ,పెద్దేముల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పి.మహిపాల్ రెడ్డి, తాండూరు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఏబ్లాక్ అధ్యక్షులు లొంక నర్సింహులు, సీనియర్ నాయకులు గోపాల్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, యూత్ ప్రెసిడెంట్ మహేష్,వార్డు సభ్యులు చెక్క నర్సింహులు, మల్లేశం,నాయకులు మధుసూదన్ రెడ్డి, శివ కుమార్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.



# పోస్ట్ మెట్రిక్ వసతి గృహాలకు సొంతభవన లు నిర్మించాలి

- **పి.డి.ఎస్.యు, ఎంఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ.**

**చేవెళ్ల సెప్టెంబర్ 07(ప్రజాక్షేత్రం):**

చేవెళ్ల పట్టణ కేంద్రంలో ఎస్సీ ప్రభుత్వ బాలుర బాలికల కళాశాల వసతి గృహాలకు సొంత స్థలం కేటాయించాలని విద్యార్థి సంఘాల (పి డి ఎస్ యు, టిజి ఎంఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ) ఆధ్వ ర్యంలో కోరుతూ సోమవారం ప్రజావాణిలో ఎంపీడీవో కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా పిడిఎస్ యు, ఎమ్మెస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఖానాపురం రాజేష్, కవేలి రాములు, ఎం.చందు. మాట్లాడుతూ ప్రభుత్వం రాజకీయ పార్టీల కార్యాలయాలకు ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులకు వెన్ను వెంటనే నిధులు విడుదల చేసి స్థలాలు చూపించి నిర్మాణాలు చేపడుతున్నారు. కానీ విద్యార్థులు చదువుకొని దేశ భవిష్యత్తు, వారి భవిష్యత్తు కోసం ఉపయోగపడేటటువంటి వసతి గృహ భవనాలను మాత్రం నిర్మించడం లేదు అని విమర్శించారు. గత 2018 సంవత్సరంలో చేవెళ్ల మండల కేంద్రంలో వసతి గృహాలు ప్రారంభించడం జరిగింది. అప్పటినుండి అద్దె భవనంలో కొనసాగుతున్నాయి. అద్దె భవనంలో సరైన సమయానికి ప్రభుత్వం నుండి డబ్బులు రాకపోవడం వలన ఇంటి యజమానులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. కనీసం విద్యార్థులకు సౌకర్యాలు కూడా లేవు అందువలన విద్యార్థులను వారి బంగారు భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని చేవెళ్ల మండల కేంద్రంలో ప్రభుత్వ వసతి గృహాలకు సొంత స్థలాన్ని కేటాయించాలని వారు డిమాండ్ చేయడం జరిగింది. ప్రభుత్వం నిమ్మకు నీరు ఎత్తినట్టు, వ్యవహరిస్తే మంత్రులను, ఎమ్మెల్యేలు ,, అడ్డుకుంటామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పిడిఎస్ యు నాయకులు, పాల్గొన్నారు.




# హరీశ్ రావు, కేటీఆర్ల అరెస్ట్ సిగ్గుచేటు

**వర్గల్ సెప్టెంబర్ 07 (ప్రజాస్వరం):-**

అసెంబ్లీ మెయిన్ గేట్ వద్ద మాజీ మంత్రులు హరీశ రావు, కేటీఆర్‌ను పోలీసులు అరెస్ట్ చేయడంపై వర్గల్ మండల బీఆర్ఎస్ నాయకులు కడపల బాల్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.హరీశ్ రావు అరెస్టుకు నిరసనగా ఉమ్మడి మెదక్ జిల్లా బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. అసెంబ్లీలో ప్రజా సమస్యలపై ప్రతిపక్ష నేతలు ప్రశ్నిస్తే సమాధానం చెప్పే పరిస్థితి లేకనే అరెస్టులకు పాల్పడుతున్నారని కడపల బాల్ రెడ్డి ఆరోపించారు.ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాల గొంతును అణచివేయడం సరికాదని, అరెస్టుల ద్వారా సమస్యలకు పరిష్కారం లభించదని ఆయన అన్నారు.హరీశ రావు, కేటీఆర్‌ల అరెస్టులను బీఆర్ఎస్ శ్రేణులు తీవ్రంగా ఖండిస్తున్నాయని తెలిపారు.

**వర్గల్ మండల బిఆరెస్ నాయకులకు మాజీ వైస్ ఎంపీపీ కడపల బాల్రెడ్డి పిలుపు..**

కాంగ్రెస్ నాయకులు కెసిఆర్ ఫామ్హౌస్ ముట్టడి స్తానడనం తెలివిలేని దద్దమ్మల పని అని వారు తెలిపారు. కెసిఆర్ కు మద్దతుగా ఫామ్హౌస్ వద్దకు బిఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలి వెళ్తామని కడపల బాల్ రెడ్డి పిలుపునిచ్చారు



## రోబోటిక్ టెక్నాలజీతో క్యాన్సర్ చికిత్సల్లోవిప్లవాత్మక మార్పులు.

- **ట్యూమర్ బయాలజీ పై మెరుగైన అవగాహన**

**శంషాబాద్ సెప్టెంబర్ 07(ప్రజాక్షేత్రం):**

క్యాన్సర్ చికిత్స రంగంలో గణనీయమైన మార్పులు చోటు చేసుకున్నాయని డాక్టర్ రాజేష్ తెలిపారు. శంషాబాద్ లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోబోటిక్ టెక్నాలజీతో క్యాన్సర్ చికిత్సలో విప్లవాత్మక మార్పులు ట్యూమర్ బయాలజీపై మెరుగైన అవగాహన పెరగడంతో క్యాన్సర్ శస్త్రచికిత్సల లక్ష్యం కేవలం వ్యాధిని తొలగించడం మాత్రమే కాకుండా రోగికి మెరుగైన జీవన నాణ్యతను అందిస్తూ పూర్తి చికిత్స ఫలితాలను సాధించినట్లు తెలిపారు. ఈ మార్పులో అత్యంత ముఖ్యమైన సాంకేతిక ఆవిష్కరణలలో రోబోటిక్ సర్జరీ ఫ్లోరోసెన్స్ గైడెడ్ సర్జరీ ప్రధానమైనవి. హైడెఫినిషన్




3 విజన్, ట్రెమర్‌ఫ్రీ ఇన్‌స్ట్రుమెంట్స్, మనిషి చేతి కదలికలను అనుకరించే అధునాతన క్లిష్టమైన శస్త్రచికిత్సలను అత్యంత నైపుణ్యంతో నిర్వహించడం సాధ్యమవుతోంది. కోతలు అవసరం లేకుండా కేవలం చిన్న పోర్ట్స్ ద్వారా శస్త్రచికిత్స నిర్వహించవచ్చు. దీని వలన రోగులకు తక్కువ నొప్పి, చిన్న మచ్చలు మరియు తక్కువ రక్తనష్టం వంటి ప్రయోజనాలు లభిస్తాయి. అదనంగా స్మార్ట్ టెక్నాలజీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కలయికతో శస్త్రచికిత్సలు మరింత ఖచ్చితమైనవి, సమర్థవంతమైనవి సురక్షితమైనవిగా మారుతున్నాయ తెలిపారు.

## జాతీయ రహదారి, ఫ్లైఓవర్ పనులు త్వరగా పూర్తి చేయాలి

- **ఆర్డీవోకు బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ కొయ్యడ శేఖర్ గౌడ్ వినతి**

**చౌటుప్పల్, సెప్టెంబర్ 07(ప్రజాక్షేత్రం):**

చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని 65వ జాతీయ రహదారి విస్తరణ, ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతూ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ కొయ్యడ శేఖర్ గౌడ్ సోమవారం ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శేఖర్ గౌడ్ మాట్లాడుతూ ఫ్లైఓవర్ నిర్మాణ పనులు నెమ్మదిగా కొనసాగుతుండటంతో ప్రధాన రహదారిపై రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందన్నారు. వాహనాలను ఇరువైపులా ఉన్న సర్వీస్ రోడ్లపైకి మళ్లించడంతో అక్కడ నిత్యం ట్రాఫిక్ రద్దీ పెరిగి తరచూ ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా సెలవు రోజుల్లో ప్రయాణికులు గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుని తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అత్యవసర సేవల వాహనాలు సైతం రాకపోకలు సాగించలేని పరిస్థితి నెలకొందన్నారు. అదేవిధంగా స్థానిక ప్రజలు రహదారి దాటేందుకు కూడా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రజలు, వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని నిర్మాణ పనులను వేగవంతం చేయడంతో పాటు, పనులు కొనసాగుతున్న ప్రాంతాల్లో తాత్కాలిక ప్రత్యామ్నాయ రహదారులను ఏర్పాటు చేయాలని కోరారు. ట్రాఫిక్ నియంత్రణకు తగిన చర్యలు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆర్డీవోను విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో 4వ వార్డు ఊదరి యాదయ్య, 15వ వార్డు కౌన్సిలర్ గడ్డం ఇందిర, మల్కాపురం సర్పంచ్ గిర్కటి నిరంజన్ గౌడ్ తదితర బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.




## ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలి

- **ప్రజావాణి కేంద్రంలో వినతిపత్రం అందజేసిన మాజీ జెడ్పీటీసీ, బీఆర్ఎస్ నాయకులు**

**బూర్గంపాడు సెప్టెంబర్ 07(ప్రజాక్షేత్రం)**

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బూర్గంపాడు మండల కేంద్రంలోని ప్రజావాణి కేంద్రంలో వినతిపత్రం అందజేశారు.తెలంగాణ రాష్ట్ర బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు, భద్రాద్రి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రేగా కాంతారావు సూచనలతో కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనపై చేపట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగా ఏడో రోజు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన 420 హామీలను, ముఖ్యంగా ఆరు గ్యారంటీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం, వృద్ధులు, బీడీ కార్మికులకు నెలకు రూ.4,000 పెన్షన్, దివ్యాంగులకు నెలకు రూ.6,000 పెన్షన్, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద ఆడబిడ్డల వివాహాలకు తులం బంగారం అందించే హామీని అమలు చేయాలని కోరారు.అలాగే విద్యార్థినీ, విద్యార్థులకు స్కూటీలు అందించే హామీ, కళాశాల విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద సుమారు రూ.12 వేల కోట్ల బకాయిలు ఉన్నాయని, వాటిని ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని కోరారు.ప్రజలకు ఇచ్చిన హామీలను ఇకనైనా కాలయాపన చేయకుండా అమలు చేసి, ప్రభుత్వం తన బాధ్యతను నిర్వర్తించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రజావాణి కేంద్రంలో అధికారులకు వినతి పత్రం అందజేశారు.

ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు, టౌన్ నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, మండల మహిళా నాయకులు, ఉద్యమ నాయకులు, రైతులు, యువజన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.







# భక్తి పరవశంతో పులకించిన శ్రీ అంబురామేశ్వర స్వామి సన్నిధి

- అంగరంగ వైభవంగా శ్రీ అంబురామేశ్వర స్వామి జాతర ఉత్సవాలు
- భక్తజన సందోహంతో కళకళలాడిన శ్రీ అంబురామేశ్వర దేవాలయం
- మొక్కులు చెల్లించుకున్న భక్తులు.. ఘనంగా ప్రత్యేక అభిషేకాలు
- అడవిలో ఆధ్యాత్మిక సందడి.. శివనామస్మరణతో పులకించిన భక్తులు
- భక్తుల సేవలో తట్టేపల్లి గ్రామస్తుల సమష్టి కృషి
- ప్రకృతి ఒడిలో పరమేశ్వరుడి దర్శనం.. భక్తులకు అపూర్వ అనుభూతి
- కుటుంబ సమేతంగా తరలివచ్చిన భక్తజనం
- దూర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు

**పెద్దేముల్, సెప్టెంబర్ 7 (ప్రజా క్షేత్రం)**

దట్టమైన అడవుల మధ్య.. ప్రకృతి ఒడిలో.. ఆధ్యాత్మికతకు చిరునామాగా కొలువుదీరిన శ్రీ అంబురామేశ్వర స్వామివారి సన్నిధి భక్తుల శివనామ స్మరణతో మార్మోగింది. శ్రావణ మాసం చివరి సోమవారం సందర్భంగా వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గం పెద్దేముల్ మండల పరిధిలోని తట్టేపల్లి పరివాహక ప్రాంతంలో వెలసిన శ్రీ అంబురామేశ్వర స్వామి జాతర ఉత్సవాలు సోమవారం అంగరంగ వైభవంగా జరిగాయి.శ్రావణ మాసం చివరి సోమవారం కావడంతో తెల్లవారుజాము నుంచే ఆలయానికి భక్తుల రాక మొదలైంది. చుట్టుపక్కల గ్రామాల నుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. "ఓం నమః శివాయ" నామ స్మరణతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి.

**అభిషేకాలతో పులకించిన భక్తజనం**

స్వామివారిని దర్శించుకున్న భక్తులు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి,పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.తమ కుటుంబాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలని,పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని, పిల్లల భవిష్యత్తు బాగుండాలని కోరుకుంటూ భక్తులు స్వామివారికి తమ మొక్కులను సమర్పించారు.దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు సైతం అడవిబాటలో ప్రయాణించి స్వామివారి సన్నిధికి చేరుకోవడం ఈ జాతర ప్రత్యేకతగా నిలిచింది. ప్రకృతి నడుమ పరమేశ్వరుడిని దర్శించుకోవడం తమకు ఎంతో ప్రశాంతతను,ఆత్మీయతను కలిగిస్తుందని పలువురు భక్తులు పేర్కొన్నారు.

**అడవిలో ఆధ్యాత్మిక సందడి.. గ్రామీణ సంస్కృతికి ప్రతిబింబం**

సాధారణంగా ప్రశాంతంగా ఉండే దట్టమైన అటవీ ప్రాంతం జాతర సందర్భంగా భక్తజన సందోహంతో కళకళలాడింది.కుటుంబ సమేతంగా వచ్చిన భక్తులు పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించి ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందారు.ఈ జాతర కేవలం ఓ మత పరమైన కార్యక్రమంగానే కాకుండా గ్రామీణ ప్రజల విశ్వాసాలు,సాంప్రదాయాలు, ఆత్మీయ బంధాలను ప్రతిబింబించే ఆధ్యాత్మిక వేడుకగా కొనసాగుతోంది.తరతరాలుగా స్వామివారిపై ఉన్న విశ్వాసాన్ని నేటి తరం కూడా కొనసాగిస్తూ జాతరలో పాల్గొనడం విశేషం.

**భక్తుల సౌకర్యమే లక్ష్యంగా ఏర్పాట్లు**

జాతర ఉత్సవాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చిన నేపథ్యంలో ఆలయ కమిటీ పెద్దలు, సభ్యులు, తట్టేపల్లి గ్రామస్తులు ముందస్తుగా పటిష్టమైన ఏర్పాట్లు చేశారు.భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన మౌలిక సదుపాయాలను అందుబాటులో ఉంచారు. జాతర నిర్వహణలో గ్రామస్తుల సహకారం ప్రత్యేకంగా కనిపించింది.స్వామివారి సేవే తమకు భాగ్యమనే భావనతో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు భక్తులకు అవసరమైన సహాయ సహకారాలను అందిస్తూ ఉత్సవాలను విజయవంతం చేశారు.



**భక్తి.. సేవ.. సమష్టి స్ఫూర్తి**

అంబురామేశ్వర స్వామి జాతరలో మరో విశేషం భక్తి భావంతో పాటు కనిపించిన సేవా స్ఫూర్తి. తమ గ్రామానికి, తమ ప్రాంతానికి చెందిన ఆధ్యాత్మిక సాంప్రదాయాన్ని కాపాడుకోవాలనే సంకల్పంతో గ్రామస్తులు ఒక్కతాటి పై నిలిచారు.భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడటం నుంచి జాతర ఏర్పాట్ల వరకు ప్రతి అంశంలోనూ సమష్టి కృషి కనిపించింది.దేవుడి దర్శనం కోసం వచ్చిన భక్తులకు సేవ చేయడమే స్వామివారికి చేసే సేవగా భావించిన గ్రామస్తుల మానవీయ దృక్పథం జాతర ఉత్సవాలకు మరింత ప్రత్యేకతను తీసుకొచ్చింది.

**భక్తులకు ఆప్యాయతతో ప్రత్యేక అన్నదానం**

జాతర సందర్భంగా ఆలయ కమిటీ, గ్రామస్తుల ఆధ్వర్యంలో భక్తుల కోసం ప్రత్యేక అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు.స్వామివారి దర్శనం కోసం దూర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులకు ఆహారం అందించి ఆతిథ్యం ఇచ్చారు. అన్నదాన కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భోజనం స్వీకరించారు.భక్తులకు స్వయంగా వడ్డిస్తూ గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు సేవా స్ఫూర్తిని చాటుకున్నారు. అన్నదానం మహాదానం అన్న భావనతో భక్తులకు ఆహారం అందించడం జాతరలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఎలాంటి భేదాభిప్రాయాలు లేకుండా భక్తులందరికీ ఆప్యాయంగా అన్నదానం చేయడం ద్వారా తట్టేపల్లి గ్రామస్తులు తమ మానవీయతను చాటుకున్నారు. స్వామివారి దర్శనంతో పాటు భక్తులకు అన్నప్రసాదం అందించడం ద్వారా ఆధ్యాత్మికతతో కూడిన సేవా భావాన్ని చాటుకున్నారు.

**పోలీసుల పటిష్ట బందోబస్తు**

దట్టమైన అటవీ ప్రాంతంలో ఆలయం ఉండటంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పెద్దేముల్ ఎస్ఐ ఎం.ప్రశాంత్ వర్ధన్ ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, భక్తులకు భద్రత కల్పించారు.

**భక్తి వెలుగులు పంచే పవిత్ర సన్నిధి**

అడవిలో వెలసిన అంబురామేశ్వరుడి సన్నిధికి చేరుకున్న ప్రతి భక్తుడి హృదయంలో ఒకే భావన.. నమ్మకంతో పిలిస్తే పలికే దేవుడు, మొక్కితే కరుణించే మహాదేవుడు అన్న విశ్వాసం.శ్రావణ మాసం చివరి సోమవారం అంబురామేశ్వరుడి దర్శనం చేసుకుని, అభిషేకాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్న భక్తులు ఆధ్యాత్మిక పరవశంలో మునిగిపోయారు. ప్రకృతి ఒడిలో పరమేశ్వరుడి సన్నిధి.. భక్తుల శివనామస్మరణ.. పూజల పరిమళం.. గ్రామీణ ఆత్మీయత.. ఇవన్నీ కలసి తట్టేపల్లి అటవీ ప్రాంతాన్ని ఒకరోజంతా శివమయం చేశాయి.అంబురామేశ్వరుడి కృపతో తమ కుటుంబాలు సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ భక్తులు కన్నీటి మొక్కులతో కొలిచిన ఈ జాతర.. విశ్వాసానికి, భక్తికి, మానవీయ బంధాలకు ప్రతీకగా నిలిచింది.ఈ జాతర మహోత్సవంలో దూరప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు,భక్తులు,ఆయా గ్రామాల ప్రజలు,మహిళలు,యువకులు,చిన్నారులు, ఆలయ కమిటీ పెద్దలు, సభ్యులు, తట్టేపల్లి గ్రామస్తులు, వివిధ గ్రామాల నుండి పెద్ద ఎత్తున వచ్చిన భక్త జనం, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ మండపాల నిర్వాహకులతో శంకర్‌పల్లి పోలీసుల సమావేశం

**శంకర్‌పల్లి, సెప్టెంబర్ 07(ప్రజాక్షేత్రం):**

సెప్టెంబర్ 14న జరగనున్న గణేష్ చతుర్థి వేడుకల నేపథ్యంలో శంకర్‌పల్లి ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ జి. రుద్వీర్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం మణి గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో గణేష్ విగ్రహాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆన్‌లైన్‌లో అవసరమైన అనుమతులు పొందాలని, మండపాల వద్ద క్రమశిక్షణ పాటిస్తూ ఫైర్, విద్యుత్ భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రజలకు, ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలగకుండా చూడాలని, శబ్ద నియంత్రణ నిబంధనలు పాటించాలని, మత సామరస్యాన్ని కాపాడాలని తెలిపారు. నిమజ్జన ఊరేగింపులను నిర్దేశిత మార్గాల్లోనే భద్రతా చర్యలతో నిర్వహించాలని సూచించారు.




అనుమానాస్పద ఘటనలు లేదా అవాంఛనీయ సంఘటనలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని నిర్వాహకులకు సూచించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ యోగేష్, విద్యుత్ శాఖతో పాటు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# బిజెపి అధ్యక్షురాలు లీలావతి బయానంద్ ముందస్తు అరెస్ట్

**శంకర్‌పల్లి సెప్టెంబర్ 07(ప్రజాక్షేత్రం):**

విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం బీజేపీ చేపట్టిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం నేపథ్యంలో శంకర్‌పల్లి మండల బీజేపీ అధ్యక్షురాలు లీలావతి బయానంద్ ని పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. సెప్టెంబర్ 7న అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి బీజేపీ పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు ముందస్తు చర్యల్లో భాగంగా ఆమెను అదుపులోకి తీసుకున్నారు. ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలతో పాటు విద్యార్థులకు సంబంధించిన సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని బీజేపీ డిమాండ్ చేస్తోంది. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పెండింగ్‌లో ఉన్న నిధులను విడుదల చేయాలని, విద్యా రంగ సమస్యలపై ప్రభుత్వం స్పష్టమైన చర్యలు తీసుకోవాలని పార్టీ నాయకులు కోరుతున్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపేందుకు సిద్ధమైన లీలావతి బయానంద్ను ముందస్తుగా అరెస్టు చేయడాన్ని బీజేపీ శ్రేణులు తీవ్రంగా ఖండించాయి. సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం నిరసనలను అడ్డుకోవడం సరికాదని పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం తమ పోరాటం కొనసాగుతుందని బీజేపీ నాయకులు స్పష్టం చేశారు.





# రైతు సేవే లక్ష్యం.. మార్కెట్‌యార్డులో కొత్త వసతులు!

- **రైతు విశ్రాంతి భవనానికి తీర్మానం.. అన్యాక్రాంతానికి అడ్డుకట్టగా ప్రహరీ.. రైతుల కోసం బెంచీలు**
- **త్వరలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ చేతుల మీదుగా అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

**వికారాబాద్ బ్యూరో సెప్టెంబర్ 07(ప్రజాక్షేత్రం):**

రైతులకు మరింత మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా వికారాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం కీలక నిర్ణయాలు తీసుకుంది. తెలంగాణ శాసనసభ స్పీకర్, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్ అనుమతితో ఏఎంసీ చైర్మన్ చాపల శ్రీనివాస్ ముదిరాజ్ అధ్యక్షతన మార్కెట్ కమిటీ పాలకవర్గం 3వ సమావేశం నిర్వహించారు. వైస్ చైర్మన్ మల్లేశం, డైరెక్టర్లు వివిధ అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.

**రైతులకు విశ్రాంతి భవనం**

ధాన్యాన్ని మార్కెట్‌లో విక్రయించిన అనంతరం తూకాలు, ఇతర ప్రక్రియల్లో ఆలస్యం కావడం లేదా సొంత గ్రామాలకు వెళ్లేందుకు సమయం పట్టే సందర్భాల్లో రైతులు ఇబ్బందులు పడకుండా రైతు విశ్రాంతి భవనం నిర్మించాలని సమావేశంలో తీర్మానించారు. రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాలను దశలవారీగా కల్పిస్తామని చైర్మన్ శ్రీనివాస్ ముదిరాజ్ తెలిపారు.

మార్కెట్ కమిటీకి చెందిన స్థలాలు అన్యాక్రాంతం కాకుండా ప్రహరీ గోడల నిర్మాణం, రైతులు విశ్రాంతి తీసుకునేందుకు మార్కెట్ యార్డులో బెంచీల ఏర్పాటు చేయాలని కూడా పాలకవర్గం నిర్ణయించింది. త్వరలోనే స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ చేతుల మీదుగా వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహిస్తామని చైర్మన్ వెల్లడించారు.

**రైతులతో కలిసి సహపంక్తి భోజనం**

సమావేశం అనంతరం మార్కెట్ యార్డులో రైతులతో కలిసి పాలకవర్గ సభ్యులు ఉచిత భోజన కార్యక్రమంలో పాల్గొన్నారు. రైతులతో సహపంక్తి భోజనం చేసిన చైర్మన్, డైరెక్టర్లు వారి సమస్యలను తెలుసుకున్నారు. రైతులకు ఉచిత భోజనం ఏర్పాటు చేయడంపై రైతులు ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస్ ముదిరాజ్‌తో పాటు పాలకవర్గ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ సెక్రటరీ వెంకటేశ్వరరెడ్డి, డైరెక్టర్లు విజేందర్‌రెడ్డి, ప్రభాకర్, పాండురంగారెడ్డి, రంగారెడ్డి, రమేష్‌నాయక్, రాజునాయక్, పాపిరెడ్డి, మిర్యానం సురేష్, నాగిరెడ్డి, భీమయ్య, వట్టం నర్సిములు తదితరులు పాల్గొన్నారు





# ఎమ్మెల్యే పై అబాండాలు మోపితే ఊరుకోం

- **బిఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో అభివృద్ధిని పట్టించుకోలేదు.**
- **స్థానిక ఎమ్మెల్యే మచ్చలేని మనిషి, అభివృద్ధి ప్రదాత**
- **అభివృద్ధి చేస్తూ ఉంటే ఓర్వలేక కాంగ్రెస్ ప్రభుత్వం పై దుష్ప్రచారం.**
- **కోకట్ బ్రిడ్జి సాంక్షన్ కావడమే కాకుండా టెండర్ ప్రక్రియ కూడా పూర్తయింది.**
- **కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కుర్వ మహిపాల్ యాదవ్.**
- **పిఎసిఎస్ చైర్మన్ జీ. సురేందర్ రెడ్డి,**

**యాలాల సెప్టెంబర్ 07(ప్రజాక్షేత్రం):**

తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకోమని యాలాల మండల పార్టీ ప్రెసిడెంట్ మహిపాల్, పిఎసిఎస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, మాజీ మండల పార్టీ ప్రెసిడెంట్ భీమప్పలు హెచ్చరించారు. సర్పంచ్ శివయ్య, జిల్లా మత్స్యకార సంఘం అధ్యక్షుడు శ్రీధర్, బి బ్లాక్ అధ్యక్షులు అనిల్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ ప్రెసిడెంట్ నర్సిరెడ్డి, మండల బీసీ సెల్ అధ్యక్షులు అమృతప్ప, యూత్ అధ్యక్షుడు వీరేష్, ఏఎంసి డైరెక్టర్ సత్యనారాయణ రెడ్డి, సీనియర్ నాయకులు మధుసూదన్ రెడ్డి తదితర ముఖ్య నాయకులతో కలిసి సోమవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... ప్రశాంతంగా ఉన్న యాలాల మండలంలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తూ అల్లరి సృష్టించే ప్రయత్నం బిఆర్ఎస్ నాయకులు సృష్టిస్తున్నారన్నారు. విధానపరమైన చర్చలకు తాము ఎల్లప్పుడూ సిద్ధమని అంతేగాని వ్యక్తిగత దూషణలు చేస్తే తస్మాస్ జాగ్రత్త సహించబోమని హెచ్చరించారు. ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి డిసిసిబి చైర్మన్ గా ఉన్నప్పుడు అవినీతి చేశారని కొంతమంది బిఆర్ఎస్ నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాన్ని ఖండిస్తున్నామన్నారు. స్థానిక ఎమ్మెల్యే మచ్చలేని మనిషని, అభివృద్ధి ప్రదాత అని ఈ సందర్భంగా తెలుపుతున్నామన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. రోడ్ల దుస్థితి చూస్తే గతంలో వారు ఎంత అభివృద్ధి చేశారో తెలుస్తుందన్నారు. వారు చేయలేదు కాబట్టే మేము అభివృద్ధి చేస్తూ ఉంటే ఓర్వలేక కాంగ్రెస్ ప్రభుత్వం పై, ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి పై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. గతంలో రోడ్లు వేసామని ప్రగల్భాలు పలికే బీఆర్ఎస్ నాయకులకు ఇప్పుడు వేస్తున్న రోడ్లు కనపడడం లేదా అని ప్రశ్నిస్తున్నామన్నారు. వారు వేసిన రోడ్లపై మేము మళ్లీ రోడ్లు వేసి అభివృద్ధి అని చెప్పుకుంటున్నామా అని ప్రశ్నిస్తున్నామన్నారు. వారు రోడ్లను అభివృద్ధి చేయలేదు కాబట్టే తాము రోడ్డును అభివృద్ధి చేస్తున్నామన్నారు. కోకట్ బ్రిడ్జి సాంక్షన్ కావడమే కాకుండా టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయిందన్నారు. జుంటుపల్లి దేవాలయ దర్శనానికి వెళ్తున్న బీఆర్ఎస్ నాయకులకు తాము వేసిన రోడ్డు కనిపించడం లేదా అని ప్రశ్నిస్తున్నామన్నారు. లక్ష్మీనారాయణపూర్ నుండి మైల్వార్ వరకు రోడ్డు నిర్మాణ పనులు సాగుతున్నాయన్నారు. కోటిపల్లి ప్రాజెక్టు పనులు శరవేగంగా నడుస్తున్నాయన్నారు. రూ.200 కోట్లతో నిర్మించుకోబోతున్న ఇంటిగ్రేటెడ్ పాఠశాల అతి త్వరలో పూర్తి చేసుకుంటామన్నారు. అనవసర రాద్ధాంతాలు చేస్తూ అసత్య ప్రచారాలు చేస్తూ పబ్బం గడుపుకునే బదులు అభివృద్ధిలో తమతో కలిసి సాగాలని ఈ సందర్భంగా వారికి సూచిస్తున్నామన్నారు.



# 420 హామీలు..13 డిక్లరేషన్లు..6 గ్యారంటీలతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్

- **1000 రోజుల పాలన కాదు.. ప్రజలను పీడిస్తున్న కాంగ్రెస్ '1000 కాళ్ళ మహా రాక్షసి' పాలన**
- **ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేలా అధికారులు చొరవ చూపాలి**
- **తాండూరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంఛార్జి ... పంజుగుల శ్రీశైల్ రెడ్డి**

**పెద్దేముల్, సెప్టెంబర్ 07(ప్రజాక్షేత్రం):**

ఎన్నికల సమయంలో 420 హామీలు, 13 డిక్లరేషన్లు, 6 గ్యారంటీల పేరుతో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో పూర్తిగా విఫలమైందని తాండూరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంఛార్జి పంజుగుల శ్రీశైల్ రెడ్డి ఆరోపించారు. అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు గడుస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని విమర్శించారు.సోమవారం బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు పెద్దేముల్ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పెద్దేముల్ మండల బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోహీర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు తహసీల్దార్, ఎంపీడీవోలకు వినతిపత్రం అందజేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసేలా సంబంధిత అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రజలకు కాంగ్రెస్ పార్టీని ఇచ్చిన హామీలు నెరవేరేలా చూడాలని ఈ సందర్భంగా కోరారు.

**1000 రోజుల పాలన కాదు..**
**1000 కాళ్ళ మహా రాక్షసి పాలన**

కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలన అంటూ సంబరాలు చేసుకోవడం హాస్యాస్పదంగా ఉందని శ్రీశైల్ రెడ్డి అన్నారు. "ఇది 1000 రోజుల సుపరిపాలన కాదు.. ప్రజలను పీడిస్తున్న 1000 కాళ్ల మహా రాక్షసి పాలన" అని ఆయన ఘాటుగా విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ఉత్సవాలు చేసుకోవడం సిగ్గుచేటన్నారు.

గత వారం రోజులుగా తెలంగాణ వ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గ్రామాలు, మండలాలు, పట్టణాలు, వార్డుల్లో ఇంటింటికీ తిరుగుతూ 'కాంగ్రెస్ బాకీ కార్డులు' పంపిణీ చేశామని తెలిపారు.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలు, రైతులు, కూలీలు, విద్యార్థులు తదితర వర్గాలకు ఎంత మేర నష్టం జరిగిందో, ప్రభుత్వం ఎంత బాకీ పడిందో ప్రజలకు వివరిస్తున్నామని చెప్పారు. రైతుబంధు, రైతుబీమా వంటి పథకాల ద్వారా ప్రజలకు రావాల్సిన ప్రయోజనాలపై కూడా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో మోసపోయిన ప్రజలు రాబోయే రోజుల్లో ప్రశ్నించాలని, ప్రజా ఉద్యమానికి సిద్ధం కావాలని శ్రీశైల్ రెడ్డి పిలుపునిచ్చారు.

**మహిళా ఎమ్మెల్యేల అవమానంపై ఖండన**

తెలంగాణ అసెంబ్లీలో జరిగిన పరిణామాలపై శ్రీశైల్ రెడ్డి తీవ్రంగా స్పందించారు.ప్రజా సమస్యలపై ప్రశ్నించేందుకు వెళ్లిన బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు, మహిళా ఎమ్మెల్యేలు ,మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిల పట్ల అనుచితంగా వ్యవహరించడం దారుణమన్నారు.కౌరవ సభలో ద్రౌపదికి జరిగిన అవమానం లాంటి అవమానం సోమవారం బీఆర్ఎస్ పార్టీ మహిళా ఎమ్మెల్యేలకు మంత్రులకు జరిగిందని, అసెంబ్లీ సాక్షిగా మహిళా ప్రజాప్రతినిధులను అవమానించడం ప్రజాస్వామ్యానికి మచ్చ అని మహిళలను అవమానించిన తీరును బీఆర్ఎస్ పార్టీ ముక్త కంఠంతో ఖండిస్తోంది'' అని ఆయన అన్నారు .ఈ ఘటనను తెలంగాణ ప్రజలు, ముఖ్యంగా మహిళలు గమనించాలని కోరారు.

**ప్రజలకు అండగా బీఆర్ఎస్**

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పెద్దేముల్ మండల బీఆర్ఎస్ నాయకుల సంతకాలతో అధికారులకు వినతిపత్రం అందజేశామని శ్రీశైల్ రెడ్డి తెలిపారు. అధికారులు ఈ అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు చొరవ చూపాలని కోరారు.రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కొందరు మంత్రులు ప్రజా సంక్షేమాన్ని పక్కనపెట్టి దోపిడీ, దాచుకునే రాజకీయాలకే పరిమితమయ్యారని శ్రీశైల్ రెడ్డి ఆరోపించారు. అధికారంలో ఉన్న పార్టీనే ధర్నాలకు దిగడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు.

**'సారు రావాలి.. కారు రావాలి'**
**అంటున్న ప్రజలు**

తెలంగాణలో ప్రజలు మరోసారి కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని శ్రీశైల్ రెడ్డి అన్నారు. "రాష్ట్ర ప్రజలు కేసీఆర్ రావాలి....సారు రావాలి.. కారు రావాలి అని కోరుకొంటున్నారని, కాంగ్రెస్ నాయకులు కూడా సారు రావాలి అని కోరుకొంటున్నారని ఎద్దేవా చేశారు.త్వరలోనే కేసీఆర్ సార్ ప్రజల ముందుకు వస్తారు'' అని పేర్కొన్నారు. కాళేశ్వరం అంశంపై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పోరాటానికి సిద్ధమవుతున్నారని తెలిపారు. రాబోయే రోజుల్లో పెద్దేముల్ మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రజా సమస్యలపై ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని వెల్లడించారు. కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీలను ప్రజలు ప్రశ్నించే సమయం వచ్చిందన్నారు.

**'బాకీ కార్డు' చూపించి నిలదీయాలి**

రాబోయే రోజుల్లో ఎలాంటి ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ నాయకులు ఓట్ల కోసం ప్రజల ఇళ్ల వద్దకు వస్తే వారికి బీఆర్ఎస్ అందిస్తున్న 'కాంగ్రెస్ బాకీ కార్డు' చూపించి, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలు ఏమైందని నిలదీయాలని శ్రీశైల్ రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెప్పాలని, కాంగ్రెస్ పాలనలో నష్టపోయిన ప్రతి వర్గానికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. పెద్దేముల్ మండలంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాబోయే రోజుల్లో మరింత ఉధృతంగా ఉద్యమాలు చేపడతామని శ్రీశైల్ రెడ్డి హెచ్చరించారు.

**కాంగ్రెస్ నాయకులకు**
**ప్రజా సంక్షేమంపై ధ్యాస లేదు**

పెద్దేముల్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కోహీర్ శ్రీనివాస్ మాట్లాడుతూ...ఎన్నికల సమయంలో 420 హామీలు, 13 డిక్లరేషన్లు,6 గ్యారెంటీల పేరుతో ప్రజలకు అనేక వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు.ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా నిరుపేద ప్రజలపై భారం మోపుతూ వారి కడుపు కొడుతోందని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి ఆధ్వర్యంలోనే గతంలో తాండూరు నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని, భవిష్యత్తులో కూడా బీఆర్ఎస్ హయాంలో నియోజకవర్గ అభివృద్ధి కొనసాగుతుందని అన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం, ఆ పార్టీ నాయకులను ప్రజలు ఎక్కడికెళ్లినా నిలదీస్తూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలపై ప్రశ్నిస్తున్నారని తెలిపారు.ప్రజా సమస్యలపై దృష్టి సారించాల్సిన కాంగ్రెస్ నాయకులు వాటిని పక్కనపెట్టి అవాకులు చవాకులు పేలుతున్నారని విమర్శించారు. రెండేళ్ల పాలనలో ప్రజా సంక్షేమంపై దృష్టి పెట్టకుండా దోచుకుందాం.. దాచుకుందాం అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకులు వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకుని ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు. తెలంగాణలో ప్రజలకు నీళ్లు, కరెంటు, రైతుబంధు, రైతుబీమా వంటి సంక్షేమ పథకాల ప్రయోజనాలు సక్రమంగా అందడం లేదని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ ప్రభుత్వం అమలు చేస్తే, ప్రజా సంక్షేమం కోసం చేపట్టే కార్యక్రమాలకు తాము కూడా సహకరిస్తామని కోహీర్ శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దేముల్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కోహీర్ శ్రీనివాస్,మండల ప్రధాన కార్యదర్శి సి.రంగయ్య, పెద్దేముల్ గ్రామ సర్పంచ్ డివై.నర్సింహులు, పెద్దేముల్ మండల ఉపసర్పంచుల సంఘం అధ్యక్షులు డివై.ప్రసాద్,ఆయా గ్రామాల సర్పంచులు జ్ఞానేశ్వర్,లక్ష్మణ్, మాజీ సర్పంచులు తలారి వీరప్ప, కొండాపూర్ చంద్రయ్య, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బీ.జనార్ధన్ రెడ్డి, టి.రమేష్, మంబాపురం యాదయ్య, బోయిని నర్సింహులు,మట్ట శ్రీనివాస్, కుమ్మరి విఠల్, ఏం.ఆంజనేయులు, మామిళ్ళ వెంకట్, ఎండీ. సత్తార్ ఖాన్, అల్లాపురం శ్రీనివాస్ గౌడ్, నర్సింహులు గౌడ్, శ్రీనివాస్ గౌడ్, దుగ్గాపూర్ శ్రీనివాస్, ఎం.గోపాల్, రత్నప్ప, బ్యాగరి వెంకటయ్య, పడగాళ్ళ రాంచెంద్రి, మల్లేష్, ముకుంద్ రెడ్డి, లక్ష్మణ్, మల్లేశం, నర్సింహులు, కిష్టప్ప,యువ నాయకులు రవికుమార్ రెడ్డి, కిషన్, పగిడ్యాల మాధవ రెడ్డి, ,నగేష్, రాహుల్‌తో పాటు బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



## అరెస్టులతో అణచలేరు విద్యార్థుల కోసం పోరాటం ఆపలేరు, గంగా ప్రసాద్

**నిర్మల్ జిల్లా సెప్టెంబర్ 07(ప్రజాక్షేత్రం):**



భైంసా విద్యార్థులకు ప్రభుత్వం నుంచి అందాల్సిన స్కాలర్‌షిప్‌లు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని భైంసా బీజేపీ బీజేవైఎం ఉపాధ్యక్షుడు సిందే గంగా ప్రసాద్ డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం బీజేవైఎం ఆధ్వర్యంలో చేపట్టిన చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంలో పాల్గొనకుండా పోలీసులు ముందస్తుగా హౌస్ అరెస్ట్ చేయడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గంగా ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థుల చదువుకు ప్రభుత్వం అందించాల్సిన ఆర్థిక సహాయం సకాలంలో అందకపోవడంతో అనేక మంది విద్యార్థులు వారి కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. స్కాలర్‌షిప్ ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలలో జాప్యం చేయడం వల్ల ఉన్నత విద్యను కొనసాగించేందుకు విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన ఈ కీలక అంశంపై ప్రభుత్వం వెంటనే దృష్టి సారించాలని కోరారు. ఎన్నికల సమయంలో విద్యార్థులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని గంగా ప్రసాద్ విమర్శించారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన కార్యక్రమాలు చేపడుతుంటే ముందస్తు అరెస్టులు హౌస్ అరెస్టులతో అడ్డుకోవడం సరికాదన్నారు. సమస్యలపై మాట్లాడుతున్న నాయకులు, కార్యకర్తలను నిర్బంధించడం ద్వారా సమస్యల పరిష్కారం కావని ఆయన స్పష్టం చేశారు. విద్యార్థుల హక్కుల కోసం బీజేపీ బీజేవైఎం నిరంతరం పోరాటం చేస్తాయని గంగా ప్రసాద్ స్పష్టం చేశారు. ఎన్ని అరెస్టులు నిర్బంధాలు చేసినా బీజేపీ, బీజేవైఎం కార్యకర్తలు ఉద్యమం నుంచి వెనక్కి తగ్గేది పరిస్థితి లేదన్నారు. ప్రభుత్వం ఇకనైనా స్పందించి పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను తక్షణమే విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## వారసత్వ ఆస్తి వివాదాలకు చట్టమే పరిష్కారం

- **రెవెన్యూ అధికారులు, న్యాయస్థానాలను ఆశ్రయించాలి**
- **భూ వివాదాల పేరుతో దౌర్జన్యాలకు పాల్పడితే కఠిన చర్యలు**
- **ప్రజావాణిలో 10 ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ సునితారెడ్డి**

**వనపర్తి, సెప్టెంబరు 07(ప్రజాక్షేత్రం)**



వారసత్వ ఆస్తులు, భూములు, స్థలాల విషయంలో కుటుంబ సభ్యుల మధ్య తలెత్తే హక్కులు, వాటాల వివాదాలను చట్టబద్ధ మార్గంలోనే పరిష్కరించుకోవాలని జిల్లా ఎస్పీ సునితారెడ్డి సూచించారు. ఆస్తి మనదేననే భావనతో చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని బెదిరింపులు, దౌర్జన్యాలు, బలవంతపు ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఎస్పీ ప్రజల నుంచి నేరుగా 10 ఫిర్యాదులను స్వీకరించారు. వీటిలో ఏడు భూ, ఆస్తి వివాదాలకు సంబంధించినవి కాగా.. ఒకటి భార్యాభర్తల మధ్య వివాదం, మరో రెండు పరస్పర గొడవలకు సంబంధించిన ఫిర్యాదులు ఉన్నాయి. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్లు, ఇతర వారసుల మధ్య ఆస్తుల పంపకం, పట్టాలు, హక్కులు, వాటాలు, సరిహద్దులు, వారసత్వ హక్కులకు సంబంధించి వివాదాలు ఏర్పడితే అవి ప్రధానంగా సివిల్ స్వభావానికి సంబంధించినవని తెలిపారు. సంబంధిత రెవెన్యూ అధికారులను సంప్రదించడం లేదా అవసరమైతే న్యాయస్థానాన్ని ఆశ్రయించి హక్కులను చట్టబద్ధంగా పొందాలని సూచించారు.

**దౌర్జన్యాలకు పాల్పడితే చర్యలు**

భూ, ఆస్తి వివాదాల పేరుతో ఇతరులను బెదిరించడం, దాడులకు పాల్పడటం, బలవంతంగా భూములను ఆక్రమించడం, మోసాలకు పాల్పడటం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించడం వంటి చర్యలను సహించేది లేదని ఎస్పీ స్పష్టం చేశారు. అలాంటి చర్యలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కుటుంబ ఆస్తుల వివాదాలు వ్యక్తిగత కక్షలు, గొడవలు, దాడులకు దారితీయకుండా ప్రతి ఒక్కరూ సంయమనం పాటించాలని సూచించారు.

సాధ్యమైన చోట కుటుంబ సభ్యులు చర్చల ద్వారా సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని, పరిష్కారం సాధ్యం కాని సందర్భాల్లో రెవెన్యూ అధికారులు లేదా న్యాయస్థానాన్ని ఆశ్రయించాలని ఎస్పీ సూచించారు.

**ప్రతి ఫిర్యాదును పరిశీలించాలి**

ప్రజావాణికి వచ్చిన ప్రతి ఫిర్యాదును నిష్పక్షపాతంగా పరిశీలించి, చట్టపరిధిలో తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఎస్పీ ఆదేశించారు. బాధితులకు చట్టపరమైన పరిష్కారం అందేలా సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకోవాలని సిబ్బందికి సూచించారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా పోలీసు అధికారుల దృష్టికి తీసుకురావడానికి ప్రజావాణి మంచి అవకాశమని పేర్కొన్నారు.



## ఫీజు బకాయిలపై బీజేపీ లడాయి

- **అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న బీజేపీ నాయకుల ముందస్తు అరెస్టు**

**సంస్థాన్ నారాయణపురం, సెప్టెంబర్ 07(ప్రజాక్షేత్రం):**

విద్యార్థుల ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ ఎన్. రామచందర్ రావు పిలుపు మేరకు సోమవారం అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళ్తున్న బీజేపీ సంస్థాన్ నారాయణపురం మండల అధ్యక్షులు సుర్వి రాజు గౌడ్, బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర నరసింహ గౌడ్, వంగరి రఘు, జిల్లా నాయకులు భూస శీను, మండల ఉపాధ్యక్షులు సుర్వి వెంకటేష్ గౌడ్, యువమోర్చా మండల ప్రధాన కార్యదర్శి కట్కూరి శ్రీకాంత్ గౌడ్, ఓబీసీ మోర్చా మండల ఉపాధ్యక్షులు సుర్వి లింగస్వామి గౌడ్, నాయకులు సంగిశెట్టి లక్ష్మీనారాయణ, వీరమల్ల జంగయ్య గౌడ్, బూత్ అధ్యక్షులు సుర్వి సురేష్‌గౌడ్, వంటల గణేష్ యాదవ్, నమస్తే అన్న గార్లను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షులు సుర్వి రాజు గౌడ్ మాట్లాడుతూ..."విద్యార్థుల జీవితాలతో ఆడుకోవడం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రికి అలవాటుగా మారింది. విద్యార్థులకు రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం విడుదల చేయకుండా వారి విద్యా భవిష్యత్తుతో చెలగాటమాడుతోంది. విద్యార్థుల ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేసి, వారి విద్యకు ఎలాంటి ఆటంకం కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. విద్యార్థుల పక్షాన, వారి భవిష్యత్తు కోసం పోరాడుతున్న భారతీయ జనతా పార్టీ నాయకులను ముందస్తుగా అరెస్టు చేయడం సిగ్గుచేటు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపే హక్కును ప్రభుత్వం అణచివేయడం సరైన విధానం కాదు.విద్యార్థుల ఫీజు బకాయిలు విడుదల చేసే వరకు భారతీయ జనతా పార్టీ పోరాటం ఆగదు" అని సుర్వి రాజు గౌడ్ స్పష్టం చేశారు.

Printed, Published and Owner by K PRAVEEN KUMAR, Printed at MR Publications, A-20, Vambay Colony, Upparpally, Ranga Reddy (Dist), Hyderabad, Telangana 500048. Published at H.NO. 2-50 Shankar pally, Ranga Reddy. Hyderabad, Telangana 501203. Editor: KPRAVEEN KUMAR. Phone number 9177920459, email id: prajakshetram1@gmail.com, https://prajakshetram.com PRGI NO. TGTEL/25/A2394